జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

బెజవాడ, 1946

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu

Bejavāḍa, 1946

Record no. 100

Bibliographic Record Target

జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు / పి. సి. జోషి. - బెజవాడ : ప్రజాశక్తి కార్యాలయం, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu / Pi. Si. Jōṣi. - Bejavāḍa : Prajāśakti Kāryālayaṃ, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

మూడవ భాగం

స్వాతంత్ర్యానికి ఎవరిది సరైన మార్గం

పి. సి. జోషి

12 అ.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

పి. సి. జోషి

మూడవభాగం

స్వాతంత్ర్యానికి ఎవరిది సరైనమార్గం

ప్రజాశక్తి కార్యాలయం
బెజవాడ

ప్రచురణ నెం. 138

ముప్పావలా

ప్రజాశక్తి ప్రెస్, మొగల్‌రాజపురం, బెజవాడ.
పర్మిట్ నెం. కె. 13/సి.—10,000 — 15—2—46.

మూడవ భాగం

XIII

మీ విడుదల తరువాత

మీపై ఎన్నెన్ని ఆశలు పెట్టుకున్నామో పదేపదే వివరించాము. మీ నాయకత్వాన్ని కాంగ్రెసులో ఇతరులందరికన్నా ఎక్కువగా విమర్శిస్తూవచ్చింది మేమే. మీపై లేనిపోని భ్రమలు పెట్టుకోలేదు. మీ పరస్పర విరుద్ధధోరణిని మేము స్పష్టంగా చూడగలిగాము. అయినప్పటికీ మీరు సరియైన మార్గానికి వస్తారనీ, దేశాన్ని ముందుకు నడుపుతారనీ హృదయపూర్వకంగా ఆశించాము. కాని మాఅనుమానాలు నిజమయాయి. ఆశలన్నీ నేల కొరిగాయి.

మీ అందరిలోనూ గాంధీజీ ఉత్తమోత్తములు. ఆగస్టు తీర్మానం సందర్భంలో వారికీ మాకూ తీవ్ర భేదాభిప్రాయాలు కలిగాయి. వారు తమ సత్యదృష్టితో పరిస్థితులను పరిశీలించారు. తమ అనుభవాన్నిబట్టి ఆలోచించారు. ఆనాటి పరిస్థితులలో దేశానికి శ్రేయస్కరమని మేము సూచించిన మార్గానికే వారూ వచ్చారు.

ఆగస్టు "పోరాటా"-నికి తనదిగాని, కాంగ్రెసుదిగాని ఏమీ "బాధ్యత" లేదని వారు ఖచ్చితంగా చెప్పారు. ఆ రోజుల్లో కాంగ్రెసు పేరిట జరిగినదానినంతా ఒకవిధంగా ఖండించారు.

యుద్ధపరిస్థితుల్లో "సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించాలనే ఉద్దేశం తనకు లేదని తాను చేసిన మొట్టమొదటి ముఖ్యప్రకటనలోనే (గెల్డర్‌తో సంభాషణ) వారు స్పష్టంచేశారు. ఆగస్టు తీర్మానంలోని రెండవభాగం అమలులోనికి రాలేదని తెలియజేశారు. అంటే—తా నా జైలులో ఉన్నకాలంలో జరిగిన ఘటనలను తెలుసుకొని, ఆగస్టు తీర్మానంలోని కడపటిభాగాన్ని రద్దుచేశారన్న మాట. ఆనాడు 1942 ఆగస్టు 8 వ

తేదీన మేము పదకొండుమంది ఏ. ఐ. సి. సి: కమ్యూనిస్టు సభ్యులం కోరింది ఇదే.

గాంధీజీ ప్రజలను నానా బీభత్సం చేస్తున్న కరువు రాకాసిని చూచారు. గుమ్మంలో పొంచిఉన్న జపాను ఫాసిస్టు మూకల్ని గమనించారు. వారి హృదయం ఆవేదనతో చలించిపోయింది. అంత తీవ్రంగా చలించిపోవడం వారిలాంటివారికే సాధ్యం. ఆ విషమ పరిస్థితులను తొలగించాలనే సంకల్పంతో బ్రిటిష్‌వారితో ఒడంబడికకు ఆచరణయోగ్యమైన సూచనలు చేశారు. తక్షణమే తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించడానికి కొత్తమార్గం చూపించారు. ఆ సూచనల్లో వారి హృదయవేదనంతా ప్రతిబింబించింది. జపాను ఫాసిస్టు వ్యతిరేకత, సోదర ప్రజల శ్రేయోభిలాష, మాతృదేశ స్వాతంత్ర్య వాంఛ, మిత్రరాజ్య విజయ కాంక్ష — ఇవన్నీ వాటిలో మూర్తీభవించాయి. అంటే — దేనినయితే తక్షణ కర్తవ్యంగా కమ్యూనిస్టులం ప్రచారం చేస్తూ వచ్చామో, దానినే గాంధీజీకూడా సూచించారు గాని, మా వ్యతిరేకులు కాంగ్రెసు పేరిట చెబుతూ వచ్చినదానిని కాదు. కాంగ్రెసుతరపున మాట్లాడగల అధికారాన్ని గాంధీజీకి మీరేకదా ఇచ్చారు?

అంతేకాదు. 1942లో పాకిస్తాన్ కోరికను "ఒక మహాపాతకం" అన్నారు గాంధీజీ. 1944 లో భారతదేశానికి విముక్తి కలిగించే మార్గం కోసం, లీగుతో ఒప్పుదలకుదర్చగల పంథాకోసం వెదుకులాడడం ప్రారంభించారు. "ముస్లిం ప్రజలకు అత్యధిక ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ"గా ముస్లింలీగును వారు గుర్తించారు. ('టైమ్సు ఆఫ్ ఇండియా' 1944 ఏప్రిల్ 29) స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించారు; లీగు కోరికను సగం వరకయినా నెరవేర్చగల సూచనలు చేశారు.

గాంధీజీ స్వయంనిర్ణయాన్ని సూత్రప్రాయంగా ఒప్పుకున్నా, ఎక్కువకాలం జిన్నా దృక్పథం తప్పని జిన్నాను ఒప్పించడానికే వినియోగించాడు.

ఫలిత మేమంటే గాంధీజీ జిన్నాయొక్క హిందువుల పెత్తనం చేయడానికే జూస్తున్నారన్న భయాన్నే ఎక్కువచేశాడు.

గాంధీజీ కూడా తక్కిన హిందూనాయకుల మాదిరేఅన్న జిన్నా అభిప్రాయాన్నే ధృవపరిచాడు.

కాంగ్రెసు మెజారిటీసంస్థ. గాంధీజీ దానికి నాయకులు. ముస్లింలు తమ జన్మభూములలో సంపూర్ణ స్వాతంత్ర్యం కలిగి ఉండగల మార్గం ఆలోచించడం గాంధీజీ బాధ్యత. అందరూ కలిసి భారత స్వాతంత్ర్యాన్ని సాధించడానికి, ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోడానికి ముస్లింలు ఏమి చేయవలసి ఉంటుందో తాను స్పష్టీకరించాలి. స్వతంత్ర భారతదేశం ఒక ఉమ్మడి కుటుంబంగా ఉండాలని గాంధీజీ ఊహ. అది సరియయినదే. కాని. ఆ ఉమ్మడి కుటుంబంలో పెద్దఅన్న చిన్ని తమ్ముళ్ల న్యాయమైన కోర్కెలను అంగీకరించాలి. ఆపైని, కుటుంబం మొత్తంయొక్క క్షేమానికి ఎవరి పాత్రను వారు భక్తి, శ్రద్ధలతో, నిర్వర్తించాలని కోరాలి. పరస్పర విశ్వాసంలేని కొరతను తీర్చడానికి, చిన్నాభిన్నంకానున్న కుటుంబాన్ని తిరిగి చేరదీయడానికీ అదేమార్గం. అందరినీ బానిసలుగా చేసి కూర్చున్న పరాయి పెత్తందార్లను అందరూ ఏకముఖంగా ఎదుర్కొనేలా చేయడానికి ఇదేపద్ధతి. ధర్మంకోసం పోరాడి విజయం సాధించామనే ఉద్వేగాన్ని అందరిలోనూ కలిగించి, స్వాతంత్ర్యదీక్షను ద్విగుణీకృతం చేయడానికిదే దారి. అందరినీ ఉత్తేజితులనుజేసి, సర్వకాల సర్వావస్థలందూ అందరినీ ఏకబాటను నడిపించగల పంథా ఇదే.

మాపైని నీచాతినీచమైన ప్రచారాన్ని గాంధీజీ ఎదుట గుమ్మరించారు. ఒకరుకాదు - ఇద్దరుకాదు - వారికి ఇష్టులూ, అభిమానపాత్రులూ అయినవారు వందలకొలది చేశారీపని. మాలో బహుకొద్దిమంది; చాల కొద్దిసార్లు వారిని కలుసుకున్నాం. అదికూడా ఏదో సామాన్యపనిమీదనే. మాకు వ్యతిరేకంగా ప్రచారమయిన దానినంతా విన్నారు గాంధీజీ. మా వాదనను వారేమీ వినలేదనే చెప్పాలి. అయినప్పటికీ వారు జోషీకి ఇలా రాశారు.

"మీశక్తిసామర్థ్యాలను నే నెరుదుగును. సమర్థులైన యువతీయువకులు మీలోఉన్నారు. నేనెంతస్వార్థరహితుడ ననుకుంటున్నానో వారూ అంత నిస్స్వార్థులే. మీరంతా కష్టపడిపని చేసేవారు. అపారమైన శక్తిసంపన్నులు. మీ సభ్యులనందరినీ చక్కని క్రమశిక్షణలో ఉంచుతారు. ఈ గుణాలన్నిటినీ నేనెంతో ప్రశంసిస్తున్నాను. ఏవో అభిప్రాయాలుపెట్టుకొని నేనిలాంటి వారిని పోగొట్టుకోజాలను."

(గాంధీ - జోషీ లేఖలు 19 వ పుటలో)

ఇలాంటిప్రశంస గాంధీజీనుంచి రావడం మాకెంతో సంతోషమయింది. తాను నమ్మినధర్మాన్ని తప్పని సత్పురుషులువారు. మమ్మల్ని గురించి వారికి స్వయంగా తెలిసింది బహుస్వల్పం. మా వ్యతిరేకులు చేసిన విషప్రచారం అనంతం. అయినప్పటికీ మాపార్టీ కార్యతత్పరుల పార్టీ అన్న నిర్ణయానికి వారు రాగలిగారు. మార్గదర్శకంగా ఒక మహత్తర ధర్మం లేనిది ఈ కర్మనిరతి అసంభవమన్న విషయాన్ని గాంధీజీ తమంతట తామే గ్రహిస్తారని ఆశించాం.

మీరు వెనక్కి దారితీస్తున్నారు

పాతికేళ్ళనుంచీ మీరు దేశానికి నాయకత్వం వహించారు. గాంధీజీ నమ్మిన సహచరులుగా ప్రజలు మిమ్మల్ని గుర్తిస్తున్నారు. ప్రజలు మిమ్మల్ని విశ్వసిస్తున్నారుకాబట్టే మీ రీ నాయకత్వస్థానంలో ఉండగలుగుతున్నారు. అలాంటి మీరు తిరిగి కార్యరంగంలోకి వచ్చినప్పుడు గాంధీజీ యెంతవరకైతే వెళ్ళారో అంతకన్నా ముందుకుపోతారని ఎదురుచూశాం: వెనక్కి పోరని ఆశించాం.

మీరువచ్చి అనసాగిన మాటలను, చేయనారంభించిన పనులను తగు శ్రద్ధతో గమనించాం. గాంధీజీ కొంతవరకయినా న్యాయాన్ని గుర్తించారు: మారిన పరిస్థితులకు తగిన దృక్పథాన్నలవరచుకున్నారు. మీరదంతా వదిలిపెట్టి వెనక్కి నడువ నారంభించారు. మాకది హృదయ విదారకమయింది.

ఈనాడు మీకూ మాకూ విభేధాలున్నాయి. మునుపుకూడావుండేవి. ఈ యుద్ధకాలంలో అవి మరింత తీవ్రమయాయి. వీటన్నిటికీ కారణం మేము కమ్యూనిస్టుల మవడమూ, మీరు కాకపోవడమూ కాదు. మన ప్రజల నెదుర్కొంటున్న ప్రధాన సమస్య - దేశ విముక్తికి శ్రేష్ఠమైన దగ్గరదారి ఏది? అన్న సమస్యపై దృక్పథాలు వేరు కావడమే యీ విభేదాలకు కారణం. దేశ స్వాతంత్ర్య సాధనమే కాంగ్రెసు ప్రధానాశయం. ఆ ఆశయమే మమ్మల్నందరినీ కాంగ్రెసు జెండాక్రింది కాకర్షించింది.

యుద్ధకాలంలో వచ్చిన సమస్యలను గురించే మీ రిపోర్టులో ప్రస్తావించారు ఆసమస్యలకు సంబంధించినంతవరకే జవాబుచెప్పాము. అంతకు పూర్వకాలంలో కాంగ్రెసుకు కమ్యూనిస్టులకూ గలసంబంధబాంధవ్యాలను గురించి తప్పుఅభిప్రాయాన్ని మీ రిపోర్టుతెలిపింది. కాని, మేముఆవిషయం తడవనే లేదు.

మొదటిదశలో యుద్ధమేఘాలు మన దేశానికి ఎంతో దూరాన ఉన్నాయి. ప్రపంచంలోని అభ్యుదయ కాముకులందరూ తీవ్రంగా ద్వేషించే వ్యక్తి (చర్చిల్) బ్రిటిష్ ప్రభుత్వానికి నాయకుడుగా ఉన్నాడు. హృదయం లేని ఒక మొద్దు (లిన్‌లిత్గో) వైస్రాయిగ ఇండియాలో ఊరేగుతున్నాడు. అలాంటి ఆ మొదటిదశలో భారతస్వాతంత్ర్య సాధనకు దేశవ్యాపిత ప్రజాపోరాటాన్ని వెంటనే ప్రారంభించండని మిమ్మల్ని కోరాము. ఆపోరాటానికి తగిన పరిస్థితులను దేశంలో నెలకొల్ప నారంభించాము.

ఆరోజుల్లో మేము తొందరపడుతున్నామని మీరు భావించారు. ఎప్పుడూ 'విప్లవం' 'విప్లవం' అని కలవరించే పిచ్చివాళ్ళ మనుకున్నారు. బ్రిటనుకు ప్రమాదం ఎంత తీవ్రమయితే అంతగా బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని వదలుకోడానికి సిద్ధపడుతుందనీ; కాబట్టి కాంగ్రెసుకున్న రాజకీయ బలాన్నంతా చేతిలోపెట్టుకొని కూర్చుంటే చాలుననీ; వారేమీ చేయనక్కర లేదనీ మీరు ఊహించారు. అదంతా తప్పు అంచనా. బ్రిటనుకు ప్రమాదం

తీవ్రమవడం చూచారు. కాని, ఆ లిన్‌లిత్గో పాడినపాటే పాడాడు. ఇంకా అధ్వాన్నంగా పాడాడు. ఈవిధంగా మీ అంచనా తప్పయినకొద్దీ మీలో ద్వేషం పెచ్చుపెరిగింది. యుద్ధం రెండవ దశలో 'ప్రజాయుద్ధ' మన్న మాట మీకెంత అసహ్యాకరమయిందో, ఆ మొదటిదశలో 'బ్రిటన్' అన్న మాటే అంత రోతయింది.

రెండవదశలో సామ్రాజ్యవాదం యొక్క భయంకర స్వరూపమైన ఫాసిజం ఇండియాను కబళించడానికే నోరు తెరచింది. ఆ ఘోరప్రమాద సమయంలో మీరు ప్రజా పోరాటాన్ని తలపెట్టారు. మొదటిదశలో చేయ నిరాకరించిన దానిని ఆ విపద్దశలో చేస్తామని బెదరించారు. ఈసారికూడా మీ అంచనాలు మొదటిలాగానే సాగాయి. ఒక్క బ్రిటన్ ఉనికికే కాకుండా భారతదేశంయొక్క మనుగడకే భంగం కలిగిస్తున్న పరిస్థితులను మీరు, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సదవకాశంగా లెక్కకట్టారు. జపానువారు రాకముందే, "మెరుపులాంటి ఒక చిన్నపోరాటం"తో మీరు, ఇతరప్రజానాయకులతో కలిసి ఢిల్లీలోఅధికారాన్ని చేబట్టగలమనుకున్నారు.

ఆవిధంగా అధికారాన్ని గుంజుకొని, జపాను దురాక్రమణదారులను ప్రతిఘటించడానికి భారతప్రజల నందరినీ సంఘటితపరచి, ఇతర వలసదేశాల ప్రజలను జపాను బానిసత్వంనుండి విముక్తిచేసి, సామ్రాజ్య వాద ప్రభుత్వాలు తిరిగివచ్చి తిష్టవేయకుండా చేయగలమనుకున్నారు: మీ శక్తిని అంతగా అంచనా వేశారు.

బ్రిటిష్ పరిపాలనను తప్పకుండా కూలద్రోయగలమనీ, జపాను దురాక్రమణను జయప్రదంగా ప్రతిఘటించగలమనీ మీరు రూఢిగా నమ్మారు. ఆపరిస్థితుల్లో ప్రజాపోరాటం తగదు అని మేము వాదించినప్పుడు మమ్మల్ని చులకనచేశారు. చరిత్రనుండి మేమేమీ నేర్చుకోలేదనుకున్నారు. అనుభవంలేని కుర్రవాళ్ళక్రింద లెక్కగట్టారు. ప్రమాద పరిస్థితులను చూచి బెదరిపోయా మనుకున్నారు. సోవియట్ యూనియన్ పట్ల గల దురభిమానంకొద్దీ మాతృదేశ శ్రేయస్సునే మరచిపోయామని

నిర్ణయించుకున్నారు. సోవియట్ యూనియన్‌కోసం రాజకీయంగా ఆత్మబలిదానం చేసుకుంటున్న వెర్రిబాగులవారికింద మమ్మల్ని లెక్కగట్టారు.

తరువాత మీరు అరెస్టయారు. మూడేళ్ళ ఒకమాసానికి విడుదలయారు. దయచేసి ఈ దిగువ వాటికి జవాబు చెప్పమని కోరుతున్నాం

తప్పెవరిది?—ఒప్పెవరిది?

దేశానికి ఆచరణయోగ్యమూ విప్లవకరమూ అయిన మార్గం చూపామని మీరన్నారు ఆమార్గంనుండి ఇక తిరిగిపోవడం లేదన్నారు. మీరు 'రాజకీయంగా ఒక జూదమాడుతున్నార'నీ అందులో ఓటమి తప్పదనీ ఆనాడు మేమొక్కరమే ఖచ్చితంగా విమర్శించాము. మీరుచెప్పండి—మేమన్నది నిజమయిందా? మీరన్నదా?

మేము చూపినమార్గంలో లోపమేమీ లేదు. కాని మేములేనప్పుడు కాంగ్రెసునాదులు దానిని సరిగా అనుసరించలేక పోయారు—పైగా బ్రిటిష్ వారు సాగించిన హింసాకాండకు తట్టుకొని ప్రజలు నిలవలేకపోయారని మీరంటారేమో. అలా అయితే మాదొకమనవి. కాంగ్రెసు సోషలిస్టులు. ఫార్వర్డుబ్లాకువారు వాదించినతీరు ఇదే. తమ వినాశకరపంథా యొక్క నిజస్వభావాన్ని కప్పిపుచ్చడానికి వారు వాళ్ళమీదా వీళ్ళమీదా వంకపెట్టేరు. మీరు కూడా ఆస్థితికి దిగజారవద్దని మామనవి. ఇరవై అయిదేళ్ళనుంచీ కాంగ్రెసు అనుసరిస్తూ ఉన్నది మీ రాజకీయపంథాయే: దానికి నాయకత్వం వహించి నడుపుతూ ఉన్నది మీరే. బ్రిటిష్‌ప్రభుత్వంతో సంప్రదించవలసి వచ్చినప్పుడు కాంగ్రెసు మహాసంస్థ తరపున మీరే మాట్లాడతారు, మీ నాయకత్వం దేశ స్వాతంత్ర్యానికి దారితీస్తుందని భారత ప్రజానీకం లో అత్యధికభాగం నమ్ముతూంది. స్వాతంత్ర్యానికి చిహ్నప్రాయంగా వారు కాంగ్రెసును ఆరాధిస్తారు. అట్టి మహాసంస్థకు నాయకులుగా మిమ్మల్ని గుర్తిస్తున్నారు.

మిమ్మల్ని మరోప్రశ్న అడుగుతున్నాం. మీపంథాయే సరియయిన దని మీరు నమ్మినట్లయితే, విడుదలయిన తరువాత ప్రజాపోరాటం ఊసే ఎత్తకుండా, చివరకు సిమ్లాకు ప్రయాణం కట్టారెందువల్ల?

మీ మాటలుగాదు, మీ చేతలను తీసుకుందాం

విడుదలయి వచ్చినతరువాత కాంగ్రెసు అధ్యక్షుడు మౌలానా అజాద్ చేసిన మొట్టమొదటి పనేమిటి? యుద్ధకాలంలో ప్రజాపోరాటం ఉండదని ప్రకటించారు. అంటే—1942 లో మే మే నిర్ణయానికైతే వచ్చామో, అదే నిర్ణయానికి వారు 1945 లో వచ్చారన్నమాట. మీ అం దరి తరఫునా వారు ప్రకటన చేశారన్నది సుస్పష్టం. పరాజయ పరం పరలూ, ఎన్నడూ ఎరుగని పరాభవాలు కావలసి వచ్చాయి, మీగా నిర్ణయానికి రావానికి. పరిస్థితులను సవ్యంగా అవగాహన చేసుకోవడం ద్వారా 1942 లోనే మే మా నిర్ణయానికి వచ్చాం. మీ పంథా పరాజయా లకు పరాభవాలకు దారితీస్తుందని అప్పుడే హెచ్చరించాం. కీర్తిప్రదము, ధర్మసమ్మతము, విజయదాయకము అయిన మార్గాన్ని సూచించాము.

మీరు భారతజాతికి చక్కని ఆశయాన్ని చూపారు. కాని దానిని సాధించడానికంటూ తద్వ్యతిరేకమయిన పంథాను నిర్ణయించారు. రాజ కీయ నాయకవర్గం ఇంత పెద్ద పొరపాటు చేసినప్పుడు, ప్రజల్లో విభిన్న దృక్పథా లేర్పడక తప్పదు. మాటలకు చేతలకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించడం మానేశారు. సిద్ధాంతాలకు విలువ అంతరించింది. అధికారమే ప్రధానమయింది.

మీ స్వయం వ్యతిరేకపంథా దేశాన్ని గమ్యస్థానం చేర్చలేదు. అదివరకుండిన క్లిష్టసమస్యలన్నీ అలాగే వున్నాయి; మరింత క్లిష్ట మయాయికూడా. చివరకు అన్నివిషయాల్లోను "బ్రిటిష్‌వా రున్నంతకాలం ఏమీ సాధ్యంకాదు అనేది తారకమంత్రమైంది.

"బ్రిటిష్‌వా రున్నంతకాలం ఏమీ సాధ్యంకాద"నే భావం దేశంలో 1920 లో ఉదయించింది. ఆనాడాభావం ఉదయించడం విప్లవకర చైత న్యం. ఈ ఇరవైయేళ్ళలోనూ మీ రాజకీయ నాయకత్వంక్రింద జాతీయో

ద్యమం క్రమక్రమంగా పెరుగుతూవచ్చింది. ఇంత పెరిగినతరువాతకూడా ఆనాటి భావాకారాన్నే ఈనాడూ ప్రధానసూత్రంగా ఉపయోగించారంటే జాతీయవాదులు ఏ స్థితికి దిగజారిపోయారో ఊహించుకోవచ్చు. 1920 లో నూతన చైతన్యపూరితులైన భారత ప్రజలు, బ్రిటిష్‌సామ్రాజ్య వాదులపై అదివరకుండిన భ్రమ లన్నిటినీ పటాపంచలు చేశారు. ఆ నూతన చైతన్యంయొక్క ప్రతిబింబమే. "బ్రిటిష్‌వారిని సాగనంపడం అవసరం" అన్న భావం. ఆనాడది విప్లవకరమైన నూతన సూత్రం. కాని 1940 లో అది రాజకీయ దివాలాకోరు తనాన్ని, నిస్పృహావస్థనీ, కప్పి పుచ్చుకోడాని కొక ముసుగుగానే ఉపయోగపడింది. 1920 లో ఆ భావం ప్రజలను ఉత్తేజితుల్ని చేసింది. 1940 లో ప్రజలు ప్రధాన జాతీయ సంస్థల వెనుక సంఘటితమై ఉన్నారు. బ్రిటిష్ పరిపాలనను అంతమొందించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆ పరిస్థితుల్లో "బ్రిటిష్‌వా రున్నంతకాలం ఏదీ సాధ్యంకాద"ని చెప్పి ఊరుకోవడం ప్రజల్లో అంతఃకలహాలకు, ఒకరి నొకరు "బ్రిటిష్ గులాముల"ని తిట్టుకోడానికే దారితీస్తుంది. చివరకు, ఒకరిని కాదని ఒకరు ప్రత్యేకంగా బ్రిటిష్ పాలకులతో రాజీకోసం ప్రాకు లాడే పరిస్థితుల్ని కల్పిస్తుంది.

దేశానికి ప్రధాన శత్రువు లెవరో గుర్తించి, ఆ సామ్రాజ్యవాద ప్రభుత్వ మున్నంతకాలం ముక్తిలేదని గ్రహించడం 1920 లో మహత్తర నూతన చైతన్యం. 1940 లో భారత జాతీయ నాయకుల నెదుర్కొన్న ప్రధాన సమస్య — బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలద్రోసి, అధికారాన్ని ప్రజల హస్తగతం చేయడానికి ప్రజాశక్తుల నెలా సంఘటిత పరచడమా అన్నది।

అధికారాన్ని గుంజుకునే మార్గం

రాజకీయ నాయకుల కందరికీ అది అగ్నిపరీక్షాసమయం. బ్రిటిష్ ప్రభుత్వంనుండి అధికారాన్ని గుంజుకోగలరో లేదో అన్నది ఈ దిగువ విషయాలపై ఆధారపడిఉంది:

1. బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పెట్టుకున్న భ్రమలన్నీ పూర్తిగా తొలగిపోయాయా, లేదా? తమసోదర ప్రజలయెడల, ప్రపంచప్రజల యెడల శాశ్వతమైన విశ్వాసం ఏర్పడిందా? తాము నిర్ణయించుకునే విధానాలు ఈ విశ్వాసంపైనే ఆధారపడిఉంటాయా, లేదా?

2 .స్వాతంత్ర్యకాముకులయిన ఇతరప్రజల నాయకులను సోదరులుగను, స్వాతంత్ర్యపోరాటంలో సహచరులుగను గణిస్తున్నారా? లేక వారిని రాజకీయరంగంలో పోటీదారులుగానో, శత్రువులగులాములుగానో చూస్తున్నారా?

3. దేశంలోని జాతీయశక్తులనన్నిటినీ సంఘటితపరచాలంటే అన్ని జాతులకూ స్వాంత్ర్యమూ, న్యాయమూ, సౌఖ్యమూ చేకూర్చగలటావి భారతదేశాన్ని ఆదర్శంగా నిలపాలి. ఒకజాతి మరొకజాతిని అణగద్రొక్కుతుందేమోఅన్న భయానికి అవకాశంలేకుండా చేయాలి. నాయకులకందుకు తగిన న్యాయబుద్ధీ, నిష్కళంకస్వాతంత్ర్యదీక్ష ఉన్నాయా? లేవా ?

స్వాతంత్ర్యసాధనకు కలిగిన నూతన అవకాశాన్నిచూచి మీ మనసెంతో ఉత్సాహపడింది. కాని కొత్తగా బయలుదేరిన సమస్యల్లో ఒక్కదానినికూడా మీరు జయప్రదంగా ఎదుర్కొలేకపోయారు. 1920లో బయలుదేరిన నినాదాన్ని 1940లో కూడా ప్రజలు వల్లించడానికి కారణం ఇదే. మీ నాయకత్వంక్రింద జాతీయభావాలు వికసించడానికిబదులు సంకుచితమయ్యాయి. ఈ భావాలకు మచ్చుతునకలు;

1. జపానువారిని ఎదుర్కొవాలంటే బ్రిటిష్‌వారిని కూలద్రోయాలి అన్నధోరణినుండి క్రమక్రమంగా. మనం బ్రిటిష్‌వారిని పడగొట్టలేము - జపానువారిని రానివ్వండి అనే స్థితికి వచ్చారు.

ఆశయసిద్ధి పొందని దేశభక్తి నిరాశావాదంలోకి దిగజారింది. అలా వికృతమయికూడా దేశభక్తిగానే చలామణి కాసాగింది.

(2) కాంగ్రెసు ఏకైక జాతీయసంస్థ. ఇంకొకరి సహాయం లేకుండానే అది జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించగలదని మొదటిధీమా.

ఆగస్టు పోరాటం విఫలమయిం తరువాత - ఇతర సంస్థలు అడ్డుతగిలి "కాంగ్రెసు పోరాటాన్ని" ధ్వంసంచేశాయన్న వాదన బయలుదేరింది. కాబట్టి స్వాతంత్ర్య పోరాటాన్ని జయప్రదంగా సాగించాలంటే ఇలా అడ్డుతగిలిన 'జాతీయ వ్యతిరేక' సంస్థలను రూపుమాపాలనే ధోరణికి వచ్చారు.

సంకుచితదృష్టితో కాంగ్రెసును గొప్పగా చెప్పుకోవడం చివరకు మా పార్టీని, ముస్లింలీగును, తీవ్రంగా ద్వేషించడంకిందికి మారింది.

(3) బ్రిటిషువారిక్కడున్నంత కాలం మనదేశాన్ని కాపాడుకోలేము; అనే యీ వైఖరి కరువురోజుల్లో - 'స్వాతంత్ర్యం వస్తేనేగాని భారత దేశంలో తిండి దొరుకదు' అనే దృక్పధానికి దారితీసింది.

మన పవిత్ర జాతీయోద్యమంలో ఫాసిస్టు అనుకూలవర్గాలు చొరబడడానికి మొదటి ధోరణి అవకాశమిచ్చింది. అలాగే రెండవ దృక్పథం వర్తకులు తిండిదొంగలవడానికి. వుత్పత్తిదారులు దొంగవ్యాపారులవడానికి చక్కని అవకాశం కలిగించింది.

ఈ దొంగవ్యాపారాన్ని అరికట్టకుండా విడిచిపెట్టడానికి దేశభక్తి ఉట్టిపడే మాటలను ఒక ముసుగుగా ఉపయోగించారు. నిస్పృహాకొద్దీ దేశభక్తులు, సర్వసాధారణ సాంఘిక బాధ్యతలనుకూడా మట్టిగలిపారు.

మీరు చూపించిపోయిన పంథా ఫలితంగా జాతీయ భావాలు అనుకోకుండానే ఈ స్థితికి వచ్చాయి.

ఇదిగాఢమైన దేశభక్తి అనిపించు కొంటుందా? లేక సాంఘిక చైతన్యాన్ని మట్టిపాలు చేయడమనిపించు కుంటుందా? సంకుచిత ద్వేషాలను రెచ్చగొట్టడమనిపించు కుంటుందా?

ఈవిషాద పరిణామాన్ని మేము మానిత్య జీవితాల్లో అనుభవించాము, అప్పుడు జైలులో ఉన్నారు కాబట్టి మీకా అనుభవములేదు.

పరస్పర వైరుధ్యాలతో కూడుకున్న మీ ఆగస్టుపంథా విఫలమయింది. అంతటితో ఊరుకోలేదు. భారతప్రజల దేశభక్తి మూలసూత్రాలనే తలక్రిందులు చేసింది. జాతీయ చైతన్యాన్ని క్షీణింపజేసింది.

1. భారత జాతీయతఅంటే ఫాసిస్టు వ్యతిరేకతకు మరోస్వరూపం అని సగర్వంగా చెప్పుకోగల పరిస్థితులు అంతరించిపోయాయి. ఎవరయినా ఫాశిష్టుగానో ఫాసిస్టు అనుకూలుడుగానో ఉంటూనే దేశభక్తుడుగా ఊరేగగల పరిస్థితు లేర్పడ్డాయి.

2. జాతీయైక్యతకోసం ఆందోళన చేయడాన్ని దేశద్రోహంగా పరిగణించ సాగారు. దేశభక్తినంతా తన గుత్తసొమ్మేఅని కాంగ్రెసు చెప్ప నారంభించింది.

3. కరువు కాటకాలతో అలమటిస్తున్నాయి పట్టణాలు. అంటు జాడ్యాలతో చివికి జీర్ణించిపోతున్నాయి గ్రామసీమలు. ఈ ప్రజల జీవిత సమస్యలను తీసుకొని సేవచేయడంద్వారా ప్రజా స్వామిక చైతన్యాన్ని రేకెత్తించగలమనీ, ప్రజాద్రోహులను రూపుమాపగల ప్రజా ఐక్యతను నిర్మించగలమనీ మేమన్నాం. మామాటలను అపహాస్యం చేశారు.అదంతా వట్టి సంస్కరణవాదం, స్వాతంత్ర్య పోరాటానికి పనికిరానిచెత్త అని తృణీకరించారు. స్వాతంత్ర్య పోరాటం అంటూ ప్రజాస్వామిక పద్ధతులను దూరంగానెట్టేశారు. స్వాతంత్ర్య పోరాటం అని జపంచేస్తూనే తిండి దొంగలను,దొంగవ్యాపారులను తమ రెక్కక్రిందికి తీసుకున్నారు.

అవకాశాలను జారవిడిచారు

బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల కిరీటంలో వెలలేని రత్నం భారతదేశం. అంతేకాదు దాని ప్రాధాన్యత. వలసరాజ్యాల్లో కనీ వినీ ఎరుగని మహత్తర జాతీయోద్యమాని కిది పుట్టినిల్లు. ఆ జాతీయోద్యమం కాంగ్రెసులో మూర్తీభవించింది. 60 ఏళ్ళ ఈ జాతీయోద్యమ చరిత్ర మీ వెనుకనుంది. అలాంటి మీరు, చరిత్రలో ఎన్నడూ ఎరుగని విప్లవకర పరిస్థితులను కల్పించిన ఈ ఆరేళ్ళ యుద్ధకాలంలో సక్రమపంథా నవలంబించ లేకపోయారు. దేశ స్వాతంత్ర్యాన్ని సాధించలేకపోయారు; భావిప్రపంచానికి రూపందిద్దడంలో సముచితపాత్రను నిర్వహించ లేకపోయారు.

ఆ ఆరేళ్లూ ప్రపంచంలో ప్రతిదేశానికీ ఘోరవిపత్తులతో పాటు, మహదవకాశాలను కలిగించాయి. ఈ అవకాశాలను ఒక్కొక్కటిగ మీరు జారవిడిచారు. ఈనాడు మీతో భేధించే ప్రతివారినీ స్వాతంత్ర్య పోరాటం పేరు చెప్పి ఖండించే స్థితికి వచ్చారు, వాళ్ల ద్రోహం చేయబట్టే స్వాతంత్ర్యం రాలేదంటున్నారు. బానిస బంధాల్లో ఉన్న ఇండియావంటి పెద్ద దేశంయొక్క ప్రధానరాజకీయ నాయకవర్గం. ఇలాంటి రాజకీయ దివాలాకోరుతనాన్ని, అ సహనాన్ని ప్రదర్శించ నారంభిస్తే, ఒక్క మనదేశానికే కాకుండా, యావత్తు ప్రపంచానికే ప్రమాదం సంభవింపగలదు.

"పోరాడాం - ఓడిపోయాం - మళ్లాపోరాడతాం - ఈసారి సునాయాసంగా విజయం సాధిస్తాం" — అనేధోరణిలో నెహ్రూపండితుడు మాట్లాడుతున్నాతు. ఇదంతా అంత తేలికైన విషయంకాదు."

ఈ నాయకులే 1920, 1930 ఉద్యమాలు విఫలమయినప్పుడు ఈ మాటలే అనలేదా ? ప్రజలకు మీపైగల అపారమైన విశ్వాసంతోనూ, వారిలోరగులుతూన్న స్వాతంత్ర్యవాంఛతోనూ, మీరు చెలగాటలాడుతున్నారు.

1942 లో ఓడిపోవడం అంతచిన్నవిషయంకాదు. దానిఫలితంగా మన దేశం అంతవరకు పొందిన అభివృద్ధినయినా నిలుపుకోలేకపోయింది. జాతీయభావాలు ఎంతో పతనమయిపోయాయి. రాజకీయ నిస్పృహావస్థ, విచ్ఛిన్నకర, సంకుచితజాతీయభావాలకు దారితీసింది. వీటిని పైనవివరించాము.

యుద్ధకాలంలో నూతనసమస్యలను గురించి, నూతనభావాలను ప్రసరిస్తూ, మనప్రధానసమస్యల పరిష్కారానికి ఆచరణయోగ్యమూ, నిర్మాణాత్మకమూ అయిన సూచనలుచేస్తూ సారస్వతాన్ని ప్రచురించింది మా ఒక్కపార్టీయే. ఇది కాకతాళీయంగా జరిగింది ఎంతమాత్రమూకాదు.

యూరపులోను, తూర్పుదేశాల్లోను సాగిన స్వాతంత్ర్యోద్యమాలనూ, వాటిని అణగద్రొక్కడానికి సామ్రాజ్యవాదపాలక వర్గాలు పన్నిన

కుతంత్రాలనూ జాగ్రత్తగా పరిశీలించి, వాటిని వ్యాఖ్యానిస్తూ సారస్వతం ప్రచురించడానికి దేశంలో మరేఇతర రాజకీయవర్గమూ ప్రయత్నించలేదు.

మన జాతీయసమస్యల్లో హిందూముస్లిం సమస్య, స్వయంనిర్ణయ సమస్య ప్రధానమయినవి. నానాటికీ రూపొందుతూన్న వివిధజాతుల సమస్యకూడా ప్రధానమయినదే. ఎందువల్లనంటే — ఈ జాతుల వికాసం విశాల భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒక నూతన చైతన్యస్థాయి. దీనిని జాగ్రత్తగా పరిశీలించి. అర్థంచేసుకోకపోతే ఈ వివిధజాతుల పరిణామం తప్పుదారులు త్రొక్కి, సంకుచితరూపం దాల్చుతుంది. ఈ ప్రధానసమస్యలను, ఇతర జాతీయ సమస్యలను వాస్తవికదృష్టితోను, నిష్కల్మష హృదయంతోను పరిశీలించడానికి మరే రాజకీయవర్గమూ ప్రయత్నించ లేదు.

యుద్ధకాలంలో మనదేశ ఆర్థికవిషయాల్లో వచ్చిన మార్పులను గురించిగాని, అవినీతిపరులయిన అధికారులకు, తిండిదొంగలకు గల సంబంధాన్ని గురించిగాని, తీవ్రంగా ఆలోచించిన పాపాన మరే రాజకీయ వర్గమూ పోలేదు. దేశంయొక్క ఆర్థికజీవితమంతా యుద్ధవ్యాపారాల్లో అధికలాభాలు సంపాదించినవారి గుప్పిట్లోకి పోయింది. అంతేకాదు. దేశంలోని ప్రధాన రాజకీయసంస్థలు కాంగ్రెసు - లీగులు రెండింటికీ వీరే పోషకులయారు. దానితో మన రాజకీయజీవితమంతా కూడా కళంకమయి పోయింది. ఈ విషయాన్నిగురించికూడా ఎవ్వరూ ఆలోచించలేదు.

యుద్ధకాలంలో ఉత్తేజకరమైన వ్యాసాలూ, గేయాలూ, రాసింది ఒక్క కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు సానుభూతిపరులే. ఇతరుల కలాలు మూలబడ్డాయి. ఇదికూడా తలవని తలంపుగా జరిగింది కాదు.

సామ్రాజ్యవాదుల విషప్రచారాన్నెదుర్కొని మిమ్మల్ని సమర్థించాం. మా శక్తికొలది దేశానికి సేవచేశాము. కార్యదీక్షతతో పనిచేశాం. నిర్మాణ దృష్టితో ఆలోచించాము. దేశాన్నెదుర్కొన్నవి ఎంత గడ్డుసమస్యలో, ప్రజల జీవిత మెంత దుస్తర మయిపోయిందో గుర్తించాము. జీవితంలో ఆనందం అంతరించింది! అంతా భరింపరాని ఒక ఆవేదన అయింది. ఆ

కాలంలో మేమెంత కృషిచేసినా, ఎప్పుడూకూడా కాంగ్రెసుపేరిట వ్యవహరించలేదు. మీరు లేనప్పుడు కాంగ్రెసుపేరు ఉపయోగించుకోగల హక్కు మాకు లేదనుకున్నాం.

మీరు బయటికివచ్చి ఈ సమస్య లన్నిటినీ నూతన దృక్పథంతో, దీక్షతో ఎదుర్కొంటారని ఆశించాము. అన్నీ మీరే చేసివేయగలరనే ధీమా మీలో ఉండడానికిక ఏమాత్రం కారణంలేదు. మీ అంచనాలన్నీ తప్పయాయి. మీ నాయకత్వం విఫలమయింది. నూతన ప్రపంచంలో మరే రాజకీయ నాయకుడూ అంత విఫల మనోరథుడు కాలేదు.

అందుకనే మీరు నూతన దృక్పథంతో తిరిగి ప్రారంభిస్తారని ఆశించాము. యుద్ధకాలంలో కలిగిన మహదవకాశాల నన్నిటినీ జారవిడిచారు. యుద్ధం ఆఖరుదశలో, ఉన్న కొద్ది అవకాశాల నయినా వినియోగించు కుంటారని ఎదురుచూశాం. యుద్ధానంతరంకూడా దేశం పరాయి పాలకుల పాదాలక్రింద నలగకుండా, ప్రజల చేతుల్లో దినదినాభివృద్ధి పొందగలదనే హామీ ఇస్తారని కొండంత ఆశ పెట్టుకున్నాం. ఆ ఆశలన్నీ అడియాసలయాయి.

సిమ్లా విషాదఘట్టం

యుద్ధకాలంలో ప్రజాపోరాటం ప్రారంభించాలనే ఉద్దేశం కాంగ్రెసుకు లేదని మౌలానా అజాద్ ప్రకటించారు. దానితో మీ రంతా సిమ్లా సమావేశంలో పాల్గొనడానికి ఏలాంటి ఆటంకం లేకుండా చేశారు. "ఒకరి తప్పుల నొకరం క్షమించుకోవాలి, మరచిపోవాలి" అని వైస్రాయి వేవెల్ విజ్ఞప్తి చేశాడు.

సిమ్లా సమావేశ ఫలిత మేమవుతుందో అని దేశం ఆబాలగోపాలం ఆతృతతో ఎదురు చూడసాగింది. పరిష్కారానికి వస్తారా? వచ్చి మాతృదేశాన్ని కన్నబిడ్డల చేతుల్లో పెడతారా? లేక ఈసారికూడా విఫులై, ప్రతిష్టంభనను చెక్కుచెదరకుండా విడిచిపెట్టి. భారతదేశాన్ని బ్రిటిష్

సామ్రాజ్యవాదుల ఇనుపపాదాల క్రిందనే ఉంచుతారా? జవాబుకోసం దేశం ఊపిరి బిగబట్టి ఎదురు చూడసాగింది.

మీ అంతట మీరే అన్నీ సాధించగలరనే వెనుకటి భ్రమలను వదులుకొని, అనైక్యతే దేశంయొక్క అధోగతికి కారణమని పూర్తిగా గుర్తించి ఉన్నట్లయితే సిమ్లాసమావేశంలో విజయం సాధించేవారు.

ఆనాడు ఎలాంటి వెర్రిభ్రమలూ పెట్టుకోకుండా స్పష్టమైన హెచ్చరిక చేసింది మేమొక్కరమే. దేశమంతా మీ ధోరణి ననుసరించి పరిష్కారం కుదిరి తీరుతుంది' అని ఊహాగానం చేయసాగింది,

మీరు క్రిప్సు రాయబారం సందర్భంలో అనుసరించిన పాతపద్ధతులనే సిమ్లాలోకూడా అనుసరించారు.

పరిష్కారం కుదుర్చుకోవాలనే ఉద్దేశమేగాని బ్రిటిష్‌వారి కుంటే, ఒక్క కాంగ్రెసుతోనే కుదుర్చుకుంటారు; మిగతా సంస్థలు లెక్కలోకి రావని మీరుభావించారు. ఆ ఇతర సంస్థలచేత ఒప్పించవలసినపని బ్రిటిష్ ప్రభుత్వానిదేగాని, మీబాధ్యత ఏమీ లేదనుకున్నారు.

మీరు మినహా, మిగతావారందరినీ బ్రిటిష్ అనుకూలుర క్రిందనే లెక్కగట్టారు,

ఆనాడు క్రిప్సుయెదుట మీరు బిర్రబిగుసుకు కూర్చున్నారు. వేవెల్ ఎదుట మెత్తదనం మీలో మూర్తీభవించింది. కావాలనుకున్న ఒడంబడిక కుదరడానికి ఈ మార్పే చాలనుకున్నారు మీరు. 'వీటో' అధికారం వైస్రాయికి ఉండకూడదని పట్టుబట్టి నిల్చున్నారు క్రిప్సు రాయబారం సందర్భంలో. సిమ్లా సమావేశంలో ఆపట్టుదల మాయమయింది. వేవెల్ ప్రతిపాదనల ప్రధాన సూత్రాలను మీరు బేషరతుగా అంగీకరించారు. సమావేశానికి నాయకుడుగా బ్రిటిష్ వైస్రాయి ఉండడానికికూడా మీ రంగీకరించారు.

ఇంతజరిగినా మీరు విఫలులయారు. ఇలా జరుగవచ్చునని ముందుగానే హెచ్చరించి, అందుకు కారణాలనుకూడా తెలిపింది మే మొక్కరమే.

సిమ్లా సమావేశంలో మీరు పొందిన ఫలితం ఒక్కటే — మీకూ, కాంగ్రెసుకీ ఎన్నడూ ఎరుగని తలవంపులు తెచ్చుకున్నారు,

'సోదరసంస్థ' ప్రాధాన్యతలో మీతరువాత ఎన్నదగిన సంస్థఅయిన ముస్లింలీగుతో ఒడంబడిక కుదుర్చుకో నిరాకరించారు. ఆ సంస్థ కోరికలు కొనసాగకుండా చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఏజంటును ఉపయోగించు కోవాలనుకునే మహాపరాధానికి ఒడిగట్టారు.

వేవెల్ మిమ్మల్ని చిత్తుచేశాడు. భారత అనైక్యతను ప్రపంచానికి ఎత్తి చూపాడు; అంతా చేసి, ధర్మపన్నాలు పలికాడు. అందరినీ క్షమించేసి, తప్పంతా తన నెత్తిన వేసుకుంటున్నట్లు నటించాడు. మిమ్మల్నందరినీ దయచేయమన్నాడు,

బ్రిటిష్ ప్రభుత్వం రాజీ కుదుర్చుకోవాలనుకుంటే, భారత జాతీయ శక్తితోనే కుదుర్చుకోవాలనీ. అది కాంగ్రెసులోనే మూర్తీభవించి ఉందనీ మీరు గర్జించారు. కాని, జరిగిందేమిటి ? ఇతర ప్రజాపక్షాలపట్ల మీకుగల సంకుచిత ద్వేషంకొద్దీ, వాటిని అణచడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల సహాయంకోసం ఎదురు చూడసాగారు. ఇది విప్లవకర వైఖరి ఎంత మాత్రం కాదు. సామ్రాజ్యవాదులను నమ్ముకోవడంవల్ల ఏర్పడిన దృక్పథమే.

దేశంలో ప్రప్రధానమైన రాజకీయ సంస్థ కాంగ్రెసు. జాతీయ శక్తుల నన్నిటినీ సంఘటితపరచవలసిన బాధ్యత దానిది. ఈ పవిత్ర బాధ్యతను నెరవేర్చడానికి బదులు బ్రిటిషు ప్రభుత్వపు ఏజంటుతో వంటరిగా రాజీ కుదుర్చుకోడానికి ప్రయత్నించడం: ఆ ప్రయత్నాలు నెగ్గుతాయని అనుకోవడం - అంతా మాకు అతిసాహసంగా కనుపించింది.

అది తెలివయిన పనీ కాదు; దేశభక్తీకాదు. సంకుచిత అహంకారం—అది, అధికారం కోసం ప్రాకులాడడం!

మేము జిన్నాగారిని ఏమాత్రమూ సమర్థించడములేదు. సిమ్లాసమావేశంలో మీవైఖరిని ఎంత తీవ్రంగా విమర్శించామో, ఆయన వైఖరినీ మా పత్రికల్లోనూ, ఉపన్యాసాల్లోనూ అంత నిశితంగా ఖండించాము.

ఇక్కడ ఆయన విషయం చర్చించడం లేదు. మీ రనుసరించిన విధానము, మీరు నిర్వహించిన పాత్ర, మీరు వేసుకున్న అంచనాలనే ఇక్కడ పరిశీలిస్తున్నాము. మన దేశమనే కుటుంబానికి మీరు పెద్దలుగా ఉండాలనుకున్నారు. కాని భాతృభావంతో, అందరితోను ఒప్పుదల కలిగి ఉండాలనే చింత మీకు లేనేలేదు. భారతప్రజాసామాన్యంలో ప్రధానలక్షణ మైన ఔదార్యాన్నికూడా మీరు మరచిపోయారు. వారిలో అంతర్భూతమై ఉన్న ధర్మబుద్ధిని మీరు విస్మరించారు. "పిట్టపోరూ పిట్టపోరూ పిల్లి తీర్చింది" అనేవారి నీతికథలనుకూడా జ్ఞప్తికి తెచ్చుకున్నారు కాదు.

మీ అంచనాలన్నీ నేలవిడిచిన సాములయాయి. మీ పద్ధతులన్నీ సంకుచితములు, విచ్ఛిన్నకరములయాయి. పీడితభారత ప్రజాకోటికి నాయకులందరిలోనూ మీరు పెద్దలు. అలాంటి మీకవి తగనివని పించుకున్నాయి. మీ రాజకీయ అంధత్వమే మిమ్మల్ని పరాభవాలపాలు జేసింది; కాంగ్రెసు-లీగు విభేదాలను తీవ్రతరం చేసింది. అంతేకాదు. కారుమబ్బులాగా మన దేశ వాతావరణాన్నలముకున్న నిస్పృహావస్థను మరికొంత దట్టంచేసింది.

నేర్చుకోవాలంటే సిమ్లా సమావేశ ఉదంతం ఎన్నో అమూల్యమైన పాఠాలను నేర్పగలదు. కాని మీరు నేర్చుకున్న పాఠంవేరు. "అడ్డుతగిలే" సంస్థలన్నిటినీ రూపుమాపి, ఆతరువాత రాజ్యాంగ నిర్మాణసభలో బ్రిటిష్ వారి నెదుర్కోవాలన్నదే మీరు గ్రహించిన పాఠం, ఇంతలో బ్రిటిష్‌వారు దేశంలో ఎన్నికలను ప్రకటించారు. ఇక 'అడ్డుతగిలే' వారిని అణచివేయడమే ప్రధానకర్తవ్యంగా పెట్టుకున్నారు మీరు.

సామ్రాజ్యవాదుల పన్నాగం

ఆరోజుల్లో బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల పన్నాగంసుస్పష్టమే. మాటల్లో పెట్టాలంటే అది ఇలా ఉంటుంది:

"భారతరాజకీయ పార్టీలూ, నాయకులూ తలొకదారిగా ఉన్నారు. వారిలో పొత్తుకుదరడం ఇంచుమించు అసంభవము. ఈ నాయకుల ప్రజల్లోకి వెళ్ళనివ్వండి. వెళితే వారు తమతమ అనుచరులమధ్య చీలికలనింకా ఎక్కువ చేస్తారు. ఎవరిమట్టుకు వారు తామే ఎక్కువ బలవంతుల మనుకుంటారు. ఎదుటివారిని మరింత ద్వేషిస్తారు. ఒకరినొకరు అర్థంచేసుకోడానికి ఏమాత్రమూ ప్రయత్నించరు. ఆస్థితిలో, ఎవరిమట్టుకు వారు రాజీకోసం మనదగ్గరకు వస్తారు. అప్పుడు మనమొక ఒడంబడికను నిర్ణయించి అందరిచేతా శిరసావహింప జేయగలము. 'ఈ పరిస్థితులలో ఇదే ఉత్తమమైన ఒడంబడిక' అనివారందరిచేతా అంగీకరింప జేయగలము. ఆ ఒడంబడిక అమలుజరిగేలా చూడడానికి మనం ఉండాలని వారందరూ అంగీకరిస్తారుకూడా, దానికితోడు మన హక్కులను కాపాడుకోవలసిన పనికూడా ఉంటుంది."

ఇదీ, మీరు లేవదీసిన 'క్విట్ ఇండియా' నినాదానికి సామ్రాజ్యవాదుల జవాబు.

మీరుచాల తొందరపడుతున్నారు. ఎన్నికల్లో గెలుపొందడమే ముఖ్యంగా పెట్టుకొని. ఆ ప్రయత్నాల్లోనే మునిగి పోయారు. మీరు లేనప్పుడు దేశంలో ఏమిజరిగిందో జాగ్రత్తగా పరిశీలించాలనే, దృష్టేకనపడదు. మహత్తరమైన బాధ్యతగల స్థానంలో మీరున్నారు. ఆ పదవికి తగని విధంగా మీరు ప్రవర్తిస్తున్నారు. మీతో ఏకభవించనివారి అభిప్రాయాలను, ముఖ్యంగా మా అభిప్రాయాలను, తెలుసుకోవలసిన పనే మీకక్కరలేనట్లుంది. మీరులేనప్పుడు జరిగినవిషయాలకు చిలవలుపలవలు కూర్చి, మీమనసు కెక్కేలాగా వర్ణించేవారినే దగ్గరకు చేర్చుకుంటున్నారు. వారు మీపట్ల వినయవిధేయతలను ఒలకపోస్తున్నారు. మీరు లేనప్పుడు కాంగ్రెసును వ్యతిరేకించారంటూ, తమకు అడ్డంవచ్చినవారినందరినీ తుడిచిపెట్టివేయడానికి చక్కని ప్లానులను సూచిస్తున్నారు.

పూర్వం, మొగల్ సామ్రాజ్యపురోజుల్లో, సామంతరాజులందరూ చక్రవర్తిదర్బారులో సమావేశమయినప్పుడు, ఎవరిమట్టుకువారు చక్రవర్తి ప్రత్యేకఆదరణను పొందడానికి ప్రాకులాడేవారు. ఆ దర్బారు ముగిసిన తరువాత ఎవరిరాజ్యాలకు వారుపోయి. ఇతర సామంతరాజులపై తమ కక్షల నెలా సాధించడమా అని మంతనాలు సాగించేవారు. సిమ్లా సమా

వేశంలోనూ, సమావేశం ముగిసిన తరువాతా, భారతరాజకీయ నాయకుల ప్రవర్తన అచ్చంగా ఆమధ్య యుగాలనాటి రాజుల ప్రవర్తనలాగానే ఉంది. మనదేశంలోమధ్యయుగాల ఛాయలు లేకపోలేదు. వాటినన్నిటిని తుడిచిపెట్టి దేశాన్ని నవనాగరికం చేయడం కోసమే మన మనజాతీయోద్యమం బయలు దేరింది. కాని, మీరాఉద్యమాన్ని నడుపుతూన్న పద్ధతి ఈ ఆశయ సిద్ధిని మరింత దూరం చేస్తూంది.

ప్రాచీన ఔన్నత్యం గలవారు మనప్రజలు. వీరికి జయప్రదంగా నాయకత్వం వహించాలంటే నాయకులు ఆధునిక సమస్యలను, ఆధునిక దృక్పథంతో పరిశీలించగలిగి ఉండాలి. అన్నిపక్షాల అభిప్రాయాలను నిష్పక్షపాతంగా తెలుసుకుంటూ, దురభిప్రాయాలు లేకుండా, యదార్థదృష్టితో, ఈ సమస్యలను శ్రద్ధగా పరిశీలించగలిగి ఉండాలి. క్లుప్తంగా చెప్పాలంటే—ఈ విషయంలో మీరీనాడు అవలంబిస్తున్న వైఖరికి పూర్తిగా వ్యతిరేకమైనవైఖరి నవలంబించాలి. మీవైఖరి ఉదహారణలు చెప్పాలంటే ఎన్నోఉన్నాయి. మాపైని మీరిపోట్లూ, మా విషయంలో మీ ప్రవర్తనా వీటిలో మచ్చుతునకలు, ప్రజలు నాయకుల పట్లప్రేమ చూపుతారు. ఆ ప్రేమనుచూచి, అదంతా తమ తెలివితేటల ఫలితమేనని, నాయకులు ఆత్మస్తుతికి పాల్పడితే, ఇకవారు ప్రజానాయకులుగా ఉండరు; ముఠానాయకులుగా దిగజారిపోతారు. తాము తెలివయినవారిమని గొప్ప చెప్పుకుంటూనే తెలివితక్కువ పనులుచేయ నారంభిస్తారు.

ఈ స్థితికి రావడంతోనూ తన అభివృద్ధికర భావాలను అవగాహనచేసుకోడానికిబదులు, వాటిని ప్రతిఘటించడం ప్రారంభమవుతుంది. ప్రజాసంస్థలను అభివృద్ధిచేయడంపోయి, ఉన్నవాటిని విచ్ఛిన్నంచేయడం జరుగుతుంది. ప్రజలను సంఘటిత పరచడానికిబదులు, మరింత చీలదీయడం ప్రారంభమవుతుంది. మాత్రదేశ స్వాతంత్ర్యసిద్ధికి ప్రజల్ని నడపడానికిబదులు, ఒకరిపైకొకరిని ఉసిగొల్పడం జరుగుతుంది.

బొంబాయి ఏ. ఐ. సి. సి. లో

పై ధోరణిలో సమాలోచనలు సాగిన తరువాత బొంబాయిలో మొన్నటి ఏ. ఐ. సి. సి. సభజరిగింది; మీ కార్యక్రమం వెల్లడయింది. అందులో కొత్తఏమీలేదు. అందుకు ముందేజరిగిన 'కాంగ్రెసు అసెంబ్లీ'ల సమావేశాలు నిర్ణయించినదే అదంతా. ఈ విధంగా, ప్రధాన నాయకులుదేశాన్నిముందుకు నడపడంపోయింది. తాములేనప్పుడు పెత్తనం సంపాదించిన ఒకముఠాయొక్క భావాలకూ, అభిప్రాయాలకూ, తాళం వేయనారంభించారు.

మీనాయకత్వం క్రింద ఏ. ఐ. సి. సి. దేశానికొక నూతన మార్గంగాని, నిర్మాణాత్మకమైన పంథాగాని సూచించలేదు. దాని నినాదాలన్నీ నిర్మాణ శూన్యమైనవే; లీగు వ్యతిరేకము, కమ్యూనిస్టు వ్యతిరేకమైనవే. దానికి పూర్వం జరిగిన రాష్ట్రకాంగ్రెసు అసెంబ్లీలలో కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమం సాగించాలని కార్యక్రమమిచ్చారు. కాని, ఎ. ఐ. సి. సి. లో ఎన్నికలలో విజయం పొందడమే ప్రధాన కార్యక్రమమయింది. ఆఎన్నికలకు ముఖ్యనినాదం కూడా పాతదే—'కాంగ్రెసుకు ఓటివ్వడమంటే స్వాతంత్ర్యానికి వోటివ్వడమన్నమాట' కాంగ్రెసుకు విజయం చేకూర్చి 'కాంగ్రెసు వ్యతిరేకుల'ను ముఖ్యంగా లీగు, కమ్యూనిస్టుపార్టీలను రూపుమాపడమే కాంగ్రెసువాదుల ప్రధాన కార్యక్రమంగా బోధించబడింది.

ఆ తరువాత సాగించిన ఉపన్యాసాల్లో మీరు లీగుపైన దుమ్మెత్తిపోయడం ప్రారంభించారు. లీగూ, కమ్యూనిస్టులూ మొదటనుంచీ కాంగ్రెసుకు అడ్డుతగులుతూ వచ్చారంటూ, మీకు తోచిన వివరాలివ్వసాగారు. స్వాతంత్ర్యాన్ని సాధించి తీరతామంటూ, ఒక్కొక్కప్పుడు సామ్యవాద వ్యవస్థనుకూడా కొంచెం ఆశచూపుతూ, మీరు ప్రజలనుండి సర్వాధికారాలు కోరారు.

ఆ ఏ. ఐ. సి. సి. సమావేశంలో పొందినంత ఆవేదన మేము మరెన్నడూ పొందలేదు. ఆ ఆవేదనమీరుమాపై పిడుగులు కురించినందుకు కాదు — అదెప్పుడూఉన్నదే. అభివృద్ధికరమైన ప్రజాస్వామిక సంప్రదా

యాలనెన్నిటినో కాంగ్రెసు స్థాపించింది. ఈనాడు మీ నాయకత్వం క్రింద కాంగ్రెసు వాటన్నిటికీ నీళ్ళు వదులుతూఉంది. అందుకే మా ఆవేదన.

కొన్ని సంవత్సరాలనుంచి మేము ఏ. ఐ. సి. సి. సభ్యులుగా ఉన్నాము. అంతర్జాతీయ పరిస్థితులపై తీర్మానం లేకుండా జరిగిన సమావేశాన్ని ఇంతవరకూ చూడలేదు. మొన్న బొంబాయిలోనే చూచాము. నెహ్రూపండితుడు లీగు కమ్యూనిస్టుపార్టీలకు వ్యతిరేకంగా ఆవేశంతో మాట్లాడాడు. కాని. అంతర్జాతీయ పరిస్థితులపై తన సహజధోరణి ఆ సమావేశంలో ఎక్కడా కనబడలేదు. యుద్ధానంతరం రూపొందుతూన్న మాతన ప్రపంచాన్ని అతనింకా స్పష్టంగా అవగాహన చేసుకోలేదని గ్రహించగలిగాము. కొంతమంది సోదర దేశస్థులపై వెంటనే కత్తి దూయడమే వారి కప్పుడు స్పష్టమైన కార్యక్రమమయింది.

ఆ సమావేశంలో "1942 పోరాటం — తదనంతరం" అని ఒక తీర్మానం జరిగింది. ఈ తీర్మానం ఆగస్టుతీర్మానంలో పేర్కొన్న 'అంతర్జాతీయ, జాతీయ ఆశయాల'ను పునరుద్ఘాటించింది. అయినప్పటికీ యుద్ధానంతరం మిగిలింది సామ్రాజ్యవాదులపోటీలే అని యీ తీర్మానం తేల్చింది ఈతీర్మానంలోనయినా సోవియట్ యూనియన్ ప్రసక్తిలేదు. సోవియట్ యూనియన్ మాటయినా ఎత్తకుండా జరిగిన సమావేశం ఇదొక్కటే. మీ ధోరణినిబట్టి చూస్తే నూతన ప్రజాస్వామిక యూరప్ యేర్పడనేలేదా అనిపిస్తుంది. జపాన్ను గురించికూడా ఒక్క మాటయినాలేదు. ఇదంతా పొరపాటున జరిగింది ఎంతమాత్రమూ కాదు.

నెహ్రూపండితుని అంతర్జాతీయ విధానమంతా వట్టి మాటల మూటే అనీ, దానివల్ల కలిగిన ప్రయోజనం ఆవిగింజంతయినా లేదనీ నాయకుల్లో కొందరు. రాతమూలకంగా కాకపోయిన్నా, నోటిమాటలతో నయినా అన్నారు. అనుచర వర్గాల్లో ఈ భావం ఇంకా ఎక్కువగా వ్యాపించింది. "ప్రపంచాధిపత్యంకోసం సామ్రాజ్యవాదుల పెనగులాటే ఈనాడు కనబడుతూంది. ఈ పరిస్థితుల్లో భారతదేశం తన వైఖరి నెందుకు బయిటపెట్టాలి ? ఏదోఒక విధంగా ముందు స్వాతంత్ర్యం సాధించాలి. మరొక

దేశం సహకారం లేనిది చరిత్రలో ఏదేశమూ తన స్వాతంత్ర్యాన్ని పొందలేదు. బ్రిటిష్‌వారు మనకేమి టివ్వడానికి సిద్ధపడతారో చూదాం. మూడవ ప్రపంచయుద్ధం ఎలాగూ తప్పదు. బ్రిటనుకు వ్యతిరేకంగా ఏ యే దేశాలు నిలబడతాయో చూదాం" — ఇదీ వారి వాదన తీరు.

పై తీర్మానంలో సోవియట్ యూనియన్ ప్రసక్తిగాని, దాని విజయాలను అభినందించడం గాని, లేకపోవడానికి కారణం ఇదే. పై కాంగ్రెసువాదుల వాదన ఇంకా ఇలా సాగింది :

"బ్రిటన్ని తోసిరాజు చేసి సోవియట్ యూనియన్ యూరపునంతా కబళించేస్తోంది. అందువల్ల రాబోయే యుద్ధం సోవియట్‌దేశంమీదనే సాగుతుంది. కాబట్టి మనం సోవియటుని వ్యతిరేకించి తమకు అండగా నిలుస్తామనే నమ్మకం బ్రిటిష్‌వారికి కలిగితే మనకేదో ఒక విధమైన స్వాతంత్ర్యం ఇస్తారు. కాబట్టి మనం సోవియటుపట్ల సానుభూతి ప్రకటించడం వల్ల మనకు నష్టమేగాని, లాభం ఏమీ ఉండదు."

జపాను ప్రసక్తిగాని, దాని ఓటమిని గురించి ఒక్క మాటగాని లేకపోవడాని క్కారణంకూడా ఈ వైఖరే. దీనివిషయంలో వారి వాదన ఇలా సాగింది.

"ఏమో—వెనుకటి పాలకవర్గమే తిరిగి అధికారంలోకి వస్తుందేమో ; అదీ కాకుండా, రాబోయే యుద్ధంలో జపాను ఎవరి పక్షం వహిస్తుందో ఎలా చెప్పగలం ? మొన్నటి యుద్ధంలో మనదేశం పొలిమేరల మీదికే వచ్చేశారు జపానువారు."

1942 ఏ. ఐ, సి. సి. లో నెహ్రూపండితుడు, మౌలానా అజాద్ జపాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రపంచానికి కలిగిన ఫాసిస్టు ప్రమాదాన్ని గుర్తించారు. ఆ ప్రమాదాన్ని రూపుమాపి, ప్రపంచంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించడంలో ఇండియా సముచిత పాత్రను నిర్వహించడం పవిత్రధర్మమని ఉద్ఘాటించారు.

ఈసారి ఆధోరణి కనబడలేదు. పైపెచ్చు అచ్చమైన ఫాసిస్టు ఉపన్యాసాలు కొన్ని జరిగాయి. అవి హర్షించబడ్డాయికూడా. సాధారణంగా

కాంగ్రెసు సంప్రదాయాలకు భిన్నంగా ఎవరైనా మాట్లాడుతూంటే నెహ్రూగారు మండిపడేవారు. ఈసారి అలా జరగలేదు. అధ్యక్షత వహించిన మౌలానా అజాదయినా ఆ ఫాసిస్టు ఉపన్యాసాలను వారించలేదు.

ఈ ఏ. ఐ. సి. సి. లో మమ్మల్ని బయటికి పొమ్మన్నారు. లోగడ కాంగ్రెసు సభ్యత్వనుండి దొలగించబడి, అప్పటికింకా చేర్చుకోకుండా ఉన్న శ్రీ శరత్‌బోసును ఆనందబాష్పాలతో కౌగలించుకొని, వేదికపైకి ఆహ్వానించారు. అందుకు సంజాయిషీగా ఒక్కమాటయినా చెప్పలేదు. ఇదంతా తలవనితలంపుగా జరిగింది ఎంతమాత్రం కాదు.

మొన్న ఏ. ఐ. సి. సి. ధోరణినిబట్టి చూస్తే నూతన ప్రపంచ స్వరూపం ఈదిగువ విధంగా ఉందా అనిపిస్తుంది—

వివిధదేశాలమధ్య స్పర్ధలు. ఏవోకొన్ని చిన్నదేశాలు స్వాతంత్ర్యం కోసం తాపత్రయ పడుతున్నాయి. ప్రతిఒక్కదానికీ వెనుక ఒకపెద్దరాజ్యం మద్దతు. పెద్దరాజ్యాలు చేజికందిన రాజ్యాలన్నిటినీ స్వాహాచేసేస్తున్నాయి.

ఈ దృశ్యంమనసుకు తట్టగానే 1942 కి పూర్వం ఏ. ఐ. సి. సి. సమావేశాలన్నింటిలోనూ జరిగిన ప్రపంచపరిస్థితుల వివరణ జ్ఞప్తికి వచ్చింది. ప్రజాశక్తులకు, సామ్రాజ్యవాద శక్తులకు మధ్యజరుగుతూన్న ఘర్షణగానే మీరప్పుడు ప్రపంచ పరిస్థితులను వివరించేవారు. భారతప్రజలు ఇతరదేశాల ప్రజాశక్తులతో భుజం భుజం కలిపి నిలుచున్నారనేవారు. సోవియట్, చైనాదేశాలు ఈ ప్రజాపక్షంలోనే ఉన్నాయని మురిసిపోయేవారు.

ఈ విధంగా మీవెనుకటి ప్రజాస్వామిక దృక్పథమంతా మాయమైపోవడంచూశాం. ప్రస్తుతవైఖరి కొందరికి స్పష్టంకాలేదు; మరికొందరు తప్పుగాఅర్థంచేసుకున్నారు. ఈ విషయాన్నికూడా గమనించాం. కాంగ్రెసులో అధికారంకోసం నక్కజిత్తులువేయడంలో అందెవేసిన మొనగాళ్లు దిగ్విజయం సాధించడంచూశాం. "జాతిస్వాతంత్ర్యంకోసం" అంటూ వారు తమ పన్నాగాలను ప్రపంచరాజకీయాల్లోకూడా సాగించడానికి కుతూహలపడడం గమనించాం.

కాంగ్రెసులోని అభివృద్ధికాముకులయిన ప్రజాస్వామిక వాదులందరూ మూగవోయారు. ఫాసిస్టు అనుకూలురు తమ ఆర్భాటాలతో దిక్కులుమారు మ్రోగించారు.

మీ లీగు వ్యతిరేక పంథా

ఏ. ఐ. సి. సి. తీర్మానం స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించిందా ?—అదీకాదు. పోనీ, తృణీకరించిందా ? ఇదీకాదు. ఈ 'అదీకాదు ఇదీకాదు' వైఖరి అన్నివిషయాల్లోనూ స్పష్టంగా కనుపించింది. ఇది సామ్రాజ్యవాద యుద్ధమా ? అదీకాదు. పోనీ, ప్రజాయుద్ధమా ?—ఇదీ కాదు. ఆగస్టు పోరాటానికి బాధ్యత మీదేనా ?—కాదు. మీది కాదంటారా ? ఇదీకాదు. ఒక ఖచ్చితమైన విధానం లేకపోవడమూ, నీతినియమంలేకుండా అధికారంకోసం ప్రాకులాడడమూ ఈ వైఖరిలో మూర్తీభవించింది.

స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరించేంతవరకు గాంధీజీ ముందుకు వచ్చారు. కాంగ్రెసువాదుల్లో కొన్ని కొన్ని వర్గాలుకూడా దానిని అంగీకరించడానికి సిద్ధపడ్డాయి. మీరు ఆ దశనుంచి ఇంకా ముందుకు పోలేదు సరికదా, ఇంకా వెనక్కుపోయారు. స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరిస్తే ఎన్నికల్లో హిందూమహాసభ పోటీని ఎదుర్కోవలసి వస్తుందని చెప్పి అలా వెనక్కిపోయారు. ముస్లిం సోదరులకు, కాంగ్రెసుకూ పొత్తు కుదర్చగల ధర్మసమ్మతమైన సూత్రాలను మీరు నిర్ణయించలేకపోయారు. అందువల్లనే అభివృద్ధినిరోధకులయిన హిందూవర్గాల అధర్మసిద్ధాంతాలకు తలొగ్గవలసిన గతి పట్టింది. గాంధీజీ తా నెంత ముందుకైతే వచ్చారో అక్కడే ఉన్నారు : వెనక్కు పోలేదు: స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరించి, దానిని ప్రాతిపదికగా తీసుకొని విస్పష్టమైన సూచనలు చేయాలని మౌలానా ఆజాద్ విజ్ఞప్తి చేశాడు, కాని వీరినిద్దరినీ తోసిరాజుచేశారు మీరు.

ఈ పద్ధతుల్లో లీగును ప్రతిఘటించాలనుకోవడం చాల శోచనీయమైన పరిస్థితులకు దారితీస్తుంది. లీగు అభివృద్ధి నిరోధకమైన ఒక మత

సంస్థ అని మీరు ఖండించారు. కాని, ఎన్నికల్లో ముస్లింస్థానాలకు కాంగ్రెసు తన స్వంత అభ్యర్థులను నిలబెట్టడంలేదు. లీగుపై దెబ్బ తీయాలనే ఆదుర్దాకొద్దీ దుష్ట శక్తులను చేరదీసింది కాంగ్రెసు.

ఖాక్సారులు, అహరారులు బ్రిటిషు వ్యతిరేకత ధోరణిని కనబరచినప్పటికీ, వారి దంతా అనుమానాస్పదము. తమప్రచారాన్నంతా మతరీత్యా సాగిస్తారు వీరు. స్వచ్ఛమైన సామ్రాజ్యవాద వ్యతిరేక సాంప్రదాయాలు కలవారు జమయత్‌ఉల్‌ఉలేమాలు. వీరుకూడా అచ్చంగా ఇస్లాం ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఈ సంస్థ వర్కింగుకమిటీ సభ్యుడయిన మౌలానా జబేరీ సంపాదకత్వంక్రింద 'అన్సారి' అనే పత్రిక వెలువడుతూంది. పాకిస్తాన్ ప్రాపంచిక విషయాలపై నాధారపడి ఉండే రాజ్యంకాబట్టి అది పనికి రాదని ప్రచారం చేసిందీ పత్రిక. అంతకన్నా ఘోరమైన విషయం ఏమంటే — ప్రజాస్వామిక సూత్రాలనే ప్రాతిపదికగా తీసుకున్నారు కాబట్టి దానికి ఆక్షేపణ తెలిపింది. ఆధ్యాత్మిక సూత్రాలపై నాధారపడి, మతసంబంధమైన రాజ్యాన్నే స్థాపించాలనీ. ముస్లిం ప్రజలకు నిజమైన ప్రతినిధి అయిన ఉలేమాయే ఈ రాజ్యాన్ని నడపదగినవాడని ఈ పత్రిక సూచించింది.

కాంగ్రెసు పత్రికలచేత 'జాతీయ ముస్లింల'ని పిలవబడేవారు కూడా ఇంచుమించు ఇదే ధోరణిలో పాకీస్తాన్ని వ్యతిరేకించారు. పాకిస్తాన్ ముస్లిం మతరాజ్యాంగంగా ఉండకుండా రాజకీయాలపైనే ఆధారపడి ఉంటుందని వీరు ప్రధానంగా విమర్శించారు. ఈ ప్రచారాన్నెదుర్కొడానికి లీగుకూడా ముస్లిం మతగురువులను తన జెండాక్రింద సమీకరించ నారంభించింది: ఈవిధంగా అభివృద్ధి నిరోధకత్వాన్నెదుర్కొడానికి అభివృద్ధి నిరోధకత్వాన్నే బలపరచసాగింది, ఇలాంటి ప్రచారం ముస్లింలలో స్పర్ధలను పెంచుతుందేగాని, హిందువులతో పొత్తునెలా కుదర్చగలదు? జాతీయ ఐక్య సంఘటనకు మార్గం ఇదికాదు—ముమ్మాటికీ కాదు.

అన్నదమ్ములమధ్య అంతఃకలహాలు ప్రారంభమవకేపోవాలి. పారంభమయినట్లయితే ఇక వాటికి హద్దులుండవు. బ్రిటిష్ సామ్రాజ్య

వాదులు మన కందరికీ శత్రువులన్న విషయాన్ని కూడా మరచిపోతారు. బ్రిటిష్ అనుకూలురే అయినా, లీగును వ్యతిరేకిస్తేచాలు, పనికి వస్తారనే ధోరణికి దిగుతారు. పంజాబులో లీగును పడగొట్టడానికి యూనియనిస్టులతో కాంగ్రెసువారు రాయబారాలు సాగించడం అందరికీ తెలిసిన విషయమే. తక్కిన రాష్ట్రాల్లోకూడా లీగుకు వ్యతిరేకంగా ఇలాంటి దుష్టశక్తులనే ఉపయోగింపజూస్తున్నారు. ఉత్తమ ఆదర్శాల కోసం పోటీ చేస్తున్నామనడం వట్టిబూటకం. నీతినియమాలు పాటించకుండా కక్షలు సాధించడమే ఆచరణలో జరుగుతూంది. మత దురభిమానాలను రెచ్చగొట్టడమే నిజానికి దీనివల్ల పొందుతూన్న ఫలితం.

ఈ విధంగా కాంగ్రెసును ఏస్థికి తెచ్చారంటే—విషాదకరమైన ఈ దృశ్యాన్ని సాధారణ కాంగ్రెసువాది ఎదుటపెట్టగానే, అప్రయత్నంగా అతనిలా అంటున్నాడు. "దానికి మే మేమి చేయగలం? ముస్లింలు మతాన్నొక సాధనంగా ఉపయోగిస్తున్నారు. వారిని లీగునుండి దూరం చేయడానికి మేమూ ఆ సాధన్నానే ఉపయోగించవలసి వచ్చింది." దేశంలో కాంగ్రెసు ప్రప్రధాన జాతీయసంస్థ. ప్రాధాన్యతలో దానితరువాతది ముస్లిం లీగు. అలాంటి కాంగ్రెసు లీగును ఒక సోదరసంస్థగా చూడకుండా, పోటీదారుగానో, లేక శత్రువుగానో చూడనారంభిస్తే కాంగ్రెసువాదుల వైఖరి ఎలా ఉంటుంది?

భారతప్రజల్లోనే ఒకభాగంపై వారు నీచప్రచారం సాగిస్తారు. వారిని తమకన్నా అధములుగా చూడనారంభిస్తారు.

అంతటితో ఆగడం లేదీ ధోరణి. అంతర్యుద్ధం తప్పదన్నట్లు మీలోనే కొందరు బహిరంగంగా చెబుతున్నారు. లీగునుండి ముస్లింలను దూరంచేయడం సాధ్యంకాకపోతే, ఇక వారి నెదుర్కొని పోరాడవలసి ఉంటుందన్నట్లు మాట్లాడుతున్నారు. స్వాతంత్ర్యపోరాటం అన్న పేరుతోనే దానిని సాగిస్తారు. కాని నిజానికది అన్నదమ్ములమధ్య అంతర్యుద్ధంగానే ఉంటుంది.

లీగును ప్రతిఘటించడమంటే ముస్లింలలో అత్యధిక సంఖ్యాకుల్ని ప్రతిఘటించడమన్న మాట. దురభిప్రాయాలనే పొరలు దట్టంగా కమ్మిన వారికితప్ప మరెవ్వరికయినా ఈ విషయం సుస్పష్టమే.

ఈ సంఘా విఫలం కాకతప్పదు. వినాశకరమైన పరిస్థితులకుకూడా దారితీస్తుంది. ఇప్పటి కప్పుడే దీని ప్రభావం కనబడుతూంది. నాయకులు ఏమతమ పక్షాలను బలపరచుకొని, చీలికలు లేకుండా చేసుకోవాలనే ఉబలాటం కొద్దీ అభివృద్ధి నిరోధకుల పలుకుబడిక్రిందికి పోతున్నారు.

ముస్లింలీగు సామ్రాజ్యవాదుల తొత్తులను, మత మౌఢ్యులను దగ్గరకు చేరదీస్తూంది. ముస్లింలలో ఐక్యతను పెంపొందించడానికి ఇదొక మార్గ మనుకొంటున్నారు-

కాంగ్రెసు హిందూమహాసభ ఒడిలోకి చేరింది. ఏమంటే — ముస్లింలీగును ఎదుర్కోవడంలో ఇంకేదీ అడ్డులేకుండా చేసుకోవాలని సంజాయిషీ చెప్పారు.

తప్పుదారి తొక్కి ముక్కుకు తిన్నగా పోతామంటే ఇంకా తప్పులే చేయడ మవుతుంది.

ప్రజావాంఛను సాధించడానికి సక్రమమైన సూత్రాలను నిర్ణయించే ప్రజల నందరినీ ఐక్యం చేయలేని రాజకీయ నాయకవర్గం క్రమక్రమంగా అభివృద్ధి నిరోధకుల విషకౌగిలిలోనికి పోకతప్పదు. అంతవరకు అనుభవం మీద తానుసాధించిన అభివృద్ధికికూడా నీళ్లు వదులుకోవలసివస్తుంది. రానురాను ఆసియసిద్ధికికాకుండా అంతర్యుద్ధానికిదారితీసే పద్ధతుల్లోకి దిగుతుంది. చివరకు అందరికీ శత్రువయిన పరాయి సామ్రాజ్యవాదుల్లో నాధారపడే దుర్గతి పడుతుంది.

హిందూ ముస్లిం అనైక్యత చాల తీవ్రదశకు వచ్చింది. కాంగ్రెసువాదుల్లో ఈనాడు సర్వసాధారణంగా ఈఅభిప్రాయాలు వినబడుతున్నాయి.

"ఏం—యూనియనిస్టులతో (పంజాబులో సామ్రాజ్యవాదుల గులాములసంస్థ - అనువాదకుడు) కలిస్తే తప్పేముంది? జిన్నా పొగరణచడానికి వేవెల్‌సహాయం తీసుకుంటే పుట్టిమునిగిందేముంది?" - అని ఒక వంక.

మరోవైపు - ఎన్నికల్లో ముస్లింలీగేగాని గెలిచినట్లయితే వీరి ధోరణి ఎలా ఉంటుందోకూడా స్పష్టంచేస్తున్నారు.

'ముస్లింలతో ఐక్యంలేకుండానే, మా అంతట మేము స్వాతంత్ర్యంకోసం పోరాటం సాగిస్తాము. స్వాతంత్ర్యాన్ని సాధించిన తరువాత వాళ్లింకా కాంగ్రెసును వ్యతిరేకిస్తే, అప్పుడువారి పనిపడతాం - ఇదీవీరి ధోరణి.

నాయకత్వం అనుసరిస్తూవచ్చిన మార్గాలు, అభిప్రాయాలు తప్పు అనడానికి, అంతర్యుద్ధం తప్పదేమోఅన్న పరిస్థితులేర్పడడమే ప్రబల నిదర్శనం, కాని, కాంగ్రెసువాదులావిధంగా భావించడంలేదు. అదొక గొప్పగా చెప్పుకోసాగారు.

'వేవెల్‌మీకు మెహర్బానీ చేస్తాడని ఎలా ఆశపెట్టుకున్నారయ్యా?' అని అడిగితే తెల్లమొగం వేస్తారు. లేదా. వేవెల్ దగాచేశాడని పళ్లు కొరుకుతారు.

ఎంతదుర్గతి! బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బంటుఅయిన వైస్రాయి పెద్దమనిషి తరహాపై భారతదేశపు బాగోగులు ఆధారపడవలసినగతి ప్రాప్తించింది!

మేమడుగవచ్చునా—యూనియనిస్టు పార్టీతో చెలిమికోసం ఇంత తహతహ లాడుతున్నారు. వారు జాతీయవాదులయిం దెప్పటినుంచి? దీనికి మీరేమి జవాబుచెబుతారో మేమూహించగలం. "మా ప్రయోజనం కోసంవారి నుపయోగిస్తున్నాం. వారి సహాయంలేకపోతే పంజాబులో లీగును పడగొట్టలేం" అని అంటారు మీరు.

మేము మరోప్రశ్న అడగవచ్చునా "పంజాబు గవర్నరు గ్లాన్సీ నమ్మినబంటులు యూనియనిస్టులు. మరి యూనియనిస్టులను కాంగ్రెసుతో కలవనిస్తున్నాడే. గ్లాన్సీకూడా కాంగ్రెసుమిత్రుడయాడా?" దీనిక్కూడా మీ జవాబేమిటో మాకు తెలుసు— 'అబ్బ! మీ కమ్యూనిస్టులతో వాదవపెట్టు

కావి నెగ్గలేము. ఏది ఎలాగున్నా, యూనియనిస్టులతో పొత్తు కుదుర్చుకోమని మా నాయకవర్గం ఆదేశించింది. గవర్నరు గ్లాన్సీ బంటులతో ఈ విధంగా పొత్తుకుదుర్చుకోవడం ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించే ప్లానేదో వారు వేసుకొని ఉండాలి," అని జవాబు చెబుతారు.

గడచినదంతా గంగపాలు

1920 లో హిందూముస్లిం ఐక్యతే కాంగ్రెసుయొక్క మూలసూత్రం; స్వాతంత్రోద్యమానికి ప్రాతిపదికే అది. కాని, ముస్లింల వాంఛల పట్ల మీరవలంబించిన వైఖరి ఫలితంగా వారు క్రమక్రమంగా కాంగ్రెసు నుండి విడిపోయారు. తత్ఫలితంగానే ముస్లింలీగింత బలపడింది. ఈనాడు లీగుకు వ్యతిరేకంగా మీ స్వంత అభ్యర్థులను పెట్టగల ధైర్యం మీకులేదు. పెడితే మీ 'ప్రతిష్ఠకు' భంగవస్తుందేమో అని మీభయం. నిజాన్ని గుర్తించాలి. ముస్లింల ప్రప్రధాన రాజకీయసంస్థగా ముస్లింలీగు అభివృద్ధి పొందింది. వారి స్వాతంత్ర్య పిపాసను ప్రతిబింబిస్తూంది; వారి కోరికలను వ్యక్తమొనర్చుతూంది.

1920 గడచింది. 20 సంవత్సరాలు తరలిపోయాయి. కాని హిందూ ముస్లిం ఐక్యతను మీరేమాత్రమూ నిర్మించలేకపోయారు. చివరికీనాడు ఆనాటి ప్రధానసూత్రంకూడా అంతరించింది. విచ్ఛిన్నకరము, జాతీయతకు వ్యతిరేకము అయిన ఈ రెండుసూత్రాలను చేపట్టేస్థితికి కాంగ్రెసును తీసుకువచ్చారు మీరు.

1. భారతస్వాతంత్ర్య సాధనకు ముస్లింలు అవసరంలేదు. ఇది తెలివితక్కువ వాదన. సోదరప్రజల దేశభక్తిని శంకిస్తూ, వారిపై నిందలు వేయడమే ఇది.

2. లీగు పొగరణచడానికి బ్రిటిష్‌వారి సహాయం తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఈ ధోరణి మన ప్రజల్ని చీలదీస్తుంది. అంతేకాదు. బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల్ని ఉపయోగించుకుంటున్నామని కలలుగంటూనే వారివలలో పడడమవుతుంది. చివరకు అందరికీ ప్రాణప్రద

మైన స్వాతంత్ర్యాశయాన్ని మట్టిపాలు చేయడమవుతుంది. బ్రిటిష్‌వారితో మన తగాదా తీర్చుకోడానికి జపానుఫాసిస్టులను ఉపయోగించుకోవాలనడం ఎంత సవ్యమైన భావమో. ఇదికూడా అంతచక్కని అభిప్రాయం. రెండూకూడా దివాలాకోరు తత్వంవల్ల కలిగినభావాలే.

వెనుక జపాను అనుకూల భావాలకులాగానే ఈ రెండుభావాలకుగూడా బానిస తత్వమే కారణభూతమయింది.

ఆత్మవిశ్వాసం లేకపోవడంవల్లా, మనకోసం జపానువారు వచ్చి బ్రిటిష్‌వారిని తుదముట్టిస్తారనే వెర్రిఆశ జపాను అనుకూలభావాలకు దారితీసింది.

ముస్లింలు మివెంట రారేమోఅన్న అనుమానం లీగు వ్యతిరేక ధోరణికి దారితీసింది. వారి ప్రాతికూల్యాన్ని అణగగొట్టటానికి బ్రిటిష్‌వారి సహాయాన్ని అర్థింపజేసింది.

ఆనాటి జపాను అనుకూలవైఖరి, ఈనాటి ముస్లింలీగు వ్యతిరేక—బ్రిటిష్ అనుకూల ధోరణీ—రెండూ దేశకల్యాణానికి భంగకరములే. ఆనాడది ఫాసిస్టు సామ్రాజ్యవాద దురాక్రమణదారుకి ద్వారం తెరిచేది. ఈనాడిది మన నెత్తిపై తిష్టవేసి ఉన్న కరకు సామ్రాజ్యవాదులను బలపరుస్తూంది; తమ పెత్తనాన్ని చిరస్థాయి చేసుకోగల అవకాశాన్ని వారికిస్తూంది. భారతస్వాతంత్ర్యాన్ని భారత జాతీయశక్తుల ద్వారానే సాధించాలన్న మూలసూత్రాన్ని విస్మరించడంవల్ల కలిగిన భావాలే ఆ రెండూనూ.

ధర్మపద్ధతులకు తిలోదకాలు వదలినప్పుడే ఈ విధంగా స్వప్రయోజనాలకోసం "ఒకరిని ఉపయోగించుకోవాల" నే బుద్ధులు పుడతాయి. దీనివల్ల భారతరాజకీయాలు బాగుపడడానికి బదులు, మరింత అధ్వాన్నమవుతాయి.

యుద్ధకాలంలో 'పోరాటం ప్రారంభిస్తామ'నే బెదరింపు స్వాతంత్ర్యాన్ని చేకూర్చలేదు. అలాగే యుద్ధానంతరం "లీగును సాధించాల"నే దృక్పథంకూడా దేశవిముక్తికి తోడ్పడదు. స్వాతంత్ర్యసాధనకు తగు

మార్గ మాలోచించవలసి వచ్చినప్పుడు, బ్రిటిష్‌వారంటూ ఒకరద్దం ఉన్నారన్న సంగతిని ఆనాడూ, ఈనాడూకూడా మరచిపోయారు. ఆయాదశల్లో ఉచితవిధానాన్ని నిర్ణయించవలసినచ్చినప్పుడు ప్రజలందరియొక్క ఉమ్మడి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకోవడం ఆనాడూ జరగలేదు, ఈనాడూ జరగలేదు.

ఎన్నికలకు ముందు కాంగ్రెసూ, లీగులు ఎంత తగవులాడుకుంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదు లంత సంతోషిస్తారు. రాజ్యాంగ నిర్మాణసభలో జాతీయపక్షాలన్నీ ఏకముఖంగా నిలబడి స్వతంత్రభారత రాజ్యాంగ ప్రణాళికను తమ ముందు పెడతాయన్న భయం ఆ సామ్రాజ్యవాదులకు అక్కరలేకుండా పోతుంది. అలాంటి ప్రణాళిక రావడమే తటస్థిస్తే దానిపై సంతకంచేసి. మూటాముల్లె కట్టుకొని సెలవు తీసుకోవడమో; లేదా సాహసంకొద్దీ దానిని వ్యతిరేకించి, దేశవ్యాపిత తిరుగుబాటును ఎదుర్కోడానికి సిద్ధపడడమో అవసరమవుతుంది. కాంగ్రెసు లీగులు తగవులాడుకుంటే వారి కలాంటి అగత్యం ఏమీ ఉండదు. పైపెచ్చు ఒకరినొకరు సాధించడంకోసం ఆ రెండుసంస్థలూ బ్రిటిష్‌వారి సహాయాన్నర్థిస్తాయి. చొరవతీసుకునే అవకాశం పూర్తిగా బ్రిటిష్‌వారి చేతిలోనే ఉంటుంది. దయాదాక్షిణ్యాలను ఒలకపోస్తున్నట్లు నటిస్తూ వారి ఇష్టం వచ్చిన నిర్ణయాన్ని దేశంమీద రుద్దగలరు. ఈలోగా కాంగ్రెసు కమ్యూనిస్టులమీద ధ్వజమెత్తడం, లీగునాయకత్వం తమ సంస్థలో ఉన్న అభివృద్ధికాముకులను పక్కకునెట్టి బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల తొత్తులను చేరదీయడం జరిగితే ఏమవుతుంది? కాంగ్రెసులీగు ఐక్యతకోసం కృషిచేసేశక్తులు రెండుసంస్థల్లోనూ సన్నగిలిపోతాయి.

కూప్లండు ప్లాను

ఈనాడు కాంగ్రెసులీగులకు ఒకరిపైనొకరు కత్తిదూయడం మినహా మరొక కార్యక్రమంఉన్నట్లు కనబడదు. ఇలావారు తగువులాడుకుంటూ, చివరకు ఒకరితోనొకరు మాటామంతీకూడాలేని స్థితికిరాగానే వాళ్ళనెత్తిని రుద్దడానికి బ్రిటిష్‌పాలకులు ఒకప్లాను సిద్ధంగా ఉంచుకున్నారు.

ఈ ప్లానుయొక్క ప్రధానసూత్రాలు క్రిప్సుసూచనల్లోనివే; వాటినే వేవెల్ పునరుద్ఘాటించాడు; బ్రిటిష్‌వైఖరిఅంటూ లేబరుపార్టీ ప్రభుత్వం ఉచ్చరించిందికూడా వాటినే.

ఈప్లాను నమలు పరచడానికి జరిగిన మొదటిఘట్టమే సిమాసమావేశం. ప్రొఫసర్ కూప్లండు, తన 'భారతరాజ్యాంగ సమస్య' అనే పుస్తకంలో దీనిని వివరించాడు.

ఈ 'ఆచార్యుడు' క్రిప్సుకార్యదర్శిగా మనదేశానికి వచ్చాడు, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్లో వలసదేశాల రాజ్యాంగ ప్రణాళికలను తయారుచేయడానికి ఇతన్నిమించినఘనుడు మరొకడులేడట అరబ్బులను. యూదులను బద్ధవైరులను చెసివేసి అక్కడ బ్రిటిష్‌పెత్తనానికి ఆటంకంలేకుండా చేసిన పాలస్తీనా రాజ్యాంగ యంత్రానికి పితామహుడు ఈ చల్లనయ్యేనట. మనదేశాన్ని హిందూస్తాన్, పాకిస్తాన్లని రెండు అధినివేశప్రతిపత్తి రాజ్యాలుగ విడదీయడం కూప్లండుప్లాను ప్రధాన సూత్రం. ఈరెండూ కాకుండా కేంద్రంలో ఒక 'ఏజన్సీప్రభుత్వం'ఉంటుంది. సంస్థానాలు మిలిటరీ రీత్యాను ఆర్థికంగాను బ్రిటిష్‌పెత్తనంక్రింద ఉంటాయి. ఈ సంస్థానాలను అవకాశంగా తీసుకొని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కేంద్రంలో తిష్ట వేస్తారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమైన భారత ప్రభుత్వోద్యోగులను రిటైరు చేయించి సంస్థానాలకు దివాన్లుగా పంపుతున్నారు.

కాంగ్రెసు అడ్డుతగులుతున్నా, ముస్లింలకు ప్రత్యేక అధినివేశ ప్రతిపత్తినిస్తామని లీగుకు ఆశచూపుతారు,

లీగు అడ్డుతగులుతున్నా ఏదో ఒకలాంటి కేంద్ర ప్రభుత్వాన్నే ఏర్పాటు చేస్తాములే అని కాంగ్రెసుకు ఎరచూపిస్తారు.

క్వాయిదే అజాం జిన్నా ఎలాగయితేనేం పాకిస్తాన్ని సాధించారు; హిందూపెత్తనంభయం ముస్లింలకు లేకుండా చేశారని లీగులోని మితవాదులు సంతృప్తిపడి ఊరుకుంటారు. లీగు నాయకవర్గం నిర్మాణ కార్యక్రమం అంటూ ఒకటి సూచించి; వెనుకబడి ఉన్న ముస్లిం ప్రదేశాలను

అభివృద్ధి చేయడమంటూ పనికల్పించి తమ తీవ్ర వాదులను సంతృప్తి పరచ జూస్తారు. ఈ నిర్మాణ కార్యక్రమానికి బ్రిటిష్‌వారు మదుపు పెట్టడానికి సిద్ధపడతారు. నిపుణుల సహాయాన్నికూడా ఇస్తామంటారు. అది వారికి మిలటరీ రీత్యాకూడా లాభసాటిబేరమే. ఎందువల్లనంటే పాకిస్తాన్ ప్రదేశాలు ఇండియా తూర్పు, పడమర సరిహద్దు ప్రదేశాలు—మంచి కీలక స్థానాలు. హిందువులు ప్రతిఘటిస్తూ వచ్చిన పాకిస్తాన్ వాంఛను నెరవేర్చాము కాబట్టి ఇకముందు ప్రపంచయుద్ధం వస్తే ముస్లింలు తమ పక్షమే ఉంటారని బ్రిటిష్‌వారి ఊహ.

కాంగ్రెసులోని అతివాదులు లాంఛనప్రాయంగా తమ వ్యతిరేకతను తెలిపితే తెలపవచ్చు. ప్రజాపోరాటంకోసం ప్రచారంకూడా చేయవచ్చు. కాని, కూప్లండు ప్లాను ఇవ్వబోయేది స్వతంత్ర భారత రాజ్యాంగమూకాదు. ఐక్యతా రాజ్యాంగమూకాదు. కాబట్టి అధికారరీత్యా దానినామోదించమని కాంగ్రెసును మీరు కోరలేరు. కాని సంపూర్ణబాధ్యతాయుత ప్రభుత్వం లభించింది; పైగా యుద్ధానంతర ఆర్థిక సంక్షోభంనుండి బయట పడడానికి ప్రజలకు కాంగ్రెసు సహాయం అత్యవసరం. "కాబట్టి, కాంగ్రెసు జెండాకు కళంకం రాకుండా, ఉన్న అవకాశాలనే సాధ్యమయి నంతవరకు సద్వినియోగం చేయాల"నే ధోరణికి మీరు రావచ్చును.

ఇటీవల మీరు స్థాపించిన 'అదీకాదు—ఇదీకాదు' సాంప్రదాయానికి అనుగుణ్యంగానే ఉంటుంది పై ధోరణికూడా. కూప్లండు ప్రణాళికను కాంగ్రెసు అంగీకరించనూ అంగీకరించదు. తిరస్కరించనూ తిరస్కరించదు. తీవిగా ఖండిస్తూనే దానికి తలవొగ్గడం జరుగుతుంది. ఇక బిర్లాలు, సింఘానియాలు (యుద్ధకాలంలో అధికలాభాల పేరాశతో దొంగవ్యాపారం సాగించిన పెద్దపెట్టుబడిదారులు) దేశపునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేజిక్కించుకుంటారు. కాంగ్రెసులోని మితవాదవర్గాలు మంత్రిపదవులనాక్రమించుకొని పరిపాలనసాగిస్తారు. జరుగబోయే ప్రజాపోరాటం అంటూ వామపక్షంవారు ఉరుములు మెరుములు కురిపిస్తుంటారు. బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల ప్రతినిధులను హద్దుపద్దుల్లో ఉంచడానికి ఈవామపక్ష ప్రచారం ఉప

యోగ పడుతుందని నాయకులుదానిని హర్షిస్తారు. నిర్మాణాత్మకమైన రాజకీయాలే కోశానా కనబడవు. మళ్లా ప్రపంచయుద్ధం వచ్చేవరకు వాటిని వాయిదావేసేస్తారు.

ఇదంతా ముస్లింలీగును అణగద్రొక్కడమే ప్రధానంగా పెట్టుకోవడం వల్ల కలిగే ఫలితం. దీనివల్ల లీగు నశించదు; దాని ఆశయంపట్ల ముస్లిం ప్రజలకున్న ఆదరాభిమానాలు సన్నగిలవు. కాని భారతదేశం మరొక పాలస్తీనా అవుతుంది—అదీ మనఅదృష్టం బాగుంటే. స్వాతంత్ర్యం హుళక్కి; ఐక్యత నిండుసున్న. ఈ విధానం ఫలితంగా యుద్ధానంతరం స్వాతంత్ర్యం చేకూరదు సరిగదా, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్లాను నెరవేరు తుంది.

స్వయంనిర్ణయ సూత్రమే విముక్తిమార్గం

యుద్ధం రెండవదశలో మే మనుసరించిన 'ప్రజాయుద్ధ విధానాన్ని' బ్రిటిష్‌వారికి మద్దతు నిస్తుందని చెప్పి మీ రాక్షేపించారు. అది మాకాశ్చర్యం కలిగించలేదు. అలాగే, లీగుయొక్క న్యాయమైన కోరికలను మేము బలపరచడమూ, కాంగ్రెసు లీగు ఐక్యతకోసం ఆందోళన చేయడమూ ముస్లింలీగుకి బేషరతుగా మద్దతు నివ్వడంక్రింద లెక్కగట్టారు. అది కోరిన ప్రతిదాన్ని బలపరుస్తున్నట్లు వ్యాఖ్యానించారు. మీ వ్యాఖ్యానాల సారాంశం చెప్పాలంటే — మేము భారతదేశ స్వాతంత్ర్య పోరాటంపట్ల ఏమీ శ్రద్ధ తీసుకోవడంలేదు. అందువల్లనే ఆనాడు 'ప్రజాయుద్ధ' విధానాన్ని నిర్ణయించుకున్నాం; ఈనాడు లీగు కోరికలను బలపరుస్తున్నాం. అప్పుడూ, ఇప్పుడూకూడా స్వాతంత్ర్యోద్యమాన్ని విచ్ఛిన్నంచేయ పూనుకున్న శక్తులకే అండగా నిలుస్తున్నాం, యుద్ధకాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్నీ, యుద్ధానంతరం ముస్లింలీగునీ బలపరిచాం—ఇదీ మీ వ్యాఖ్యాన సారాంశం.

మీలోఏర్పడిన అపోహలనే పట్టుకొని వ్రేలాడుతున్నారు. చెప్పుడు మాటలనే ఆధారంగా తీసుకొని నిర్ణయాలు చేసుకుంటున్నారు. అందు

వల్లనే మేము చెప్పేదేదో కాస్త వినాలనేబుద్ధే మీకు పుట్టడంలేదు. ఆయా దశల్లో మేమనుసరించిన విధానాలను స్పష్టపరుస్తున్న వ్యాసాలు మొదలయినవాటివి మీరు స్వయంగా ఏమాత్రం చదివిఉన్నా, మాకు మీ రెంత అన్యాయం చేస్తున్నారో మీకే విశదమయేది. "ముస్లింలీగు యొక్క పాకిస్తాన్ కోరికను బేషరతుగా బలపరుస్తున్నామ"ని మీ రిపోర్టులో మమ్మల్ని విమర్శించారు.

ముస్లింలీగుయొక్క లాహోరుతీర్మానంలో నిర్వచింపబడిన కోరికనే మేము బలపరుస్తున్నాం. ముస్లింలకు తమ జన్మభూములలో సంపూర్ణస్వాతంత్ర్యాధికారంఉండాలని మాత్రమే ఈతీర్మానం కోరుతుంది. కాంగ్రెసు సంపూర్ణ స్వరాజ్య ఆశయాన్ని మే మేకారణాలచేతనయితే బలపరిచామో, సరిగా అదేకారణాలతో ముస్లింలీగు కోరికనుకూడా బలపరుస్తున్నాం. మన దేశంపై బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెత్తనం చెలాయించడానికి మేము వ్యతిరేకులం. అదేవిధంగా, దేశంలో తమదే మెజారిటీ జాతనీ ఆర్థికంగా, వైజ్ఞానికంగా—అన్నివిధాలా తమదే బలమనిచెప్పి హిందువులు ముస్లిం జన్మభూములపై అధికారం చెలాయించబోతే మేము సహించము.

మా పార్టీ సారస్వతాన్నిగాని, మా పత్రికలనుగాని చదివినా, మా ఉపన్యాసాలను విన్నా, పాకిస్థాన్ విషయంలో లీగు దృక్పథానికి, మా దృక్పథానికి గల వ్యత్యాసం ఎవరికైనా స్పష్టం అవుతుంది. భారత దేశంలోని ముస్లిం లందరూ ఒకేజాతి అంటారు లీగువారు. ఆ వాదనను మేము వ్యతిరేకిస్తాము, ఆరు రాష్ట్రాలు పూర్తిగా పాకిస్తానులో ఉండాలని లీగు నాయకులు కోరడం, ఇతరుల జన్మభూములపట్ల దురాక్రమణ వాంఛయే అని తూర్పారబట్టాం, అవన్నీ సవ్యమైన రాజకీయాలు కావు. వ్యాపారదృష్టితో బేరాలు సాగించడమే అని స్పష్టం చేశాం. భారతప్రజలందరికీ శాంతి సౌఖ్యాలు లభించేలా ఆర్థిక పునర్నిర్మాణం సాగించడం అందరికీ స్వాతంత్ర్యం చేకూర్చడం, ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడడం, యావద్భారత దేశాన్ని దృష్టిలో పెట్టుకొనే జరపాలని మేము నొక్కి చెప్పాము.

జాతీయసంస్థల్లోకల్లా అగ్రస్థానం కాంగ్రెసుది. భారత స్వాతంత్ర్య సాధనకు జాతీయైక్య సంఘటనను నిర్మించవలసిన మహత్తర బాధ్యత కాంగ్రెసుదేనని మా అభిప్రాయము. స్వయంనిర్ణయ సూత్రాన్నామోదించి, ముస్లిం జన్మభూములకు సంపూర్ణ స్వాతంత్రాధికారాన్ని అంగీకరించిన నాడే ఈ ఐక్యసంఘటన సాధ్యమవుతుందని మా దృఢనిశ్వాసము. భారత ప్రజలందరి స్వాతంత్ర్యంకోసం జరిగే పోరాటంలోను, ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడడంలోనూ, తమవంతు నెరవేర్చవలసిందని ముస్లింలను అడుగగల హక్కు కాంగ్రెసుకానాడే లభిస్తుంది.

నిజమే—లీగు కొన్ని అన్యాయమైన కోరికలను కోరుతూంది. వాటిని ప్రతిఘటించవలసిఉంది. కాని, తాను ధర్మబుద్ధి ననుసరించి నడచిన నాడే కాంగ్రెసు ఈ అన్యాయాన్ని ఎదుర్కొగలదు. తక్షణమే భారత స్వాతంత్ర్యాన్ని సాధించగలమార్గం ఇదే. బ్రిటిష్‌వారు సిద్ధపరచిన ప్లానును ప్రతిఘటించగల జాతీయైక్య సంఘటనను నిర్మించగల పంథా ఇదే, లేకపోతే మనకు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్లానుతప్పదు. దానివల్ల హిందువులకు గాని, ముస్లింలకుగాని స్వాతంత్ర్యం చేకూరదు సరికదా, బ్రిటిష్ పాలకుల సౌకర్యాన్ననుసరించి భారతభూమిని ఛిన్నాభిన్నం చేయడం జరుగుతుంది.

దురాక్రమణదారులను ప్రతిఘటించి భారతప్రజలందరి శ్రేయస్సును కాపాడటానికే తాను కృషిచేస్తున్నానంటుంది కాంగ్రెసు. కాని, ముస్లింల న్యాయమైన కోరికల నంగీకరించిననాడే కాంగ్రెసుకి అలా అనగల తాహతు లభిస్తుంది. దేశాన్ని సుభిక్షంచేయగల ఆర్థిక నిర్మాణానికి అందరూ ఏకముఖంగా వూనుకోవడం సాధ్యమతుంది.

కాంగ్రెసు మహాసంస్థయొక్క పవిత్ర సాంప్రదాయాలను మేము కొనసాగిస్తున్నామని హృదయ పూర్వకంగా నమ్ముతున్నాము. స్వయం నిర్ణయ సూత్రాన్ని మన జాతీయ సమస్యలకు అన్వయింప జేస్తున్నామనే మా దృఢవిశ్వాసం. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుతంత్రాల నెదుర్కొడా

నికి ఈ స్వయం నిర్ణయ సూత్రం ఒక చక్కని సాధనం. అంతేకాదు. స్వతంత్ర భారత నిర్మాణానికి అదే చక్కని పునాది,

బ్రిటిష్ అనుకూలురమని ఆనాడు మమ్మల్ని మీరాడిపోశారు. ఈనాడూ ఆడిపోస్తున్నారు. ఇందుకు మేము చేసిన మహాపరాధమేమిటి? మొదటినుంచీ, ఏకతీరుగా. ఫాసిస్టువ్యతిరేక పంథాననుసరిస్తూ వచ్చాము. మీ పరస్పర విభిన్న పోకడలవల్ల కలిగే ప్రమాదాలను ముందుగానే గ్రహించి, హెచ్చరించాం. ఇవే మేముచేసిన మహాపరాధాలు; ఇందుకే మీఆడిపోతలు.

లీగు ఏజంటులమనీ, కాంగ్రెసు వ్యతిరేకులమనీ ఈనాడు మాపై నిప్పులు చెరుగుతున్నారు. స్వయంనిర్ణయ సూత్రమే దేశకళ్యాణదాయకమని మొదటినుంచీ చెబుతూ వచ్చాము అందుకే ఈ విషప్రచారం. ఈ విషయంలో మేము ఖచ్చితంగా ఒకటి చెప్పగలము. బ్రిటిష్‌వారితో ప్రత్యేకంగారాజీ కుదుర్చుకోడానికి కాంగ్రెసు యీనాడు తాపత్రయ పడుతూంది. ఈప్రయత్నాలన్నీ విఫలం కాకతప్పదు. ఆనాడు, వేరేగత్యంతరం లేదంటూ కాంగ్రెసు ఈ స్వయంనిర్ణయ సూత్రాన్నే చేబట్టుతుంది. ఇదితప్పదు!

కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఆనాడు బ్రిటనుకు మద్దతు నిచ్చామన్న మాట ఎంత అసత్యమో. ఈనాడు కాంగ్రెసుకువ్యతిరేకంగా లీగునుగాని, లీగుకు వ్యతిరేకంగా కాంగ్రెసునుగాని బలపరుస్తున్నామన్న మాటకూడా అంత పచ్చిఅబద్ధము.

కాని, ఈనాడు మీతో ఏకీభవించనివారినందరినీ మీకు వ్యతిరేకులకిందనే లెక్కగడుతున్నారు, ఈ స్థితిలో మీతో భేదించినవారినందరినీ ప్రజాద్రోహులకింద లెక్కగట్టడం వింతకాదు. సర్వజ్ఞులు, సర్వసమర్థులయిన ప్రజానాయకులిక మీదృష్టిలో మీరొక్కరే అవుతారు. మీ శత్రువులను నోటికొచ్చినమాటలు అనడానికి మీకిక సంకోచంఉండదు.

XIV

కమ్యూనిస్టువ్యతిరేకతే కాంగ్రెసు ధ్వజంగా

స్వచ్ఛమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టువ్యతిరేక మహాసంస్థ కాంగ్రెసు. మీ విడుదల అనంతరం, మీ నాయకత్వంక్రిందనే, ఆ మహాసంస్థ కమ్యూనిస్టువ్యతిరేక కాంగ్రెసుగా మారిపోయింది. ఈ విషయాన్ని మేము పూర్తిగా గుర్తించాము, కాంగ్రెసు కమ్యూనిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంకాదనీ, ఇదివరలో తానుకూడా కమ్యూనిస్టుభావాలను ప్రచారంచేసేవాడిననీ నెహ్రూపండితుడంటున్నారు. (అక్టోబరు 25 న బీహార్‌లో ఇచ్చిన ఉపన్యాసం. 'బొంబాయిసెంటినల్'- అక్టోబరు 26) కాని. నెహ్రూగారు ఆత్మవంచనకు ఒడిగట్టారు. ఇవన్నీ వట్టికబుర్లని సర్దారుపటేల్ మొదలయినతోడి వర్కింగుకమిటీ సభ్యులు నెహ్రూగారితో చెప్పగలరు. కమ్యూనిజం విషమనీ; కమ్యూనిస్టుపార్టీ మొదటినుంచి జాతీయవిద్రోహకరపంథానే అనుసరిస్తూవచ్చిందనీ; ఈవిషయం ఇంకా వ్యాపించకుండా కాంగ్రెసు అరికట్టాలనీ? కమ్యూనిస్టుపార్టీని సమూలంగా నాశనంచేయాలనీ, అది ఎంతత్వరగాజరుగుతే అంతమంచిదనీ వారు నెహ్రూగారికి బోధించగలరు.

కాని, యదార్థవిషయమేమిటి? ఏదేశంలోనయినా కమ్యూనిస్టుభావాలు అంకురించి. పెరిగి, ప్రజల్లో వ్యాపించడం ఆదేశాల కమ్యూనిస్టుపార్టీలద్వారానే జరుగుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. దైనందిన సమస్యలపై కమ్యూనిస్టు సిద్ధాంతాన్ననుసరించి చేసుకునే నిర్ణయాలే. కమ్యూనిస్టుపార్టీ పాలసీలు. ఆచరణలో ఆ దైనందిన సమస్యలకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అన్వయింపజేయడమే కమ్యూనిస్టుపార్టీల కార్యక్రమము. వాస్తవిక, నిత్య, జీవితంలో స్వాతంత్ర్యోద్యమాన్ని, ప్రజల శ్రేయస్సును పెంపొందింపజేయడమే కమ్యూనిస్టుపార్టీల లక్ష్యము. ప్రపంచంలో అన్నిదేశాల్లోనూ జరుగుతున్నదిదే. మన దేశంలోని పరిస్థితికూడా ఇదే.

వినయపూర్వకంగా మీకొక విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రపంచ చరిత్రను కొంచం సింహావలోకనం చేయండి. కమ్యూనిస్టు సిద్ధాంతం మొలకెత్తిననాటినుండి, ఆయాదేశాల్లో కమ్యూనిస్టుపార్టీలు పుట్టిననాటినుండి, వాటిని వ్యతిరేకిస్తూ వస్తున్న దెవరో పరిశీలించి చూడండి. ఆయా దశల్లో అభివృద్ధినిరోధక తత్వకారులూ, అభివృద్ధినిరోధక రాజకీయ వేత్తలే కమ్యూనిజంపైని, కమ్యూనిస్టు పార్టీలపైని ధ్వజమెత్తుతూ వచ్చారు; వస్తున్నారు.

మీకు మరో విజ్ఞప్తి చేస్తున్నాము. నెహ్రూపండితుని 'ఆత్మకథ' ప్రపంచప్రసిద్ధి పొందింది. కాంగ్రెసు మహాసంస్థకు ప్రపంచంలోని అభివృద్ధికాముకు లందరియొక్క మన్ననలను చేకూర్చింది. ఆ గ్రంథంలో ప్రతిబింబితమైన జాతీయోద్యమదశను జ్ఞప్తికి తెచ్చుకోండి. మొన్నమొన్న గడచిన యుద్ధకాలాన్నికూడా గుర్తుకు తెచ్చుకోండి. ఈ రెండు దశల్లోను ఒక్క మనదేశాన్నే కాదు; ప్రపంచంలోని అన్నిదేశాల చరిత్రను తరచిచూడండి. ఎవరిపంథా సరియైనది. ఎవరిది తప్పు అని ఆయా దేశాల్లోని విజ్ఞానధనులు లెక్కగట్టారో చూడండి. పేరయినా మిగలకుండా అదృశ్యమైపోతున్న నాయకులెవరో: ఎవరు మహోజ్వల ప్రతిభతో ప్రజానాయకులుగ పైకి వస్తున్నారో గమనించండి.

కళ, శాస్త్రము, సంస్కృతి—అన్ని రంగాల్లోను ప్రపంచ మన్ననల నందిన మేటి ఘనులు కమ్యూనిస్టుపార్టీలోకి వచ్చారు. ఇదంతా మీకు అప్రధానమైన విషయం కావలసిందేనా ?

శాస్త్రవేత్తల్లో చూడండి. అన్ని శాస్త్రాలను కూలంకషంగా పరిశోధించి మన్నన లందినవారు హాల్డేన్ అనే బ్రిటిష్‌శాస్త్రవేత్త. ప్రపంచంలో పేరెన్నికగన్న భౌతిక శాస్త్రజ్ఞుడు ఫ్రాన్సుదేశపు లాంజెవిన్, జగత్ప్రసిద్ధ క్యూరీసతి అల్లుడు, రేడియోశక్తిపై పరిశోధన చేసి ప్రఖ్యాతిపొందిన శాస్త్రజ్ఞుడు ఫ్రాన్సుదేశపు జోలియట్‌క్యూరీ. వీరందరూ తమ దేశాల్లో కమ్యూనిస్టుపార్టీ సభ్యులే. సోవియట్‌దేశంలో సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త కాపిట్జా కమ్యూనిస్టుపార్టీ సానుభూతి పరుడు.

చిత్రకళ, సంగీతం విషయాలను చూదాం. యూరప్‌ఖండ మంతటిలోను సాటిలేని మేటి చిత్రకారుడు పాబ్లోపికాసో (స్పెయిన్ దేశస్థుడు); సుప్రసిద్ధ బ్రిటిష్ నటీమణి బీటిక్సు లెహ్మాన్ కమ్యూనిస్టుపార్టీ సభ్యులు. మేఘగంభీర స్వరంతో ప్రపంచ శ్రోతలను పరవశులను చేసే సుప్రసిద్ధ అమెరికన్ నీగ్రో గాయకుడు పాల్‌రాబ్సన్ కమ్యూనిస్టు సానుభూతిపరుడని అందరికీ తెలుసు.

ఇక సారస్వత రంగంలో చూడండి. ఐర్లండు విప్లవమూర్తి సీన్ ఓ కాసీ, ఫ్రెంచి కవులలో తలమానికము లూయి ఆరగాన్, డెన్మార్కు రచయితలలో అగ్రగణ్యుడు మార్టిన్ ఆండర్సన్ నెక్సో, సుప్రసిద్ధ చైనా రచయిత్రి టింగ్‌లింగ్, అమెరికా నవలా రచయితల్లో అసమానుడు థియొడార్ డ్రీసర్, రెండవ ప్రపంచయుద్ధంలో ఉత్తేజకరమైన రచనల్లో ఇతరుల నందరినీ తలదన్నిన ఇల్యాఎహరెన్‌బర్గ్—వీరందరూ నేటి ప్రపంచ సాహిత్యరంగంలో అగ్రశ్రేణికి చెందినవారు. అందరూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులే.

ఉదాహరణకు మాత్రం కొన్ని పేర్లిచ్చాము, ఇటువంటి వారందరూ చేరడం మీకప్రధానమైన విషయమా ?

యూరప్ ప్రజలను ముందుకు నడిపింది కమ్యూనిస్టులే

పూర్వం ఆయా దేశాల్లో కమ్యూనిస్టుపార్టీలు చిన్నచిన్న విప్లవకారుల గ్రూపులుగా ఉండేవి. అలాంటివీనాడు ఆ దేశాల రాజకీయాల్లో ప్రధానశక్తులుగా అభివృద్ధిపొందాయి. ప్రజలవిశ్వాసాన్ని చూరగొన్నాయి. వాటి ప్రాధాన్యతను అందరూ గుర్తించారు. ఈ పరిణామం కూడా మీకు అప్రధానమైన విషయమేనా ?

ఫ్రాన్సులో ఈనాడు కమ్యూనిస్టుపార్టీ తక్కిన పార్టీలన్నిటి కన్నా పెద్దది. అయిదేళ్ళక్రితం ఆ దేశంలో పరిపాలనాధికారం చెలాయించిరేడలాడియర్లు, రేనోలు కమ్యూనిస్టుపార్టీని నిషేధించారు. ఈనాడు వాస చరిత్రభష్టులై మన్నుతింటున్నారు. ఈనాడు మీరు మమ్మల్నంటున్నట్లే

ఆనాడు వారూ కమ్యూనిస్టులను దేశద్రోహులన్నారు. ఆ మాటలకు కమ్యూనిస్టులు నష్టపడిందేమీలేదు. స్వార్థరహితులై మాతృదేశ స్వాతంత్ర్యం కోసం తీవ్రకృషిచేశారు. ప్రజాశక్తుల విశ్వాసాన్ని చూరగొన్నారు. ఈనాడు ఫ్రాన్సులో మహత్తరమైన ప్రజాస్వామికోద్యమానికి నాయకులయ్యారు. వెనుకటి సామ్రాజ్యవైభవంకోసం గుటకలు వేస్తున్న డిగాల్, అతని అనుచర బృందమూ ఈనాడు మీరు మమ్మల్ని ఆడిపోస్తున్నట్లే, తమ దేశంలోని కమ్యూనిస్టులను కూడా మాస్కో ఏజంటులని విషప్రచారం చేస్తున్నారు. అలాంటి నీచప్రచారం చేస్తున్నాకూడా, కమ్యూనిస్టులకు ప్రభుత్వంలో ప్రముఖస్థానాలనివ్వక తప్పిందికాదు: దేశ పునర్నిర్మాణశాఖలకు మంత్రులు కమ్యూనిస్టులే.

యుగోస్లావియాను చూడండి. నాజీల ఇనుప పాదాలక్రింద పడిపోయిందా దేశం. కాని, స్వాతంత్ర్య జ్యోతిని ఆరనివ్వలేదు కమ్యూనిస్టులు. యూరప్ ఖండంలోకల్లా సాటిలేని ప్రజా స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్మించారు. మూడులక్షలకు పైగా స్వాతంత్ర్య సేనను తరిఫీదు చేశారు. ఈ మహోజ్జ్వల ఉద్యమానికంతకూ నాయకుడు—టిటో. అతను క్రోటు జాతికి చెందినవాడు. కమ్మరిదగ్గర కూలీగా జీవితం ప్రారంభించాడు. సోదర ప్రజల హక్కులకోసం నిరంకుశ ప్రభువుల నెదిరించి పోరాటం జరిపాడు. శిక్షలకు, చిత్రహింసలకు ఆ దృఢకాయుడు చలించలేదు. పోలీసు వేటకుక్కల చేత విధివిరామం లేకుండా తరుమబడ్డాడు. పదిహేను సంవత్సరాలు రహస్యజీవితం గడిపాడు. ఆయోధుడీనాడు ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు. మారుమూలల్లోకూడా అతని పేరు మారుమ్రోగుతూంది. ఎందువల్ల? ప్రజాసామాన్యంలో అంతర్భూతమై ఉన్న స్వాతంత్ర్యేచ్ఛ వీరత్వమూ అతనిలో మూర్తీభవించాయి. ఆరెండింటి అండతోనే అతను యుగోస్లావియా స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించాడు. నూతన యుగోస్లావియాను నిర్మించాడు. ఆనూతనయుగోస్లావియాలో వివిధజాతులమధ్య స్పర్ధలకిక అవకాశంలేదు. అవి ఒకదానికొకటి తోడునీడగా ఉండి భవిష్యత్తును నిర్మించుకుంటున్నాయి! ఆ వివిధ

జాతుల ప్రజలు టిటో వెనుక సంఘటితమై నిలిచిఉన్నారు. ఆ టిటో ఎవరు? యుగొస్లోవియా కమ్యూనిస్టు నాయకుడు.

బల్గేరియాలో కమ్యూనిస్టుపార్టీ పదేళ్లు రహస్య జీవితం గడిపింది. ఫాసిస్టు పాలకులు తమ హింసావిధానాన్ని ఆ పార్టీమీద కేంద్రీకరించారు. అయినా కమ్యూనిస్టులు తమ దీక్షను వదలలేదు. ప్రజాసామాన్యంలోకి చొచ్చుకుపోయారు. ఈనాడు అక్కడ పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ ప్రథమ స్థానం కమ్యూనిస్టు పార్టీదే. ప్రభుత్వంలోనూ, సైన్యంలోనూ ముఖ్య స్థానాలు వారివే,

రుమేనియా, ఆస్ట్రియా, హంగరీ — ఈ దేశాలన్నిటిలోనూ ఇదే కథ. నిన్న మొన్నటివరకు నిషిద్ధమై, నిరంకుశ పాలకులచేత వేటాడబడిన చిన్ని కమ్యూనిస్టుపార్టీలు, నాజీ నరహంతకులను ధిక్కరించి పోరాడుతూ, దినదినాభివృద్ధి పొంది ఈనాడు ప్రముఖస్థానాల నలంకరిస్తున్నాయి. పవిత్ర స్వాతంత్ర్య పోరాట సమరాగ్నిలో సంస్కారంపొంది ప్రజా నాయకత్వం నిర్వహిస్తున్నాయి.

పోలండులో ఎనిమిదేళ్ల క్రితం కమ్యూనిస్టుపార్టీని రద్దుచేశారు. ఈనాడు నూతన ప్రజా పోలండు ప్రభుత్వంలో అగ్రస్థానం దానిదే. ఫిన్లండులో కమ్యూనిస్టులను సోవియట్ గూఢచారులని చెప్పి నానా బాధలు పెట్టారు. ఈ నాడు ప్రభుత్వవర్గంలో ఉన్న మూడు పార్టీల్లోను కమ్యూనిస్టుపార్టీ ఒకటి.

ఫాసిజానికి ఆటపట్టయిన ఇటలీలో ఇరవైయేళ్ళపాటు కమ్యూనిస్టులపై దాడిసాగింది. ఈనాడు ఇటలీ ప్రభుత్వవర్గంలో ముఖ్యస్థానాలు కమ్యూనిస్టులవి. వారి నిర్మాణదక్షతకు, త్యాగపటిమకు, ధైర్యసాహసాలకు కరుడుగట్టిన అభివృద్ధినిరోధక పత్రికావిలేఖరులుకూడా జోహార్లు చేయక తప్పింది కాదు. బెల్జియం ప్రభుత్వంలో ఉన్న మూడు పార్టీల్లో కమ్యూనిస్టుపార్టీ ఒకటి. అక్కడ కమ్యూనిస్టు ఆహారశాఖామంత్రి ఉండి దొంగలనరికట్టి, దొంగమార్కెట్టును చాలవరకు రూపుమాపాడు.

హాలండు, డెన్మార్కు, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండు—యూరప్‌లో అన్ని దేశాల్లోనూ కమ్యూనిస్టుపార్టీలిలాగే దినదినాభివృద్ధి పొందాయి. తమ ప్రజల చరిత్రకు ఉజ్వలరూపం తీర్చిదిద్దుతున్నాయి. చిన్ని ఆల్బేనియాలోకూడా జమీందారీ వలసరాజ్య వ్యవస్థను రూపుమాపి, ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థవైపు తన ప్రజలను నడుపుతున్నది కమ్యూనిస్టు నాయకుడయిన అన్వర్ హోక్సా. అతనింకా ముప్ఫయ్యవపడిలోనే ఉన్నాడు.

ఇక గ్రీసులో జాతీయ స్వాతంత్ర్య సంఘటన (ఇ. ఎ. యం) కు నాయకత్వం వహించింది కమ్యూనిస్టులే. ఆ సంస్థ నాయకత్వాన్నే ఫాసిస్టు వ్యతిరేక స్వాతంత్ర్యపోరాటం సాగింది. ఈనాడు ప్రజాశక్తులను కాదని బ్రిటిష్‌వారు గ్రీసులో తిరిగి రాచరికపు ఫాసిజాన్ని నెలకొల్ప జూస్తున్నారు. ఈ ఆటలను సాగనీయకుండా ప్రజాందోళనను నడుపుతున్నది కమ్యూనిస్టులే. గ్రీకు ప్రజాస్వామికోద్యమానికి గుండెకాయ కమ్యూనిస్టులే అని అందరూ గుర్తిస్తున్నారు.

ఆగ్నేయ ఆసియాలో అగ్రదళం - కమ్యూనిస్టులే

ఇటు దక్షిణ ఆసియాలో మిగతాదేశాలన్నిటినీ చూడండి. ఆదేశాల జాతీయోద్యమాల్లో విప్లవ పక్షాలకు నాయకత్వం కమ్యూనిస్టు పార్టీదే. ఈ విషయం మీకక్కరలేదా? జపానుదురాక్రమణదశలో ఆ ఫాసిస్టు మూకల్ని ప్రతిఘటించి స్వాంతత్రోద్యమాన్ని నడిపింది కమ్యూనిస్టుపార్టీలే. ఈనాడు, వెనుకటి సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తిరిగి తమపెత్తనాన్ని నెలకొల్పబోతూంటే, ఎదుర్కొని ప్రజాస్వామికోద్యమాన్ని నడుపుతున్నది కమ్యూనిస్టుపార్టీలే. సామ్రాజ్యవాదులు తిరిగి తమ దుష్టపరిపాలనను స్థాపించగలిగినచోట, దేశభక్త పక్షాలనన్నిటినీ సంఘటితపరిచి, సంపూర్ణ స్వయం నిర్ణయాధికారం కోసం నూతన ప్రజాపోరాటాన్ని లేవదీస్తున్నది కమ్యూనిస్టుపార్టీలే.

మన పొరుగింటనున్న బర్మాను తీసుకోండి. మొట్టమొదటిసారి నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేకఉద్యమం సాగించింది 'దోబామా' పార్టీ. దీనిని బర్మాప్రజల జాతీయసంస్థగా, సోదరసంస్థగా మీనాయకత్వంక్రింద కాంగ్రెసు గుర్తించింది. ఆ సంస్థనాయకుల్లో చాలమంది కమ్యూనిస్టులే. రాంఘర్ కాంగ్రెసుకి దాని నాయకుల్లో ఆంగ్‌సాన్. ధాన్‌టున్. బాహిన్ మొదలయిన నాయకులువచ్చారు. వీరిలో థాన్‌టున్, బాహీన్‌లుకూడా ఈనాడు బర్మా కమ్యూనిస్టుపార్టీలో ఉన్నారు.

యుద్ధకాలంలో బర్మాలో దోబామాలోను, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలోను భేదాభిప్రాయాలు వచ్చాయి. కొందరు యుద్ధం ఇంకా సామ్రాజ్యవాద దశలోనే ఉందనుకున్నారు. మరికొందరది ప్రజాయుద్ధంగా మారడం గుర్తించారు. పార్టీనాయకత్వంలో ఎవరి అభిప్రాయాలనుబట్టి వారు నడచుకున్నారు. ఒకభాగం జపానువారి కౌగిళ్ళలోకి వెళ్ళింది. రెండవది (ప్రజా యుద్ధమని గుర్తించినది) రహస్య ఉద్యమం ప్రారంభించింది. జపానువారు రాకుండానే మన దేశంలో జరిగిందంతా బర్మాలో జరిగింది. కాని, ఆదేశాన్ని జపానువారు ఆక్రమించుకొని ఉండడంవల్ల ఆ ఘటనలు మరింత ప్రమాదకరము లయాయి. మా సోదరపార్టీ కొద్దికాలానికే కోలుకుంది; పునర్నిర్మాణ మయింది; జపానుఫాసిస్టుల్ని ప్రతిఘటించి, స్వాతంత్ర్యోద్యమం సాగించింది. చివరకది ఫలించింది. సరిగ్గా మిత్రసేనల విజృంభణ ప్రారంభమయేసరికే, దేశంలో వివిధప్రాంతాల్లో ప్రజలు తిరుగుబాటు లేవదీశారు.

జపానువారు దేశంలో తిష్టవేసి ఉన్నంతకాలమూ బర్మా కమ్యూనిస్టు పార్టీ రహస్యంగా తన కార్యక్రమాన్ని సాగిస్తూనే వచ్చింది. అంతటితో తృప్తిపడలేదు. ఇతర దేశభక్త పక్షాలను, సంస్థలను సంఘటితపరచి 'ఫాసిస్టు వ్యతిరేక ప్రజాస్వాతంత్ర్య సమ్మేళనాన్ని' స్థాపించడానికి చొరవతీసుకొని కృషిచేసింది. మిత్రసేనలు గెలిచి, బ్రిటిష్‌వారు తిరిగి బర్మాలో కాలుపెట్టితే వారనుసరించబోయే పంథా అక్కడి కమ్యూనిస్టులకు ముందుగానే తెలుసు. ఆ విషయంలో వారేలాంటి పిచ్చిభ్రమలూ

పెట్టుకోలేదు. అలాంటి సామ్రాజ్యవాద పంథాకు బర్మాప్రజలిచ్చే జవాబుకు సూచనగా 'ఫాసిస్టు వ్యతిరేక ప్రజా స్వాతంత్ర్య సమ్మేళనా'న్ని ఇంకా విస్తృతం చేశారు. అందులో చేరకుండా మిగిలిన దేశభక్త సంస్థగాని, ప్రజానాయకులుగాని ఈనాడు లేరు. వెనుకటి మితవాద నాయకులు కూడా దానిలో చేరారు. తక్షణమే స్వాతంత్ర్యాన్ని చేపట్టాలనే బర్మా ప్రజల పవిత్ర దీక్ష ఆ జాతీయసంస్థలో మూర్తీభవించింది. వయోజన వోటింగు పద్ధతి ననుసరించి కొత్త 'ప్రజాపరిషత్సభ'ను వెనువెంటనే ఎన్నుకోవాలనీ, బర్మా స్వాతంత్ర్యాన్ని బ్రిటనూ, తదితర మిత్రరాజ్యాలూ గుర్తించాలనీ ఈసంస్థ ఆందోళన ప్రారంభించింది. బర్మా రాజకీయజీవితాన్ని నేడు ఏకతాటిమీద నడుపుతూన్న ఈ జాతీయసంస్థకు ప్రధానకార్యదర్శి-ప్రజాభిమానాన్ని చూరగొన్న కమ్యూనిస్టు నాయకుడు థాన్‌టున్. దాని అధ్యక్షుడు మేజర్ జనరల్ ఆంగ్‌సాన్.

ఈ ఆంగ్‌సాన్ ఒకప్పుడు కమ్యూనిస్టుపార్టీ నాయకుడుగా ఉండేవాడు. కాని అతను జపానుపక్షం చేరాడు. మనదేశంలో సుభాస్‌బోసు అనుసరించిన మార్గాన్నే అతను బర్మాలో త్రొక్కాడు. జపాను సహాయంతో స్వాతంత్ర్యం సంపాదించగలమని నమ్మి జపానువారితో చేరిపోయి, వారివద్ద తరిఫీదునందిన బర్మావారిని ఒకసేనగా తయారుచేసి, దానికి అధిపతి అయాడు. జపానువారితో కలిసి బర్మామీదికి వచ్చాడు.

బర్మాలో బ్రిటిష్‌వారిని తరమకొట్టడానికి ఆంగ్‌సాన్ ఎంతో తోడ్పడ్డాడు. బ్రిటిష్ వారిని ఓడించినతరువాత జపానువారి అసలు వైఖరి బయటపడ నారంభించింది. ఆంగ్‌సాన్ నాయకత్వంక్రింద నుండిన 75 వేల "బర్మా జాతీయసైన్యా"న్ని హటాత్తుగా 10 వేలకు తగ్గించారు. అంతకన్నా ఎక్కువమందిని చేర్చుకొని, తరిఫీదు చేయకూడదని జపాను వారాజ్ఞాపించారు. ఆంగ్‌సాన్ త్వరలోనే జపానువారి నిజస్వభావాన్ని గ్రహించాడు. ఆ రోజుల్లో బర్మా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ సో. అంగ్‌సాన్. సోలు పూర్వం సహచరులు. ఆంగ్‌సాన్ భ్రమలన్నీ వదిలిపోయాయని గ్రహించి రహస్య జీవితం గడుపుతూన్న సో అతన్ని

కలుసుకున్నాడు. అది జరిగిన కొద్దిరోజులకే ఆంగ్‌సాన్ తిరిగి కమ్యూనిస్టుపార్టీలో చేరడానికి అనుమతిని కోరాడు.

దానికి మా బర్మా సోదరులిచ్చిన జవాబిది :

"మీరు జపానువారితో కలిసినప్పుడు మిమ్మల్ని దేశద్రోహి అన్నాము. కాని, నేటినుండి మీరు మాకు సోదరులు. అయినప్పటికీ మీరు ఇప్పుడున్న స్థానంలోనే ఉండాలి. ప్రజలందరూ జపాను మూకలపై తిరుగుబాటు లేవదీయాలని మా పార్టీ సందేశమిచ్చింది. ఈ సందేశాన్ని మీ సేనచేత అమలు జరిపించండి. ఆ విధంగా మీ స్థానంలో ఉంటూనే ప్రజలపట్ల మీ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చండి. మీ స్థానంలో ఉంటూనే పార్టీ ఆదేశాలను అమలు జరపండి. వాటితో మీ రేకీభవిస్తేనే అలా చేయండి, ఇతర పార్టీ సభ్యుల కిస్తున్నట్లు మీకు మే మేలాంటి ఉత్తరువులను ఇవ్వము. మా అభిప్రాయలను, మేము చేయదలచుకున్న పనులను మీకు తెలియజేస్తూఉంటాము మీమట్టుకు మీరే ఆలోచించుకోండి. బర్మా కేదిశ్రేయస్కరమని అనుకుంటారో అదేచేయండి, కార్యాచరణలో పార్టీపట్ల మీవిధేయతను నిరూపించండి. అప్పుడు పార్టీ మిమ్మల్ని పూర్తిగా విశ్వసిస్తుంది.

బర్మాఅంతా ఆంగ్‌సాన్‌కి బ్రహ్మరథం పడుతూఉంది. నిజమే. కాని, మా సోదర పార్టీనైతిక స్థాయి అంతగొప్పది. ఆంగ్‌సాన్ని అంత సులభంగా మాపార్టీలోకి తిరిగి తీసుకోలేదు, ఈనాడు బర్మాప్రజలందరూ అనుకుంటున్నారు. "ఆంగ్‌సాన్ కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు కాకపోతే కాకపోవచ్చును. కాని, వారు పార్టీసభ్యులతో సమానమే: వారికీ వీరికీ తేడా ఏముంది?

మేము (భారత కమ్యూనిస్టుపార్టీ) యుద్ధకాలం పొడుగునా మా సోదర బర్మాపార్టీతో సంబంధం పెట్టుకొనే ఉన్నాము. దీనికి బ్రిటిష్ వారెన్నో ఆటంకాలు కలిగించారు; కాని, వాటినన్నిటినీ తొలగించుకొని బర్మా సోదరులతో సన్నిహిత సంబంధం పెట్టుకుంటూ వచ్చాం. రాజకీయాల్లోను, నిర్మాణం విషయాల్లోను వారికి మేమిచ్చిన సలహాలుగాని,

చేసిన సహాయానికిగాని వారు "మా అన్నలు" అని అభిమానంతో మాకు బిరుదిచ్చారు.

అందరినీ ఉత్తేజపరిచింది చైనా

ఇండొనీషియా కమ్యూనిస్టుల ధైర్యసాహసాలను గురించి. త్యాగదీక్షను గురించి మీలో జవహర్లాల్‌గారికి తెలుసు. "సామ్రాజ్యవాద వ్యతిరేక సమ్మేళనం" యొక్క సమావేశాలకు కాంగ్రెసు ప్రతినిధిగా వెళ్ళినప్పుడు నెహ్రూగారు వారిని గురించి తెలుసుకున్నారు. యుద్ధంవల్ల వారికీ మాకూ సంబంధాలు తెగిపోయాయి. అందువల్ల ప్రస్తుతం వారి వైఖరి ఏమిటో మాకు ప్రత్యక్షంగా తెలియదు. కాని, ఇండొనీషియా ప్రభుత్వంలో ప్రముఖుడూ; ఆంతరంగిక వ్యవహారశాఖ మంత్రి అయిన అమీర్ షరీఫుద్దీన్ కమ్యూనిస్టుపార్టీ సభ్యుడని 'స్టేట్స్‌మన్' పత్రిక వలన తెలుస్తోంది. ఇండొనేషియా స్వాతంత్ర్య పోరాటచరిత్ర పూర్తిగా బయటపడినప్పుడు, అక్కడి కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిన పాత్ర, అందులో గౌరవ స్థానాన్నలంకరిస్తుందనడానికి మా కేలాంటి సందేహమూ లేదు.

ఇండోచైనాను గురించికూడా సరియయిన భోగట్టా లేదు. దేశభక్తుడయిన భారత సైనికోద్యోగి సైగావ్ వెళ్ళివచ్చిన వారెవరయినా కనబడితే అడగండి. వీట్‌మిన్ (ఇండోచైనా జాతీయకాంగ్రెసు) కి ప్రాణం కమ్యూనిస్టులే అని నిస్సంకోచంగా చెబుతాడు.

మలయాలో? జపానుసేనల్ని ప్రతిఘటిస్తూ కమ్యూనిస్టుపార్టీ పందలకొలది సభ్యుల్ని కోల్పోయింది. అయినప్పటికీ మా సోదరపార్టీ పదివేలమంది స్వాతంత్ర్య యోధులతో 'ప్రజాసైన్యా' న్ని నిర్మించింది. దేశంలోని అభివృద్ధికరశక్తుల్లో అగ్రగణ్యమైనదానిగా ఈ నాడు అందరూ కమ్యూనిస్టుపార్టీని గుర్తిస్తున్నారు.

ఇక ఉజ్వల చైనావిషయం చూదాం. నెహ్రూపండితునికీ మాకూ అదొక ఆశాజ్యోతి. దాని అమరగాథను మన జాతీయోద్యమం పూర్తిగా అవగాహన చేసుకోవాలనే వారూ, మేమూ కోరుతున్నాం.

జంగ్‌కైషేక్ చైనా కమ్యూనిస్టులను ఊచకోత కోశాడు. దేశం నలుమూలలా ఈనాడు మా పార్టీని ఆడిపోస్తునట్లే అతనుకూడా మా సోదర చైనా పార్టీపై ఆనాడు విషప్రచారం సాగించాడు. ఆనాడు నెహ్రూపండితుడు 'ఎదిరిపక్షం' లో లేరు. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ సమ్మేళన సమావేశాల్లో మా పక్షం వాదించారు. స్మెడ్లీ, ఎడ్గార్‌స్నో, ఇజ్రాయెల్, ఈప్‌స్టీన్ మొదలైన పత్రికావిలేఖరులు, గ్రంథకర్తలు చైనాను గురించి రాసిన పుస్తకాలను చదివినవారికందరికీ ఈవిషయాలు బాగా తెలిసినవే. ఈరచయితల్లో ఎవరూకూడా కమ్యూనిస్టులుకారు.

మార్షల్ జంగ్‌కైషేక్ సైనికులు తుపాకి పట్టినప్పుడే కామ్రేడ్ చూతే సైనికులు ఆత్మరక్షణకోసం తుపాకి పడుతున్నారు. మరో విధంగా కాదు. మార్షల్ జంగ్‌కైషేక్ సంప్రదింపులకు సిద్ధపడితే కామ్రేడ్ చౌఎన్‌లై వెంటనే ప్రయాణమై వస్తున్నాడు. అంతేకాదు. తనరాకవల్ల ప్రజాస్వామిక చైనా నిర్మాణానికి ఏమాత్రం ప్రయోజనం ఉంటుందనుకున్నా కామ్రేడ్ మావ్ స్వయంగా బయలుదేరి చుంకింగుకి వస్తున్నాడు. చైనా కమ్యూనిస్టుల నినాదం ఒక్కటే— "చైనావారే చైనావారిని చంపుకోకూడదు." మార్షల్ జంగ్‌కైషేక్‌ని వారడుగుతున్నది ఒక్కటే— "తక్షణమే ప్రజాస్వామిక సూత్రాల నమలుజరిపి, జాతీయైక్య సంఘటనను స్థాపించాలి. నియంతృత్వం అంతరించాలి. దేశభక్తులమధ్య అంతర్యుద్ధం అంతరించాలి."

1945 ఏప్రిల్‌మాసంలో మా సోదరచైనా కమ్యూనిస్టుపార్టీ ఏడవ మహాసభ జరిగింది. అందులో కామ్రేడ్‌మావ్ కొన్నిలెక్కలిచ్చాడు. జపానుఫాసిస్టులనుండి మా చైనా సోదరులు 3, 53,000 చదరపుమైళ్ళ విస్తీర్ణంగల ప్రదేశాన్ని విముక్తిపరచారు. అంటే బెంగాల్, బీహారు, యు.పి., పంజాబు రాష్ట్రాలన్నీ కలిపినదానికన్నా పెద్ద భూభాగమన్నమాట. ఈ ప్రదేశంలో నాయకత్వంఅంతా మా సోదరపార్టీదే. ఈనాడు జనరల్ చూతే నాయకత్వంక్రింద 9 లక్షల సుశిక్షిత సైన్యంఉంది. ఈ ప్రాంతాల్లోని పరిపాలనా విధానం జాతీయశక్తుల ఐక్యతపై నాధారపడి, ప్రజా

స్వామిక సూత్రాలననుసరించి సాగుతూంది. అక్కడ అన్నివిధాలా అగ్రస్థానం కమ్యూనిస్టుపార్టీదే అయినా, వివిధప్రాంతాల ప్రభుత్వవర్గాల్లో మూడవవంతుకన్నా ఎక్కువమంది కమ్యూనిస్టులుండకూడదని మా సోదర పార్టీ నిర్ణయించింది. మరొక మూడవవంతు ఐక్యతను కోరే కొమింటాంగు పార్టీసభ్యులూ, మిగతా మూడవవంతు ఏపార్టీకిచెందని దేశభక్తులూ ఉండాలని నిర్ణయించింది. ఈ విధంగా ప్రభుత్వ నిర్వహణలో దేశభక్తవర్గాలన్నింటికీ తనతో సరిసమాన స్థానమిచ్చింది. ఏకపక్ష నియంతృత్వమైన కొమింటాంగు ప్రభుత్వ విధానానికిది పూర్తిగా వ్యతిరేకము. ఏప్రిల్ తరువాత మా సోదరపార్టీ సభ్యత్వం ఎంతో పెరిగిందన్న విషయం అందరికీ తెలిసినదే.

మా పార్టీపై ధ్వజమెత్తడమంటే—

ఆగ్నేయ ఆసియా దేశాల స్వాతంత్ర్యోద్యమాలను ప్రతి భారతదేశభక్తుడూ జాగ్రత్తగా గమనించాలి. మన స్వాతంత్ర్యోద్యమాభివృద్ధికి ఇదెంతో అవసరం. 1942 లో మీరు 'క్విట్ ఇండియా' నినాదం లేవదీశారు. (బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని విడిచిపోవాలి.) ఇప్పుడు 'క్విట్ ఆసియా' అంటున్నారు ఈ సందర్భంలో మీరొక విషయాన్ని తెలుసుకోవాలి. ప్రపంచంలో ప్రతి కమ్యూనిస్టూ తాను పార్టీలో చేరిన నాటినుండీ సామ్రాజ్యవాద శక్తులనన్నిటినీ ఉద్దేశించి 'క్విట్ ప్రపంచం' అనే నినాదమిస్తున్నాడు. తన ప్రజలకే కాకుండా, ప్రపంచ ప్రజలందరి శ్రేయస్సుకు అగర్భశత్రువయిన సామ్రాజ్యవాదం, పురుగైనా మిగలకుండా అంతరించిపోవాలనే అతను ప్రధానంగా కోరుతున్నాడు. ఈవిషయాన్ని మీరు మరచిపోకూడదు. ఎంతో ఉద్రేకంతో మీరు 'క్విట్ ఆసియా' అంటున్నారు. మిమ్మల్నొక విషయం అడుగుతాము. భారతీయుడే సోదర భారతీయునిపై కత్తిదూయడం' ద్వారా మీ ఆశయాన్ని మన దేశంమట్టుకయినా ఎలా సాధించగలరు? మాటల్లోనూ, చేతల్లోనూ ఈనాడు మీరు చేస్తున్నదిదేకదా? ఒక్క మా పార్టీమీదనే కాదు, ముస్లింలీగుపై కూడా మీరు కత్తి దూశారు.

లీగు నాయకవర్గము తనతరపున తానే మాట్లాడుకోగలదు. కాంగ్రెసుపై వారు చేస్తున్న ప్రచారంతో మే మెంతమాత్రమూ ఏకీభవించము. ఆ ప్రచారం తీరును మే మెంతో అసహ్యించుకుంటున్నాము. తమ వాదనను సమర్థించుకుంటూ వారు చెప్పేదానినంతటినీ మే మంగీకరించడం లేదు. దీనిని చెప్పేపద్ధతి కూడా మే మామోదించడం లేదు. అయినప్పటికీ జాతీయసంస్థల్లో ముస్లింలీగు రెండవదని మేము గుర్తిస్తున్నాము. ముస్లిం ప్రజలకు స్వయం నిర్ణయాధికారం కావాలని అది కోరుతూన్న కోరికను బలపరుస్తున్నాము. భారతప్రజలందరికీ స్వాతంత్ర్యం కావాలనే కాంగ్రెసు ఆశయాన్ని ఏ కారణాలచేత నయితే బలపరుస్తున్నామో, సరిగా అదే కారణాలతో ముస్లింలీగు ఆశయాన్ని కూడా బలపరుస్తున్నాం

ఆరు రాష్ట్రాలను (అస్సాం, బెంగాల్, సింధు, పంజాబు, సరిహద్దు రాష్ట్రము, బెలుచిస్థాన్) ఇప్పుడున్న సరిహద్దులతోనే లీగు నాయకవర్గం కోరుతూంది. ఇది అక్రమమని మేము ఖండిస్తున్నాము. ముస్లిం జన్మభూములకు న్యాయమైన సరిహద్దు లేవో, మేము సూచించాము. ఆ సరిహద్దుల్లో ఉండే ప్రదేశాలకే లాహోరుతీర్మానం వర్తించాలన్నాము. నిర్మాణాత్మకమైన ఇలాంటి సూచనలు మీరేవీ చేయలేదు. 1942 కి పూర్వం మీరు మమ్మల్ని గురించి ఏమనుకునేవారో ఇంచుమించు లీగు నాయకత్వంకూడా అంతే అనుకుంటున్నారు. మీరే కారణాలచేతనయితే అలా అనుకున్నారో, వీరూ అదే కారణాలచేత అలా అనుకుంటున్నారు. భేదాభిప్రాయాలు కలిగినప్పుడు, మిమ్మల్ని విమర్శించినట్లే, వారినికూడా తీవ్రంగా విమర్శించాము; ఈనాడు మనదేశంలో జరుగుతూన్న విషాదకర ఘటనలకు, దేశానికి పడుతూన్న దుర్గతికి మీరిద్దరే సరిసమానంగా బాధ్యులనీ: మీరిద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా, తప్పుదారి తొక్కుతున్నారనీ, మేము గట్టిగా చెబుతున్నాము.

ఇక్కడ ప్రధానంగా చర్చిస్తున్నది మీకూ మా పార్టీకీ గల సంబంధాన్ని గురించే. తమ సిద్ధాంతాన్ని గుడ్డిగా అనుసరించే మేధావుల

గ్రూపుగా మీరు మా పార్టీని లెక్కగడుతున్నారు. ఇది పొరపాటు. వీరు తమ దైనందిన జీవితసమస్యలపై కాంగ్రెసువర్కర్లకన్నా బాగా కష్టపడి పనిచేస్తారు. కాబట్టే ప్రజల్లో ఒక చిన్నభాగం వీరికి విధేయులై ఉన్నారని మీ అంచనా. 1942 నుంచి "ఎదిరి పక్షంతో చేరిపోయాం" ని చెప్పి ఖండిస్తే చాలు, మాపార్టీ ఇసుకమేడలాగా నేలకూలిపోతుందనీ, ఇప్పుడు మమ్మల్నినుసరిస్తున్న ప్రజలుకూడా విడిచిపెట్టి పోతారనే మీ భ్రమ.

మమ్మల్ని గురించి మీ అభిప్రాయాలు ఎలాఉన్నా, మీరీ విధంగా అనుకోవడం ప్రజలను నీచంగా చూడడమవుతుంది. ప్రజాస్వామ్యవాది కది తగదు. కడుపులో చల్ల కదలకుండా కూర్చొని. ప్రజాసామాన్యమంటే తలకాయలేని మూగ పశువులక్రింద లెక్కగట్టే మధ్యతరగతి మహానుభావులకే ఆధోరణి చెల్లుతుంది. ఎవరు మచ్చిక చేసుకుంటే వారివెంట తోకాడించుకుతిరిగే మందలు — వీరి దృష్టిలో ప్రజలు. కాంగ్రెసువంటి ప్రధానజాతీయసంస్థకు నాయకులైన మీరు ప్రజల నీవిధంగా చూడరనే మేమాశిస్తున్నాము. ప్రజాస్వామిక వాదులకు అర్హమయినవిధంగా మీరు ప్రజలను గౌరవిస్తారని అనుకుంటున్నాము. రాజకీయ చైతన్యంతో, మాపార్టీ పతాకాన్ని తమ పతాకంగా స్వీకరించి, నూతన జీవితాన్ని నిర్మించుకోవాలి. మాతృదేశ స్వాతంత్ర్యాన్ని సాధించాలి అనే దీక్షతో మా పార్టీ ననుసరించే శ్రమ జీవులనయినా మీరు గౌరవిస్తారని ఆశిస్తున్నాము.

మా పార్టీ మీరనుకున్నటువంటిది కాదు. పుట్టినదగ్గరనుంచీ దానికి మీతో కొద్దోగొప్పో భేధాభిప్రాయాలు ఉంటూనే ఉన్నాయి. అయినప్పటికీ అది క్రమక్రమమాభివృద్ధి పొందుతూ, నేటికి మనదేశంలోని రాజకీయ పక్షాల్లో కాంగ్రెసు, లీగుల తరువాత మూడవ స్థానాన్నలంకరిస్తూంది. కాంగ్రెసు, లీగులు రెండింటితోనూ భేదించిన విషయాల్లోకూడా మా పార్టీ అసంఖ్యాక భారతీయులను తన పాలసివైపు ఆకర్షించ గలుగుతూంది. దీనిని బట్టయినా మీరు మాపార్టీ ప్రాధాన్యతను గుర్తించాలి.

భారతకార్మికోద్యమంలో ప్రధానశక్తి మా పార్టీ. ఆఉద్యమాన్ని నిర్మించింది ప్రధానంగా మా పార్టీయే. అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు జనరల్‌కౌన్సిల్‌లో మెజారిటీ కమ్యూనిస్టులదే. ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మొత్తం సభ్యత్వం అయిదులక్షలు. ఇందులో మేము నిర్మించి, నడుపుతూన్న యూనియన్ల మొత్తం సభ్యత్వం మూడులక్షలకు పైగా ఉంది.

అఖిలభారత కిసాన్ సభ నిర్మాతల్లో మాపార్టీ ఒకటి. ఈనాడా సంస్థకు నాయకత్వం వహించి నడుపుతూన్నది మా పార్టీయే. కిసాన్‌సభ మొత్తం సభ్యత్వం ఈనాడు ఎనిమిది లక్షలు, ఈసంస్థ నాయకులు కొందరు దీనిని విడిచిపోయారు నిజమే. వాళ్ళను పోనీయకుండాచేయడానికి మా శక్తివంచన లేకుండా ప్రయత్నించాము. కాని వారు రైతు సంఘాల ప్రతినిధులయొక్క ప్రజాస్వామిక నిర్ణయాలను లెక్కచేయకుండా నిరంకుశాధికారం చెలాయించ బోయారు.

వానిస దేశాల్లో సంఘటితమైన కార్మిక కర్షక వర్గాలే స్వాతంత్ర్యోద్యమాలకు పట్టుగొమ్మలుగా ఉంటాయి. భవిష్యత్ ప్రజాస్వామిక వ్యవస్థా స్థాపనకు పునాదులుకూడా అవే. ప్రపంచంలో అన్నిదేశాల్లోనూ ఇదే రుజువయింది మనదేశ విషంలోనూ అంతే.

భారతదేశంలో మాపార్టీ పుట్టకపూర్వం కార్మిక సంఘాలూ, కిసాన్ సభలూలేవు. మాపార్టీ పుట్టిన దగ్గరనుంచీ ఆ వర్గాల హక్కుల కోసం పాటుపడింది; వారిని సంఘటితపరచి, కార్మిక కర్షక ఉద్యమాలను నిర్మించింది. అవి ప్రత్యేకవర్గ ఉద్యమాలు. స్వాతంత్ర్యము, ప్రజా స్వామ్యాలనే సమాన ఆశయాలే వివిధపార్టీలమధ్య, సోదర సంబంధాన్ని నెలకొల్పగలవు. ఆ మహదాశయాల పేరిట మీకొక విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సంఘటిత కార్మిక, కర్షక వర్గాలపట్ల కొంత గౌరవ భావం చూపండి, తద్వారా మా పార్టీని కొంత గౌరవించండి. మాతృదేశ భావి భాగ్యోదయానికి మా పార్టీచేయగల సేవకు నిదర్శనాలు ఈ కార్మిక, కర్షక ఉద్యమాలే.

చైతన్య పూరితాలయిన ఈ కార్మిక కర్షక ఉద్యమాలను కాంగ్రెసుకి చేదోడు వాదోడుగా ఉంచుకోవడమా? లేక, వాటిని విచ్ఛిన్నం చేయడమా? ఏది మీ విద్యుక్త ధర్మం? వాటిని విచ్ఛిన్నం చేయడమే మీ కర్తవ్య మనుకుంటారేమో. మహాబలసంపన్నమయిన బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వమే ఆపని చేయలేకపోయింది. మీకది సాధ్యం కాదు—ముమ్మాటికీ కాదని నిస్సందేహంగా చెప్పగలము. ఈ నూతన ప్రజా ఉద్యమాలు మీరు సహాయంచేస్తే వచ్చినవి కావు. మొదటినుంచీ మాతో మీకుగల అభిప్రాయభేదాలు అడ్డుగలుగు తున్నప్పటికీ చలించకుండా, దీక్షతో కృషిచేసి, మేము నిర్మించినవే ఈ ఉద్యమాలు. ఈ విషయం మీరెరుగుదురు. మా ఉపన్యాసాల ఆవేశాగ్నిలో కరిగి, మాచెమటను తడిసి, రూపొందినవే ఇవి. ఒక్క విషయం సర్వకాల సర్వావస్థలందూ గుర్తుంచుకోవలసిందని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాం. మాపై ధ్వజమెత్తడమంటే, చైతన్యపూరితులైన ఈ కార్మిక, కర్షక ప్రజాసామాన్యంమీదనే ధ్వజమెత్తడమన్నమాట. మా పార్టీని కూకటివేళ్ళతో పెళ్ళగించాలనుకోవడం ప్రజాస్వామిక భారతనిర్మాణానికి పునాదులయిన ఈ ఉద్యమాలనే పెకలించడమన్నమాట. ఈ విషయాన్ని మీరు గుర్తుంచుకోవాలి.

కాంగ్రెసునుండి మేమెందుకు రాజీనామా నివ్వాం

మీ అభియోగపత్రాన్నీ, మీ రిపోర్టునూ చదివాం. తుదివరకు మీరు లీగును ప్రతిఘటించి పోరాడ నిశ్చయించుకున్నారనీ; మా పార్టీని సర్వనాశనం చేయడమే మీ ఆశయమనీ, బొంబాయి ఏ. ఐ. సి. సి. లో మేము స్పష్టంగా గ్రహించాము. కాంగ్రెసును ఈ పంథాలోనే నడపదలచుకొన్నారని గుర్తించాము. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెసులో మాకు స్థానంలేదని నిర్ణయించుకొని మా పార్టీసభ్యులను కాంగ్రెసునుండి రాజీనామా నివ్వమన్నాం.

మీరు నిర్ణయించుకున్నపంథాను మేమెన్నటికీ అనుసరింపజాలమన్న విషయాన్ని వేరేచెప్పనక్కరలేదు. వెనుకటిరోజుల్లో, భేదాభి

ప్రాయాలు వచ్చినప్పుడు మా అసమ్మతిని తెలుపుతూ కాంగ్రెసులోనే ఉండగలిగాము. ఇప్పుడు అలాఉండడంకూడా దేశం అధోగతిపాలవడానికి తోడ్పడమే అవుతుందని గ్రహించాము.

మమ్మల్ని కాంగ్రెసులో సాధారణసభ్యులుగా ఉండనిచ్చి, కార్యనిర్వాహకవర్గాల్లో సభ్యులుగాగాని, ఆ సభ్యులను ఎన్నుకునే సంస్థల్లో సభ్యులుగాగాని ఉండనివ్వకుండా నిషేధించదలచుకున్నట్లు మీ ఉపన్యాసాలవల్ల, తెలుసుకోగలిగాము. అంటే, మమ్మల్ని నోరులేని ఖైదీలుగా కాంగ్రెసులో కట్టిపడవేసి, మాపైని మీ ప్రచారానికి ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకోదలచారన్నమాట. భారతస్వాతంత్ర్యోద్యమానికి కమ్యూనిస్టు విధానం ఎన్నటికీ శ్రేయస్కరంకాదనీ, 1942 తరువాత అది దేశద్రోహకరంగాకూడా పరిణమించిందనీ, మేము జవాబుచెబుతామనే చింతలేకుండా, మీ ఇష్టంవచ్చినట్లు దేశం నలుమూలలా ప్రచారం చేయదలచుకున్నారన్నమాట.

మీ మాటలనుబట్టిచూస్తే, మీరు చేయదలచుకున్నది అచ్చంగా ఇదే అని స్పష్టమయింది. ప్రజల్లోకివెళ్ళి కాంగ్రెసుపేరట మా పాలసీని మీ ఇష్టంవచ్చినట్లు విమర్శించడానికి మీకు సర్వాధికారాలు వుంచుకున్నారు. తోడి కాంగ్రెసువాదుల ఎదుట తన వాదనను సమర్థించుకోడానికి, కాంగ్రెసు అధికారసంస్థలద్వారా తన అభిప్రాయాలను వెల్లడి చేసుకోడానికి ప్రతికాంగ్రెసువాదికీ అవకాశంఉంది. ఆ అవకాశాన్నయినా మాకులేకుండా చేయదలచారు. మీ నిర్ణయంద్వారా, భారతప్రజాసామాన్యం ఎదుట నిలబడగల హక్కేకాకుండా, సోదర కాంగ్రెసు సభ్యుల ఎదుట నిలబడగల హక్కుకూడా మాకు లేకుండా చేయజూచారు. మా విధానాన్ని ఆమోదించి, మాపై విశ్వాసంకలిగి సోదర కాంగ్రెసు వాదులు మమ్మల్ని బాధ్యతగల స్థానాలకు ఎన్నుకోవాలనుకున్నా, ఎన్నుకోగల అవకాశంలేకుండా చేయాలనుకున్నారు.

క్రమశిక్షణ అనే మంత్రం వల్లిస్తూనే ఇదంతా చేసేయాలనుకున్నారు.

ఇదంతా సబబే అని మీరనుకుంటే అనుకోవచ్చును. కాని ఆ అభిప్రాయంతో మేముమాత్రం ఏకీభవించలేము. మేము స్వాతంత్ర్య యోధులం. నిషేధాలకు మేము తలవొగ్గజాలము. ఖైదు కొట్లలో మేము పడివుండలేము — అది భారత జాతీయ కాంగ్రెసు ఖైదుకొట్టు అయినాసరే!

మీరు రణగర్జనచేశారు. మా ఆశయాలపైని, మా ఆదర్శాలపైని ధ్వజమెత్తారు. మా పంథాను మేము విడచిపెట్టి కాంగ్రెసునే, విధేయతతో అనుసరించాలనే అభిప్రాయాన్ని మీ రిపోర్టులో వెల్లడించారు. ఏవిధంగా మీరిలా అనుకోగలిగారో మేమూహించలేకుండా వున్నాము. ఈ పరిస్థితుల్లో ఇంకా కాంగ్రెసులోనే వున్నట్లయితే మేము కమ్యూనిస్టులమనిపించుకోలేము; నిజాయితీగలవారి మనైనా అనిపించుకోలేము.

ప్రజల ఎదుట మా నిజాయితీని రుజువు చేసుకోవలసిన బాధ్యతను, మారాజకీయపంథా, దేశభక్తియుతపంథా అని నిరూపించుకోవలసిన కర్తవ్యాన్ని మీరు మాపైని పెట్టారు. మా యువక జీవితాల సర్వస్వాన్నీ వినియోగించి నిర్మించిన విప్లవకర ఉద్యమాలను మీ దాడినుండి కాపాడుకోవలసిన పనినికూడా మాకు కల్పించారు.

మీరు ప్రారంభించింది నిజంగా దండయాత్రే — మా పార్టీపైని, దాని విధానము, కార్యక్రమము, దాని భవిష్యత్తుపైనే రాజకీయ దండయాత్ర. ఆత్మరక్షణ చేసుకోడానికి, మా పంథాను సవివరంగా విశదపరచడానికి, మేము నిర్మించినవాటిని బలపరచుకోడానికి శ్రేష్ఠమైన మార్గం ఏదా అని ఆలోచించవలసి వచ్చింది. కాంగ్రెసుకీ, జాతీయోద్యమానికీ, స్వాతంత్ర్యాశయానికీ, ప్రజాశ్రేయస్సుకీ ఏమాత్రం దెబ్బ తగలకుండా, ఈ బాధ్యతలను నెరవేర్చుకోగల మార్గాన్ని వెతకవలసివచ్చింది. ఆలోచించి, ఆలోచించి, మా పార్టీ సభ్యులు కాంగ్రెసునుంచి రాజీనామా నివ్వాలనీ, నేరుగా ప్రజలవద్దకు పోయి వారి తీర్పును పొందాలనీ మా నాయకులు నిర్ణయించారు. మా తలిదండ్రులయిన ప్రజల్లోకే ఎక్కువగా చొచ్చుకుపోయి, మేము చెప్పదలచుకున్నదంతా పూర్తిగా వారితోనే చెప్పుకోవాలని నిర్ణయించారు.

కాంగ్రెసువారికీ, మాకూ మధ్య ద్వేషాలు పెరగకుండా చేయడానికి ఇదే ఉత్తమమార్గ మనిపించింది. ఆత్మగౌరవంతో వారితో మాట్లాడడానికి, వారు మా మాటలను సగౌరవంగా వినేలా చేయడానికి ఇదే పద్ధతనుకున్నాం. మమ్మల్ని గురించి మీరు చేసిన నిర్ణయం మా కెంత నచ్చకపోయినా, మేము రాజీనామానిచ్చి, ఉండవలసిందికాదని కాంగ్రెసువాదుల్లో ఎక్కువమంది అనుకొంటే అనుకోవచ్చును.

అలాంటివారందరికీ మేము చెప్పబోయేది ఇదే. మా నోటికి తాళాలువేసి, మా కాళ్ళూ చేతులూ కట్టి, ఖైదీలుగా పడవేయాలనుకుంది కాంగ్రెసు నాయకవర్గం. అలాంటి అవమానకరమైన స్థితిలో ఉండి మేము కాంగ్రెసు కేవిధంగా ఉపయోగపడగలం? స్వాతంత్ర్య సమరంలో మమ్మల్ని తమ సహచరులుగా కాంగ్రెసువారు గౌరవించాలని మేము కోరుతున్నాము. మా పార్టీ అనుసరించిన పంథా ఉత్తమోత్తమమైనదని వారు గుర్తించాలని కోరుతున్నాం. మా చిన్ని పార్టీని ధ్వంసం చేయడానికి మీరు కత్తిదూస్తే, కాంగ్రెసు - లీగు - కమ్యూనిస్టు ఐక్యత కోసం మేము శంఖం పూరించాం.

తీర్పు చెప్పవలసింది మీరుకాదు. ఎన్నటికీ కాదు! కాంగ్రెసు జనసామాన్యం, లీగు జనసామాన్యం, కమ్యూనిస్టులు—అందరూ కలిసే మాపై తీర్పుచెప్పగలరు. ఈనాటికీ, రేపటికీకాదు - స్వతంత్ర భారత దేశం స్థాపితమయేవరకూ తీర్పుచెప్పగల అధికారం వారిదే; అన్నదమ్ములమధ్య అంతఃకలహాలు రెచ్చగొట్టేమార్గం మీది. సామరస్యం కుదిర్చి, వివిధ పార్టీలమధ్య భ్రాతృభావాన్ని, ఐక్యతను పెంపొందించడానికి సాగించేకృషి మాది. భారత స్వాతంత్ర్యసిద్ధిని సత్వరం చేకూర్చగల మార్గం ఇదేనని నమ్మి, దీనిని వ్యతిరేకించే శక్తులను ప్రతిఘటించి పోరాడుతున్నాం. మాది వట్టి వాగ్యుద్ధం కాదు; విధివిరామ మెరుగని వాస్తవిక పోరాటమది. ముస్లింలీగుని, కమ్యూనిస్టుపార్టీని మీముందే

మోకరింపచేసి, మీరుచెప్పిందే వేదమని, వారు శిరసావహించేలా చేయాలని మీ ఉద్దేశం. దేశానికి శ్రేయస్కరం అని మీరేది నిర్ణయిస్తే దానినే మహాప్రసాదమని వారు స్వీకరించాలంటున్నారు.

మీ కర్తవ్యం సోదర సంస్థలపై ధ్వజమెత్తడంకాదు. దేశంలో ప్రప్రధాన స్వాతంత్ర్య సంస్థకు నాయకులు మీరు. అలాంటి మీరు తరువాత లెక్కలోకి వచ్చే స్వాతంత్ర్య సంస్థలయిన ముస్లింలీగు, కమ్యూనిస్టు పార్టీలను అర్థంచేసుకొని, వాటితో ఐకమత్యం కుదుర్చుకోవలసిన బాధ్యత మీ మీద ఉంది. వాటితో భుజం భుజం కలిపి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొని, సత్వరమే అందరికీ స్వాతంత్ర్యసిద్ధిని చేకూర్చవలసిన పవిత్ర కర్తవ్యం మీది. ఈ మీ బాధ్యతలను, మీ కర్తవ్యాన్ని మీచేత గుర్తింపజేయడానికే మేము శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం; ఇకమీదట కూడా చేస్తాం. చిత్తశుద్ధితో సోదర భావంతో, చర్చించి తీర్చుకోలేని విభేదాలు మనకేవీ లేవు. మన మూడుసంస్థల మధ్య ఐక్యత మినహా స్వాతంత్ర్య సాధనకు మరొక మార్గంలేదు. దీనిని గుర్తించి ఈ ఐక్యతా నిర్మాణానికి మూడుసంస్థలూ కలిసి వెంటనే కృషిచేయాలి.

ధర్మదేవతకు అంతా చెవులేగాని కళ్లులేవంటారు పెద్దలు, అలాంటి అంధధర్మమూర్తులుగా మీరు వ్యవహరించడం తగదు. ఆత్మగౌరవంగల మనిషితో మరొక ఆత్మగౌరవం గల మనిషి మాట్లాడేలాగా, ఒక స్వాతంత్ర్య యోధునితో మరో స్వాతంత్ర్యయోధుడు సంప్రదించే తీరున, ఒకరాజకీయ నాయకత్వం మరొక రాజకీయ నాయకత్వంతో సమాలోచనలు జరిపేవిధంగా, మీరు మాతో వ్యవహరించినపుడు మేమెంతో ఆనందిస్తాము. మీతోసంప్రదించడానికి, శక్తికొలది మీకు తోడ్పడడానికి మా పార్టీనాయకులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు.

ద్రోహం చేసిందెవరు ?

భారత జాతీయోద్యమంయొక్క నైతిక ఘనతను గుర్తించయినా మీరు మా పార్టీపట్ల ధర్మబుద్ధితో ప్రవర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

మాటల నొక ముసుగుగా ఉపయోగించవద్దు. వాటిని నిండుభావంతోనే ఉపయోగించమని ప్రార్థన. ప్రస్తుతం మీ మాటలతీరు జాతీయ రాజకీయాలనెంత అధ్వాన్నపు స్థితికి తెస్తూందో; వాటిఫలితంగా కాంగ్రెసువాదుల స్థితి ఎంత శోచనీయమవుతూందో మీరు గుర్తించాలని కోరుతున్నాం.

1942 ఆగస్టు తరువాత మేము దేశానికి ద్రోహంచేశామని మీరు ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. మీమాటలు నిజమని మీరయినా నమ్ముతున్నారా? నమ్మితే మేము కాంగ్రెసులో నాలుగణాల సభ్యులుగా ఉండవచ్చునని ఎలా తీర్మానించగలరు? మీవాదనే నిజమనుకున్నట్లయితే అలా తీర్మానించడం కాంగ్రెసును కాంగ్రెసు సభ్యుల్ని ద్రోహంచేయడం కాదా?

మీ నిర్ణయమే న్యాయమయినదయి, దానిని మేము స్వీకరించవలసి వచ్చినట్లయితే, మమ్మల్ని కాంగ్రెసులోనుంచి వెళ్లగొట్టవలసిందని మా అంతట మేమే అడిగేవాళ్ళం. కష్టపడి పనిచేసి, మీ విశ్వాసాన్ని పొంది తిరిగి కాంగ్రెసు సభ్యత్వానికి అర్హతను సంపాదించుకుంటామని మీకు వాగ్దానం చేసేవాళ్ళం, నిజమయిన కాంగ్రెసువాది ప్రవర్తించవలసిన తీరే అది.

మనదేశమే స్వతంత్ర దేశమై, అందులో ప్రభుత్వవర్గం మీరే అయి, దేశద్రోహమహాపాతకానికి మేమే నిజంగా పాల్పడినవారమయితే, "దేశమాతకడుపున చెడబుట్టాం. మమ్మల్ని కాల్చిచంపండ"ని మిమ్మల్ని ప్రార్థించేవాళ్ళం.

కాని అటువంటిదేమీ లేదు. కాంగ్రెసు మాపట్ల చాల ఉదారంగా ప్రవర్తిస్తున్నదని నెహ్రూ పండితుడంటున్నారు. (బీహార్ ఉపన్యాసం) ఏదో దయాభిక్ష పెట్టగలిగిన వారిలాగా ఇలా వేషాలువేయడం మీబోటివారికి తగదు, మేము దయాభిక్షను కోరడంలేదు. దాని నర్థించేది నేరస్థులు. ధర్మబుద్ధితో ప్రవర్తించండని మాత్రమే మేము మిమ్మల్ని కోరుతున్నాం.

1942 ఆగస్టు రోజుల్లోనూ, తదనంతరమూ, తమ ప్రవర్తనకు సంజాయిషీ చెప్పుకోవలసిందనీ, వీలయితే దానిని సమర్థించుకో వలసిందనీ. మీరు ఒక్క కమ్యూనిస్టులను మాత్రమే అడిగారెందువల్ల? ఈ ప్రశ్నకు మీఅంతరాత్మకే సమాధానం చెప్పుకోగలరా? కాంగ్రెసు వాదులకూ. మాకూ సంతృప్తికలిగేలా సమాధానం చెప్పవలసిన బాధ్యతకూడా మీ మీద వుంది.

మాకు సంబంధించిన విషయాల నన్నిటినీ చిత్తశుద్ధితో, సత్య దీక్షతో వివరించాము. అది మా విధి అని గుర్తించి అలా చేశాము. కాని ఇలాంటి సంజాయిషీలనే మీరుకాంగ్రెసు సోషలిస్టులనుండి, ఫార్వర్డు బ్లాకువారినుండి అడగలే దెందువల్ల ? 1942 ఆగస్టు అనంతరం జరిగిన ఘటనలను నిజంగా సింహావలోకనం చేయదలచుకుంటే, కాంగ్రెసులోని ప్రతి గ్రూపు చేసిన పనులను తెలుసుకోవలసిన బాధ్యత మీపైనుంది.

కాంగ్రెసు మహాసంస్థ అంతటికీ నాయకులు మీరు. అలాంటి మీరు మా పార్టీపట్ల కక్ష వహించి, కాంగ్రెసులోని ఇతర గ్రూపులపట్లా, కాంగ్రెసుకు సన్నిహితంగాఉండే ఇతరపక్షాలపట్లా పక్షపాతంవహించడం ఏంనీతి అనిపించుకుంటుందో చెప్పవలసిందని కోరుతున్నాం.

దీనికి మీరేమి జవాబు చెబుతారో మేమూహించగలం. వారు చేసిం దెలావున్నా వారి ఉద్దేశం దేశభక్తి పూరితమని మీరంటారు. ఉద్దేశాలనుబట్టేనా మీరు అంచనాలు వేస్తున్నారు. వారు చేసిన జపాను ఫాసిస్టు అనుకూలపు ప్రచారమంతా లెక్కలోకి రాదా ? (వారు ప్రచురించిన పత్రాల్లోనుంచే మేము సవివరంగా ఉదహరించాము.) వారు సాగించిన విధ్వంసక కార్యక్రమం ప్రతివారూ ఎరిగిందే. అది కాంగ్రెసు విధానం కాదు. ముమ్మాటికీ కాదని మీరే ఖండించారు. దీనిని కూడా మీరు లెక్కలోకి తీసుకోరా? దేశభక్తి పూరితాలయిన ఉద్దేశా లుండవచ్చుననే దృష్టి ఒక్క మా విషయంలోనే లోపించిం దెందువల్ల ? మామీద మీరు తయారుచేసిన రిపోర్టులో, పరోక్షంగా గాని, వందలాదిగా మీరు చేస్తున్న ఉపన్యాసాల్లో ఒక్క మాటరూపంగా గాని, మీ రా దృష్టిని కనబరచలేదే!

మీ మాట కెదురుచెప్పకుండా కాంగ్రెసువారంతా పడిఉండాలనే మీరు కోరుతున్నారని మే మనుకోవడం తప్పా ? చైనాప్రజ లందరూ తనపట్ల ఇలాంటి విధేయతనే కలిగి ఉండాలని మార్షల్ జంగ్‌కైషేక్ కలలు గన్నాడు. కాని ఆకల లేమాత్రం నెరవేరలేదు. భారత జాతీయ నాయకులుకూడా అనుసరించవలసిన మార్గమిదేనా ? మాటలకు అపార్థాలు కల్పించకుండా వాటిలోని సద్భావాలను అవగాహన చేసుకొని, చేతల్లోని సదాశయాలను గ్రహించి మన స్వాతంత్ర్యోద్యమాన్ని ఇంకా ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత మీమీద లేదా ? దేశభక్తపార్టీలన్నిటిపట్ల మీరీదృష్టి అవలంబించవలసి ఉంది. స్వాతంత్ర్యసాధనకు అదే ఉత్తమమార్గం. అందువల్లనే మిమ్మల్ని పైప్రశ్న అడుగుతున్నాం.

లోగడవారు (కాంగ్రెసు సోషలిస్టులు; ఫార్వర్డు బ్లాకువారు) చేసిన దానికి వారిపై చర్యతీసుకోవాలని మేము కోరడంలేదు. కాని, మమ్మల్ని కొన్ని ప్రశ్నలడిగినప్పుడు. వారినికూడా ప్రశ్నలడగడం మీ కనీసధర్మం. ఆ ప్రశ్నలను. వాటికి సమాధానాలను — అన్నిటినీ ప్రచురించవలసిన పని మీదికాదా ? వాటితోపాటు, 1942 లో మీరు స్వతంత్రులై ఉన్నట్లయితే మీరేవిధానం అనుసరించి ఉండేవారో తెలపాలి. 1942 ఆగస్టు తరువాత వివిధపార్టీలు చేసిన పనులను గురించి కాంగ్రెసుయొక్క సాధికార నిర్ణయాన్నికూడా ప్రకటించడం మీ ధర్మం.

మీరందరూ ఒకొక్కప్పుడు ఒకొక్కప్రదేశంలో ఒకొక్కవిధంగా మాట్లాడుతున్నారు. వర్కింగుకమిటీ సభ్యులైన మీరూ, గాంధీజీ కూడా ప్రధానసమస్యలపై. ముఖ్యఘటనలపై, ప్రముఖ వ్యక్తులపై తలొక విధంగా మాట్లాడారు.

ఈ పోకడలన్నీ, దేశాన్ని ఏ స్థితికి తీసుకుపోతాయి ? గతాన్ని సవ్యంగా అర్థచేసుకోడానికిది మార్గంకాదు. గతాన్ని అర్థంచేసుకోనిది సుఖప్రదమైన భవిష్యత్తును నిర్మించలేము. నిర్మొహమాటంగా చెప్పాలంటే, మీరుప్రజలకు రెండురకాల నీతిని బోధిస్తున్నారు మాటల్లోఒకటి

చెప్పడం, ఆచరణలో దానికి వ్యతిరేకమైనదానిని చేయడం ప్రజలకు అలవాటు చేస్తున్నారు.

ఈధోరణిలోనే మీరు యుద్ధకాలంపొడుగునా, అంచేతిలో స్వాతంత్ర్యాన్ని చూపించారు. కాని దానిని నెలకొల్పడానికి కలిగిన ప్రతిఅవకాశాన్ని చేతులార జారవిడిచారు. బ్రిటిష్‌పరిపాలనను తొలగించడానికి ఇకముందు జరుగబోయే అంతిమపోరాటాన్ని గురించికూడా ఇదేధోరణిలో మాట్లాడుతున్నారు. అలాఅంటూనే సోదరజాతీయపక్షాలపై కత్తిదూశారు. బ్రిటిష్ పెత్తనాన్ని కూలదోయడానికి ఈ వివిదజాతీయ పక్షాలఐక్యత అత్యవసరమన్న విషయాన్నయినా మీరు అంగీకరించడంలేదు. మీరు సాగిస్తున్నది భారతీయుల మధ్య అంతర్యుద్ధం; బ్రిటిష్‌సామ్రాజ్యవాదులపై పోరాటం ఎంతమాత్రంకాదు. ఈ తప్పును మీరు గుర్తించడంలేదు. చేస్తున్నదంతా ఒప్పే అని భ్రమపడుతున్నారు. అదే, దేశదౌర్భాగ్యం.

ఆత్మవిమర్శచేసుకోగల సామర్ధ్యం నశించి, రాజకీయ నాయకవర్గం ఆత్మస్తుతిలో పరవశమయిపోయే దశలోనే ఈ దౌర్భాగ్యస్థితి దాపురిస్తుంది. ఆదశలో నాయకవర్గం దివాలా తీసేస్తుంది; చూస్తుండగానే చితికి శిధిలమవనారంభిస్తుంది; తాను నిర్మించిన ఊహాసౌధాన్నికూడా తనతోపాటే శిధిలంచేసేస్తుంది; తాను నెలకొల్పిన ఉజ్వల సాంప్రదాయాలనన్నిటినీ గంగపాలు చేస్తుంది; జాతీయ నాయకవర్గంగా తన స్థానాన్ని పూర్తిగా కోల్పోతుంది. మన దేశంలోకూడా ఈ దుస్థితి సంభవించకుండా చేయాలనే మా తాపత్రయము. అందుకనే మిమ్మల్నిలా నిర్మొహమాటంగా హెచ్చరించడం.

కొత్త దశ - కొత్త విధానము

దేశభక్తి పూరితాలయిన ఉద్దేశాలకు మేమూ జోహారులర్పిస్తాము. కాని, ఆ ఉద్వేగంలోపడి కొట్టుకుపోయి, యుక్తాయుక్త విచక్షణకు నీళ్లు వదలం, ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లోనయినా బుద్ధి నుపయోగించడానికే ప్రయత్నిస్తాము. అందువల్లనే మేము కాంగ్రెసు సోషలిస్టులను, పార్వర్డు

బ్లాకువారిని ఆరంభంలోనే దేశద్రోహులనలేదు. జపానువారు మన గుమ్మంకొండికి వచ్చిన తరువాతకూడా వారు జపాను అనుకూల ప్రచారం చేస్తున్నప్పుడు, విధ్వంసక కార్యక్రమాలే ఇప్పుడు చేయవలసినిపని అని ప్రజలను ప్రోత్సహింప నారంభించినప్పుడే వారిని, స్పష్టంగా దేశద్రోహులన్నాం. తరువాత జపానువారు ఓడిపోయారు ; ప్రపంచ యుద్ధం ముగిసింది. మీరు విడుదలై వచ్చారు. ఇక జపాను సమస్య మూలబడింది. కాంగ్రెసు సోషలిస్టులకు, ఫార్వర్డుబ్లాకువారికి, మునుపటిలాగా కాంగ్రెసు తరపున మాట్లాడగల అవకాశం లేకుండాపోయింది. ఆ అధికారం ఇక మీ ఒక్కరిదే. ఇది యావత్తు ప్రపంచానికీ, మన దేశానికీ, ఒక నూతన దశ. అందువల్ల, మేము తీవ్రంగా ఆలోచించాము ; కూలంకషంగా చర్చించుకున్నాము. ఈ నూతన దశకు అనుగుణ్యమైన ఒక కొత్త పంథాను నిర్ణయించుకున్నాము.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకులపైనున్న నిషేధములను రద్దుచేయాలనీ, ఖైదులోవున్న ఆ సంస్థల సభ్యులను విడుదలచేయాలనీ మేముకోరుతున్నాం. వారుమమ్మల్నింకా దేశద్రోహులని ఆడిపోస్తున్నాసరే, భారత స్వాతంత్ర్య పోరాటంలో జగత్ప్రసిద్ధి పొందిన మా కామ్రేడ్సు విడుదలనుగురించి వారు పల్లెత్తు మాటయినా ఆడకుండా వుంటున్నాసరే లక్ష్యపెట్టక, వారి విడుదలకోసం ఆందోళనచేస్తున్నాం. వారిని విచారించవలసిన హక్కు బ్రిటిష్ పాలకులకులేదని మే మెరుగుదుము. భారత ప్రజానీకానిదే ఆ హక్కు. ఈ యుద్ధానంతర నూతన దశలో వారి పట్ల మా వైఖరిని ఇప్పుడప్పుడే నిర్వచింపము, ఈ దశలో వారి విధానమేమిటో తెలుసుకొన్నంతవరకు, వారి కార్యాచరణఎలావుంటుందోచూచే వరకు మా వైఖరిని నిర్వచింపదలచుకోలేదు. వారిపై బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కక్షను ప్రతిఘటించి, వారి విడుదలకోసం కృషిచేస్తాం. మాపై ఆ రెండు సంస్థలూ సాగించే విషప్రచారాన్నెదుర్కొని, ఆత్మరక్షణ చేసుకుంటాం.

(౮)

మా ఈ వైఖరికి నిదర్శనంగా శ్రీ సుభాసుబోసు మరణవార్తపై పి. సి. జోషీ చేసిన ప్రకటనను, అజాద్ హింద్ ఫౌజ్‌పై 'పీపుల్సువార్' సంపాదకీయాన్ని ఇందుతో జతచేసి పంపుతున్నాం. (అనుబంధం చూడండి.)

'ఏటివాలునబడిపోవా' లనే ఉద్దేశంతో మే మీ వైఖరి నవలంబించ లేదు. అవసరంవచ్చినప్పుడు ఏటి కెదురీదడానికి మే మే పరిస్థితుల్లోనూ వెనుదీయలేదు. వాలునబడిపోవలసిన పరిస్థితులేవో, ఎదురీదవలసిన విధాన మేదో, తెలుసుకోవలసిన విధి కమ్యూనిస్టులది. స్వాతంత్ర్యోద్యమ మనే విశాల వాహినిలో, ప్రజాశ్రేయస్సు అనే నావకు ప్రమాదం రాకుండా కాపాడవలసిన బాధ్యత కమ్యూనిస్టులది. అడ్డుతోవల కాశపడి, నావను సుడిగుండంలోకి దించేలాంటి దేశభక్తులను కాదు కమ్యూనిజం తరిఫీదు చేసేది. చుక్కాని భద్రంగాపట్టి, నావను జాగ్రత్తగా నడుపుతూ, సామ్య వాద గమ్యస్థానాన్ని చేర్చగల నైపుణ్యం కమ్యూనిజం ప్రసాదిస్తుంది.

చవకబారు ప్రశంసలకోసం మే మెగబడడం ఎన్నడూలేదు. ఏనా డయితే పార్టీలో చేరామో, ఆనాడే మాలో ప్రతిఒక్కరూ కూడా, తన వ్యక్తిగత రాజకీయ జీవితంలో పూలబాటను విడిచి, కంటకావృత పథాన అడుగుబెట్టాం. మాపార్టీ దేశం నలుమూలలా, ఆబాలగోపాలం యొక్క ఆదరాభిమానాలను చూరగొన్న రోజులను మే మెరుగుదుము. ఆ ఆదరాభి మానాలను పోగొట్టుకున్న రోజులుకూడా ఉన్నాయి. కాని, ఆ ప్రజాదర ణను మే మెంతోకాలం పోగొట్టుకోలేదు. పట్టుదలతో తన విధానాన్ని ప్రచారం చేయడం ద్వారా, తన సభ్యులు తమ సోదర ప్రజలమధ్య దీక్షతో సాగించే కార్యక్రమం ద్వారా, మా పార్టీ అచిరకాలంలోనే తిరిగి ప్రజాభి మానాన్ని చూరగొంటూ వచ్చింది.

మా పార్టీ వయసులో చాల చిన్నదని మే మెరుదుము. మా దేశ భక్తియొక్క నిజాయితీని పదేపదే రుజువు చేసుకోవలసిన బాధ్యత మాపై నుందని మేము గుర్తించాము. మా దృష్టిలోను, మా అనుచరుల ఎదుట కాదు. మాసోదర దేశభక్తుల దృష్టిలో, అశేషప్రజా సామాన్యం ఎదుట

రుజువు చేసుకోవలసిన కర్తవ్యం మాపైనుంది. నాయకత్వం కోసం మావంక చూచేవారికి తృప్తి కలిగేలా మా దేశభక్తిని నిరూపించుకో వలసిఉంది. మాతో ఏకీభవించకపోయినా, మా మాటలను వినడానికి ఇష్ట పడేవారినీ, మేము తప్పుచేస్తున్నామని అపోహలు పడేవారినీకూడా తృప్తి పరిచేవరకూ మా దేశభక్తి నిజాయితీని రుజువు చేసుకోవలసిన బాధ్యత మాపై నుందని మేము గుర్తించాము. మాపార్టీ తన సభ్యులకు బోధించే కర్తవ్యం ఇదే. ఇదే తాను ప్రజలలో చేయదలచుకున్న కార్యక్రమం.

బూటకాన్ని, దొంగవేషాలను మేము తీవ్రంగా అసహ్యించుకుం టాము. చిత్తశుద్ధితో నడుచుకోడానికే ఎల్లప్పుడూ కృషి చేస్తాం. ద్వంద్వార్థాలుగల మాటలు మా వాడుకలో లేవు. మా ప్రతిపక్షుల్లోనయినా సరే దేశభక్తిపూరితాలయిన ఉద్దేశాలుంటే, వాటి నభినందిస్తాము. కాని. మనసులోఉన్న ఉద్దేశాలనుబట్టి కాకుండా వారాడే మాటలనుబట్టీ చేసే చేతలనుబట్టే మేము వారిని అంచనావేస్తాము. ఈనాడు మనలో మన కెన్నయినా విభేదాలుండవచ్చును. కాని. ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే అంతిమ నిర్ణయాధికారం ప్రజలదేగాని, మనలో ఎవరిదీ కాదన్న విషయాన్ని మే మెన్నడూ మరచిపోము. మా పంథా దేశానికి శ్రేయస్కరమని ప్రజలు గుర్తించేలా చేయడానికీ, విభేదాలను తొలగించ డానికీ, మా ప్రతిపక్షుల్లో దేశభక్తులయినవారినుండి నూతన విషయాలను నేర్చుకోడానికీ మే మెల్లప్పుడూ కృషిచేస్తాం. ఏనాటికయినా జాతీయైక్య తను నెలకొల్పి, దేశభక్తులందరూ ఏకముఖంగా నిల్చొని, స్వాతంత్ర్య సాధనకు అంతిమపోరాటాన్ని సాగించి, దిగ్విజయం పొందేలా చేయ డానికే మేము దీక్షబూనాం.

రౌడీచర్యల పుట్టుపూర్వోత్తరాలు

ఈరోజుల్లో మీరెక్కడికి వెళ్ళి ఉపన్యసించినా, మమ్మల్ని 'దేశ ద్రోహు'లనడం వింటున్నాము; పత్రికల్లో చదువుతున్నాం. ఆయాప్రదేశాల కాంగ్రెసువాదుల్లో ఈ మాటల ప్రభావమెలా ఉంటుందో పరిశీలిస్తున్నాం.

కాంగ్రెసుయొక్క అహింసావిధానం బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల విషయంలోనే గాని, కమ్యూనిస్టుల విషయంలో ఎన్నటికీ కాదని డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు చేసిన ప్రకటన మాకు దిగ్భ్రమ కలిగించింది. చిత్తశుద్ధిగల దేశభక్తులందరికీ వీరి మాటలు రోత కలిగించాయి. కాని, పట్టాభిగారి ప్రకటన ఒకవిధంగా మాకు ఆశ్చర్యం కలిగించలేదు. పట్టాభిగారు బయలుదేరి ఈ 'సన్మార్గం' చూపకముందే ఆంధ్రరాష్ట్రంలోని కమ్యూనిస్టు వ్యతిరేకులు అనసాగిన మాటలను, చేయ నారంభించిన పనులను మేమిదివరకే తెలుసుకున్నాము. వీటినే ఏ. యస్. ఆర్. చారి తన 'ఆంధ్రలో కమ్యూనిస్టు వ్యతిరేకులు' అనే పుస్తంలో వివరించారు, ఇక మాపై నీచాతినీచమయిన అసత్యప్రచారాలూ, రౌడీచర్యలూ, పట్టపగ్గాలు లేకుండా సాగిస్తారని మేము గ్రహించాము. ఇదంతా కాంగ్రెసు పేరిటే సాగుతుందని మేము ముందుగానే అనుకున్నాం. '1942 పోరాటం' విషయంలో మీరవలంబించిన వైఖరి లాగానే. కాంగ్రెసు నాయకులు వీటికి బాధ్యతను వహింపనూ వహింపరు, తృణీకరించనూ తృణీకరించరని కూడా మేము గ్రహించాము.

నవంబరు (1945) మాసంలో నెహ్రూపండితుడు, వల్లభాయి పటేలూ, శరత్‌చంద్ర బోసులు వచ్చినప్పుడు బొంబాయి చౌపతీలో జరిగిన మూడు పెద్దసభలకు మేము వచ్చాము. మాపార్టీపై వీరు సాగిస్తున్న విషప్రచారం యొక్క ప్రభావాన్ని కళ్ళారా చూశాం; చెవులారా విన్నాం.

ఆ నెల పదవతేదీన నెహ్రూపండితుని ఉపన్యాసంజరిగింది. ఉపన్యాసం జరిగిన తరువాత కొంతమంది 'విద్యార్థి కాంగ్రెసు' కుర్రవాళ్లూ, కాంగ్రెసు అభిమానులూ, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ పలుకుబడికిందనున్న స్టాక్ బ్రోకర్లూ, రౌడీతనమే వృత్తిగాగల కొంతమందిఘనులూ మా పార్టీ ప్రధాన కార్యాలయంమీదికి దాడివచ్చారు. మహాత్మా గాంధీకిజై, పండిత జవహర్లాల్‌కిజై, నేతాజీ సుభాసు బోసు జిందాబాద్. కమ్యూనిస్టుపార్టీ నశించాలి, అని కేకలు వేసుకుంటూ వీరువచ్చారు. ఆ కేకలతోనే వారు సంతృప్తిపడలేదు.

కిందకి దించరా
నీయమ్మ ....
నీయక్క
నీయాలి ....

అని నానా కారుకూతలూ కూశారు. గేటువద్దనిల్చున్న మా కామ్రేడుల ముఖాలపై ఊశారు. మా కామ్రేడ్సు వారికేమీ జవాబు చెప్పలేదు. ఆగ్రహము, ఆవేదనా ఉట్టిపడుతున్న ముఖాలతో, వారిని లోపలకు రానీయకుండా తమ శరీరాలను అడ్డుపెట్టి నిల్చున్నారు. నోరువిప్పలేదు. చేయెత్తలేదు. అలాగే నిల్చున్నారు. వారి అఘాయిత్యాలను సహిస్తు-అప్పటికప్పుడే అలాంటి ఘటనలు రెండుసార్లు జరిగాయి—సర్దార్ పటేలు ఉపన్యాసం జరిగిన తరువాత ఒకసారి, శ్రీ శరత్‌బోసు ఉపన్యాసం తరువాత రెండవసారి. అది మూడవసారి అయినప్పటికీ. ఆనాడు మా కామ్రేడ్సు అంత ఓర్పుకనపరచారు.

ఆ స్థితిలోనే మరొకరుండినట్లయితే, ఆ తుంటరుల పళ్ళురాలగొట్టి, వెన్నుపగలదన్ని తగిన జవాబు చెప్పిఉండేవారు. మేముకూడా ఆ పని అతితేలికగా చేయగలిగేవారమే.

ఆ తుంటరులూ, వారిని ప్రోత్సహించిన వారూ కోరిందికూడా అదే. కాని, మే మా పని చేయలేదు. చేసివున్నట్లయితే భారతదేశంలోని పత్రికలన్నీ, పెద్ద పెద్ద శీర్షికలతో ఒక వార్తను ప్రచురించేవి. ఫలానా సభనుండి కొంతమంది, ఉత్తేజకరమైన కాంగ్రెసు నినాదాలిచ్చుకుంటూ, శాంతంగా ఊరేగుతూ పోతున్నారు — వారు భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధానకార్యాలయం ఎదుటికి వచ్చేసరికి కమ్యూనిస్టులు అమాంతంగా వారిపై దూకారు—కొంతమంది కాంగ్రెసువాదులకు దెబ్బలుతగిలాయన్న 'వార్త' అన్ని పత్రికల్లోను పడేది.

ఆనాడు మేమేగాని ఆ పని చేసినట్లయితే మా శత్రువుల కోరికలను నెరవేర్చినవారి మవుదుము. ఎప్పుడు పిడికిలి ఉపయోగించాలో,

ఎప్పుడు మానవాతీతమైన ఓర్పుననహించి ఎవ్వరూ సహింపరానివి కూడా సహించాలో మా పార్టీ మాకు బాగా బోధించింది.

ఆ ఘటన జరిగిన తరువాత, నెహ్రూగారిని కలుసుకుని, వారికి జరిగిందంతా చెప్పి, తన ఉపన్యాసానికీ ఈఘటనలకూ గల సంబంధాన్ని వారు గుర్తించేలా చేయవలసిందని మా పార్టీ ప్రధాన కార్యదర్శి పి. సి. జోషి, మోహన్ కుమారమంగళాన్ని నియోగించారు. మోహన్ కుమారమంగళం మా పార్టీనాయకుల్లోకల్లా చిన్నవారిలో ఒకడు, నెహ్రూగారితో వ్యక్తిగతంగా బాగా పరిచయమున్నవాడు.

మోహన్, నెహ్రూగారికి టెలిఫోను చేశాడు. ఎవరి ఇంటిలోనయితే నెహ్రూగారు విడిదిచేశారో, ఆ ఇంటిపెద్ద ఫోనుతీసి, నెహ్రూగారికేమాత్రం తీరికలేదని జవాబు చెప్పాడు. ఆ పైని మోహన్ జరిగినదంతా ఒక జాబుగా రాశాడు. తర్వాత ఆరోజునే ఫలానసమయానికి నెహ్రూగారిని కలుసుకోవచ్చునని మోహన్‌కి టెలిఫోను సందేశం వచ్చింది. ఆసమయానికి మోహన్ వెళ్ళి తాను రాసినజాబును నెహ్రూగారికిచ్చాడు. అది చదువుకొని నెహ్రూపండితుడు, తానావిషయమై తగు విచారణ చేయనిదే మోహన్ మాటలను నమ్మలేనని జవాబు చెప్పారు. మోహన్ వివరించిన ఘటనకూ, తన ఉపన్యాసానికీ ఎలాంటి సంబంధమూ ఉన్నట్లు తనకు కనబడడంలేదన్నారు.

ఒక కమ్యూనిస్టు నాయకుడు, తాను స్వయంగా అనుభవించిన దానిని గురించి చెప్పిన మాటలను కూడా నమ్మలేని స్థితికి వచ్చారు నెహ్రూపండితుడు!

ఆ సంభాషణ ముగిసేముందు తనకేదయినా సలహా ఇవ్వమని నెహ్రూపండితుడు మోహన్ని అడిగారు. అడిగి, తనధోరణిని తిరిగి ప్రారంభించారు. కాంగ్రెసు మాపై కక్ష సాధిస్తున్నదని మేమనుకోకూడదన్నారు. ఆ దిగులే మాలో బయలుదేరితే, మా యువకభావాలు వికసించవని హితవు చెప్పబోయారు. అది మనస్తత్వ శాస్త్రంలో సాధారణ విషయం కావచ్చు. కాని, నెహ్రూగారు మమ్మల్ని ఉద్దేశించి ఆమాటలనడం,

సర్వసాధారణ మానవ లక్షణం లోపించడమన్నమాట. గాయంచేసి, దానిపై కారం చల్లుతూ, బాధ పడుతున్నవానితో ఇదంతా నీసుఖంకోసమే సుమా అని చెప్పడంలాంటిది! అదంతా యమధర్మరాజు యొక్క ప్రత్యేకత అని పుస్తకాల్లో చదివాము. ఆపాత్ర నీనాడు నెహ్రూ పండితుడు నిర్వహించా లనుకుంటున్నారు. యముని చేతుల్లోపడ్డ పాపులుగా మమ్మల్నుండమంటున్నారు.

కాంగ్రెసు నాయకత్వంలో వెనుకటి తరంవారిలోకల్లా నెహ్రూగారే ఉత్తములని మేము భావించేవారము, ఆ సాయంత్రం జరిగినమరో సభలో ఉపన్యసిస్తూ, రౌడీచర్యలకు కాంగ్రెసు వ్యతిరేకమని వారన్నారు. కాంగ్రెసువారు చేయకూడని పనులను కొందరు చేస్తూ తన పేరును ఉచ్చరించినందుకు తన బాధను వెలిబుచ్చారు; అంతేగాని, మాపార్టీని గురించి ఒక్క మాటయినా పలకలేదు! మాపార్టీకి వ్యతిరేకంగా తాను చెప్పదలచుకున్నదంతా చెబుతారని మేమనుకున్నాం. కాని, దానితోపాటు మాపార్టీపై రౌడీచర్యలకు పూనుకో కూడదని హెచ్చరిస్తారనికూడా ఆశించాము. పదవ తేదీని జరిగిన ఘటనలను గురించి ఒక కమ్యూనిస్టు తనతో మాట్లాడాడనీ, ఒకవేళ అదేగాని నిజమయినట్లయితే, కాంగ్రెసు అనుచరుల కది తగనిపని అనీ మదలిస్తారను కున్నాం

తన సువిశాల హృదయంతో పండిట్జీ కాంగ్రెసును ప్రేమిస్తున్నారు. మా పార్టీకి మతి చెడిపోయిందను కుంటున్నారు. పోనీ, ఆదృష్టితోనైనా, పైని మే మాశించినట్లుగా పండిట్ జీ ప్రవర్తించడం వారి కనీసధర్మం. కాంగ్రెసుకు కళకం తెచ్చే చర్యలను ఖండిస్తారనుకున్నాం.

కాని, వారికి కావలసిందంతా తన నామాక్షరాలను ఉపయోగించడాన్ని ఖండించడమే. రౌడీతనాన్ని నాలుగుమాటల్లో విమర్శించి తృప్తిపడ్డారు.

'ప్రజలు' మమ్మల్ని అసహ్యించుకుంటున్నారనీ, ఆ ప్రజలందరినీ కాంగ్రెసు పట్టి నిలపలేకుండా ఉన్నదనీ, మీరు ఊహాగానం చేస్తున్నారని మీకు తెలుసు. ఇదినిజమే అని నమ్మడానికూడా మీరు ప్రయత్నిస్తున్నారు.

కాని. మేము పేర్కొన్న రౌడీదుండగాలు, మీరు విడుదలయిన తరువాతనే దేశమంతటా ప్రారంభమయాయి. ఈ మాటను నమ్మవలసిందని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాం. అంతకు పూర్వం కాంగ్రెసు సోషలిస్టులూ, ఫార్వర్డుబ్లాకువారూ మాకు వ్యతిరేకంగా ఏవేవో గుసగుస లాడేవారు: కాని. బహిరంగంగా వాటిని ప్రచారం చేయగల సాహసం ఎవరికీ లేకపోయింది. ఈనాడు మీరు సాగిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక ఉపన్యాసాలు వీరికి చక్కని అవకాశం కలిగించాయి. వీరిప్పుడు చిన్న చిన్న ముఠాలుగా బయలుదేరి. రౌడీలను వెంటబెట్టుకొని పైన పేర్కొన్నలాంటి అఘాయిత్యాలకు సాహసిస్తూన్నారు. అందంతా మా పార్టీపైని ప్రజలు ప్రదర్శిస్తున్న ఆగ్రహంగా చిత్రించ జూస్తున్నారు.

లా ఠీ వా ద ం

1942 ఆగస్టులో మేము చేసిందంతా తప్పే అని మీ నిర్ణయము. ఈ జవాబులో వివరించినవాటినే మేము చెప్పాము, చేశాము. ఎక్కడెక్కడయితే మా పార్టీ ఉందో అక్కడంతా మా ఉపన్యాసాలు, మా కార్యక్రమము సాగించాము. కాని 1942—45 మధ్యకాలంలో ఇప్పటిలాగా దేశమంతటా ఇలాంటి పీచమయిన రౌడీచర్యలు సాగలేదు. అలాంటి చర్యలు సాగించాలని కొందరి కున్నప్పటికీ తమ స్వంతబలంతో వా రా పని చేయలేకపోయారు. ఆగస్టు విప్లవాన్ని సాగించాలని కలలుగనికూడా వా రీవిధంగానే విఫలులయారు. ఈ రెండువిషయాల్లోనూ వారి ప్రయత్నాలు ఫలించకపోవడానికి కారణాలు ఒకటే. ఆనాడు వారు చేయ సాహసింపలేని ఘాతుకచర్యలను ఈనాడు చేయగలగడానికి తగినఅవకాశాలను మీ ఉపన్యాసాలే కలిగిస్తున్నాయి. అంతె.

మా పార్టీపైని ఈనాడు సాగుతూన్న ఈ రౌడీ దురాగతాలకు నైతికబాధ్యత అంతా మీది కాదేమో ఆలోచించండి.

మమ్మల్ని దేశద్రోహులని ప్రచారంచేయడం మీ వంతు. అక్కడ నుంచి మిగతా కార్యక్రమం సాగించడం మీ అనుచరులలో కొందరి

వంతు. వారుపయోగించేది లాఠీలూ, బాకులూ. ఆ ఘాతుకచర్యలను కొనసాగించగల బలమూ, సాహసాలయినా వారికి స్వంతంగా లేవు. రౌడీతనమే జీవనంగా పెట్టుకున్న ఘనులను సాయంరమ్మంటున్నారు.

మమ్మల్ని దేశద్రోహు లని మీ రంటున్నారుకదా. ఇక విషసర్పాన్ని చావగొట్టినట్లు మమ్మల్ని చావగొడితే తప్పేం? మీరే ప్రభుత్వంలో ఉంటే మమ్మల్ని ఉరితీసిఉండరూ? అని అనుకుంటున్నారు మీఅనుచరులైన ఈకాంగ్రెసువాదులు. కాని, తమదురదృష్టవశాత్తు, భారతదేశం ఇంకా బానిసగాఉంది; బ్రిటిష్‌వారింకావున్నారు; పురిత్రాడు తమ చేతికింకా అందలేదనుకుంటున్నారు. కాబట్టి ఇప్పటికి లాఠీతోనే బుద్ధి చెప్పాలని కార్యక్రమము వేసుకొన్నారు.

మమ్మల్ని దేశద్రోహులని మీ రన్నారుగా! ఇక మా తల్లులను, అక్క చెల్లెళ్ళను. భర్తలను భారత మహిళలుగా ఎందుకు గౌరవించడం? నాగరికపు ప్రవర్తన వారిపట్ల నిక నెందుకు చూపడం? అని నిర్ణయించుకున్నారు కమ్యూనిస్టు వ్యతిరేకులు. ఇక స్త్రీల విషయంలో తమకు సహజంగా వచ్చే వాక్ప్రవాహాన్ని మా పార్టీ స్త్రీలమీదుగా సాగించారు. వీరి నైతిక విలువ అంతా ఆ మాటల్లోనే బయటపడుతూంది. ఒకవేళ భారత సాంప్రదాయాలు వారి నోటికి అడ్డుతగులుతే, అలాంటి ఆటంకాలను లెక్కచేయని రౌడీలను సాయం పిలుస్తున్నారు.

ప్రపంచంలో అన్నిదేశాల్లోనూ కమ్యూనిస్టు వ్యతిరేకశక్తులు తొక్కిన మార్గమదే. మన దేశంలోకూడా వారికి మరో మార్గంలేదు. ఆ మార్గాన్నే అనుసరిస్తున్నారు.

1942 ఆగస్టు 8 తరువాత "పోరాటం" సాగిన తీరు అచ్చంగా ఇదే. పరస్పర వైరుధ్యాలతో కూడుకున్న మీ విధానంవల్ల ఈ దుష్ఫలితాలుతప్పవు. ఆ విషబీజం ఫలిస్తూంది.

రాజకీయ విధానాలమాట అటుచండి. రాజకీయ జీవితంలో పౌరహక్కులను మన్నించడం మనలో మనం సర్వసాధారణ నాగరక ప్రవ

ర్తనను పాటించడం విషయాన్ని తీసుకోండి. ఇది చిన్న విషయం ; అయినప్పటికీ దానంత ప్రధానసమస్య.

హృదయపూర్వకంగా మీకొక విజ్ఞప్తి చేస్తున్నాం. కొన్ని సంవత్సరాలుగసాగుతూ వచ్చిన కమ్యూనిస్టు వ్యతిరేక చర్యలకు విడుదలై వచ్చి మీరు అధికార ఆమోదాన్ని ప్రసాదించారు. ఈనాడు ఆ చర్యలకు, మీరే, మీస్వంత ధోరణిలో నాయకత్వం వహిస్తున్నారు.

మీరు విడుదలై వచ్చిన తరువాత, కాంగ్రెసు వాదులమని చెప్పుకుంటూ కొందరు మా పార్టీమీద సాగించిన రౌడీచర్యలను కొన్నింటిని మా పత్రికల్లో ప్రకటించాము.

ఈ ఘటనలకు సంబంధించిన రాష్ట్రాల్లో విచారణలు జరపడానికొక సబ్‌కమిటీని పెట్టండి. ఆయా రాష్ట్రానికి చెందిన ఒకకమ్యూనిస్టునాయకుడు ఆకమిటీలో తప్పకుండాఉండాలి. ఎందువల్లనంటే. ఈవాడు మీరు నిష్పాక్షికంగా విచారణ జరుపుతారనే నమ్మకం మాకు లేదు, ఆ దోషం మాది ఎంతమాత్రమూ కాదు. ఈ విధంగా విచారణజరిపి, ఆ రిపోర్టును ప్రచురించండి.

ఆ రిపోర్టును మేమే వేలకొలది ప్రతులను అచ్చువేసి పంచిపెడతాము. నిజానిజాలను ప్రజలు తెలుసుకొనేలా చేస్తాము. ఒకవేళ అందరికీ అంగీకారమైన రిపోర్టు లేకపోతే, కాంగ్రెసువారి రిపోర్టుమా. మారిపోర్టు మాకూడా వేలకొలది ప్రతులుగా అచ్చువేసి పంచిపెడతాము.

పార్టీ పత్రికలకు కావ్రేద్పు అసత్యవార్తను పంపితే శిక్ష పార్టీ నుంచి వెళ్ళగొట్టడమేఅని మీరు తెలుసుకోవాలి. అతిశయోక్తులకు, శిక్ష, బహిరంగంగా మందలించడం. ఈ నేరాలకిలాంటి శిక్షలు విధించాలని అన్ని పార్టీలూ అంటాయి. కాని వాటిని ఆచరణలో పెట్టడానికి శక్తి వంచనలేక కృషి చేసేది ఒక్క మా కమ్యూనిస్టు పార్టీయే.

మా వినతి

"కమ్యూనిస్టులు దేశద్రోహు" లంటూ పైనుంచి మీరు చేస్తున్న ప్రచారానికీ, క్రిందనుంచి సాగుతూన్న ఈ రౌడీ దురాగతాలూ, ఈ కారు

కూతలకీ గల సన్నిహిత సంబంధాన్ని గుర్తించడం కష్టమయిన పని కాదు. భారతదేశాని కీనాడు మీరు దిద్దుతూన్న రూపమిది. కళ్ళూ, చెవులూ ఉపయోగించి మీరెందుకు దీనిని గుర్తించరు ?

నెహ్రూ పండితుడు, సగర్వంగా నాయకత్వం వహించి, కమ్యూనిస్టు వ్యతిరేక వెల్లువను లేవదీశారు. ఇక అది, తాను చెప్పే హద్దుల్లోనే ఆగుతుందని ఆయన భ్రమపడడం దేనికి? వెనుక సముద్రాన్ని శాసింప దలచిన ఇంగ్లీషు ప్రభువు (కాన్యూట్) మాదిరి అవుతుంది.

"కమ్యూనిస్టులు దేశద్రోహుల"ని మీరు ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం ఎటు దారితీస్తోందో తెలుసా? కాంగ్రెసులోని అభివృద్ధి నిరోధక వర్గాలు రౌడీలను తెచ్చి ఆ మహాసంస్థలో చేర్చుతున్నారు. మాపార్టీపైని వారినొక ఆయుధంగా ఉపయోగించడానికి అవకాశం కలిగిస్తుంది, కాంగ్రెసు యువకులు మా పార్టీపై అసత్యాలను, నీచాతినీచ ప్రచారాన్ని సాగించడానికి ప్రోత్సహిస్తుంది. ఈవిధంగా ప్రజలలో మాకు స్థానం లేకుండా చేయగలమని వీరిభ్రమ.

కమ్యూనిస్టుపార్టీని దేశద్రోహకర పార్టీగా మీరు నిర్వచించడం, మాపై రౌడీ అఘాయిత్యాలకు, కారుకూతలకు లైసెన్సు ఇవ్వడం అన్న మాట. సబబో. బేసబబో, స్వాతంత్ర్యోద్యమాని కీనాడీపంథా తోడ్పడుతుందనే పొరపాటు దృక్పథం కాంగ్రెసు వాదుల్లో కలుగడానికి అవకాశమివ్వడమన్నమాట;

దేశంలో ఈ పరిస్థితులేర్పడు తున్నాయని అనుభవంమీద చెబుతున్నాము. కమ్యూనిస్టుపార్టీని గురించి మీరేమయినా అనుకోవచ్చును. కాని, మీదృక్పథాన్ని బట్టి చూచినా, కాంగ్రెసుపట్ల, దేశంపట్ల మీరు తక్షణమే నెరవేర్చవలసిన బాధ్యత ఒకటుంది. దుండగీంద్రూ, ఎదుటపడి వాదించలేని పిరికిపందలూ, ఆచరించే అత్యాచారాలు కాంగ్రెసుసంస్థకేనాటికీ చెల్లవని మీరు ఖచ్చితంగా ప్రకటించాలి. మా పార్టీని ఎదుర్కొడానికి కాంగ్రెసువాదు లీ పద్ధతుల ననుసరించకూడదని ప్రకటించాలి.

ఏమాటలనయితే నాగరకతగల భారతీయుడెవడైనా కాంగ్రెసుమీద ప్రయోగిస్తే మీరు సహించలేరో, అలాంటిమాటలు, అలాంటి అభిప్రాయాలు, కాంగ్రెసువారికి తగదని మీరు బహిరంగంగా ప్రకటించాలి. కాంగ్రెసు మహాసంస్థపట్ల, దేశంపట్ల ఇది మీ కనీసధర్మం.

నాగరక సాంప్రదాయాలు మనదేశానికి దక్కాలంటే, మహోజ్వల ప్రాచీన నాగరకత తేజస్సు మనకు విలవాలంటే చేయవలసిన కర్తవ్యం ఇది. మన మందరమూ మట్టిపాలు కాకుండా నిలచి, జీవకాంతులతో వెలుగొందాలంటే నెరవేర్చవలసిన బాధ్యత ఇది. ఇదే మీకు మా వినతి.

XV

ప్రజాస్వామ్య దృష్టితో

"కమ్యూనిస్టులు ద్రోహులు" అని మీరు సాగిస్తున్న ప్రచారం చివరకు మన జాతీయోద్యంయొక్క నైతిక ఔన్నత్యాన్నే ఎలా మంటగలుపుతుందో వివరించాం. భారత స్వాతంత్ర్యయోధులు బ్రిటిష్‌సామ్రాజ్యవాదులకన్నా నైతికంగా ఎంతో గొప్పవారని ఒకప్పుడు సగర్వంగా చెప్పుకునేవారము. ఇప్పుడో ! ఈనాడు, మంచిదా చెడ్డదా అనే ఆలోచన అక్కర్లేదు—కమ్యూనిస్టులను హతమార్చడానికి ఏపద్ధతయినాసరే పనికి వస్తుందనే స్థితికి దిగజారిపోయారు.

కాంగ్రెసుపై దెబ్బతీయడానికి కరడుగట్టిన బ్రిటిష్‌సామ్రాజ్యవాదులే పద్ధతులవలంబించారో, అపద్ధతులనే ఈనాడుకాంగ్రెసువాదులు కమ్యూనిస్టులవిషయంలో అనుసరిస్తున్నారు. అచ్చంగా అలాంటి అబద్ధాలే: అలాంటి నీచప్రచారమే; అదే రౌడీచర్యలు; పత్రికలను వుపయోగించడంలోకూడా అదే తీరు,

మా పద్ధతులు నిర్మలములు; మా ఉద్యమము ధర్మసమ్మతము. విజయంసాధిస్తామని నిస్సందేహముగ చెప్పగలము. బ్రిటిషుసామ్రాజ్యవాదుల దుష్ప్రచారాన్నెదుర్కొని కాంగ్రెసు విజయంసాధించింది. అలాగే అదే కారణాలతో. మేమూ ఈ దుష్ప్రచారాన్నెదుర్కొని విజయం

సాధిస్తాం: సందేహంలేదు. కాని, ఈలోగా దేశం ఏమవుతుంది? మన జాతీయోద్యమం తననైతికబలాన్ని పోగొట్టుకుంటే దేశం తనస్వాతంత్ర్య గమ్యస్థానాన్నెలా చేరుకోగలదు ?

బ్రిటిష్‌పాలకులు కాంగ్రెసుపట్ల అవలంబించిన పద్ధతులే మా విషయంలో కాంగ్రెసు పంథా అయిపోతూంది. ఇందుకు కారణంకూడా ఒకటే. భారతదేశాని కేది మంచిదో, ఏది చెడ్డదో నిర్ణయించగల జ్ఞానం తమ గుత్తసొమ్మని బ్రిటిష్‌వా రనుకున్నారు. ఈనాడు కాంగ్రెసువాదులూ అలాగే అనుకుంటున్నారు.

మమ్మల్ని కలతపెడుతున్న విషయం ఇంకొకటుంది. కాంగ్రెసు స్వరూపంలో ఇప్పుడు వస్తూన్న మార్పే అది. కాంగ్రెసులోనుంచి మమ్మల్ని పొమ్మంటున్నారు. లేదా ఖైదీల్లాగా, నోరుమూసుకొని పడి ఉండమంటున్నారు. అదేసమయంలో లోగడ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నమ్మిన బంటులుగా ఉండినవారిని ప్రేమతో కౌగలించుకొని కాంగ్రెసులో చేర్చుకుంటున్నారు. భారతీయ జమీందార్లకు, పెట్టుబడిదార్లకు, కాంగ్రెసు రాజకీయ నాయకవర్గానికి, కొత్తగా సన్నిహితసంబంధం ఏర్పడుతూంది.

ఈ జమీందారులూ, పెట్టుబడిదారీవర్గాలూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంటిపెట్టుకొని ఉంటే ఇక లాభంలేదని గ్రహించారు. ఎన్నికలు పూర్తికాగానే రాబోయే ప్రభుత్వం కాంగ్రెసుదే అని తెలుసుకున్నారు, కాబట్టి కాంగ్రెసుతో కలిసిఉంటేనే తమ స్వప్రయోజనాలు కొనసాగగలవని నిర్ణయించుకున్నారు. తటస్థముగాఉంటేలాభం ఉండదనీ;కాంగ్రెసుకు భిన్నంగాపోతే అసలుకే ప్రమాదంవస్తుందనీ గ్రహించినారు. ఈవిషయం 1930 రోజుల్లోనే వీరి బుద్ధికి తట్టింది. అందువల్లనే, ఈ నాడు వీరు పందెంపెట్టుకొని మరీ కాంగ్రెసులో జొరబడుతున్నారు.

భారతీయ వర్తక ప్రముఖులు, పారిశ్రామిక పెట్టుబడిదారులు తండోప తండాలుగా కాంగ్రెసు సభ్యులవుతున్నారు; దేశభక్త దుస్తులు తొడుగుతున్నారు. తమ లాభాలను పదిలపరచుకోడానికి ఈ విధంగా

జాగ్రత్తపడుతున్నారు. చేరీచేరగానే వీరు కాంగ్రెసు నాయకులను మంచి చేసుకుంటున్నారు. కాంగ్రెసుకెంతో సేవచేస్తున్నట్లు కనబడుతున్నారు. చెక్కులపైని సంతకాలు పెట్టి మీ ఇష్టంవచ్చిన సంఖ్య వేసుకొండని కాంగ్రెసు నాయకులకు ఎన్నికలనిధిగా ఇస్తున్నారు. లోగడ సాధారణ కాంగ్రెసు వాదులు ప్రజాసామాన్యంలోకి పోయి కాంగ్రెసునిధి వసూలు చేసేవారు. ఇప్పుడది అరుదయింది. ఈనాడు కాంగ్రెసు నాయకులు వర్తక, పెట్టుబడీదారీ నాయకులతో విందులారగిస్తూ, పెద్దపెద్ద చెక్కులు బరువయిన సంచులు అందుకోవడం తరుచయింది. ఈ వ్యత్యాసం తలవని తలంపుగా కలిగింది కాదు.

జాతికి చీడపురుగులుగా, సమాజంలో అంటరానివారిగా చూడదగినవారీ ధనమదాంధులు. మీ రాజకీయ సంచారాల్లో ఇలాంటివారితో విందులారగించడం మాకు పిడుగుపడి నట్లవుతూంది. ధనికులయినంత మాత్రానకాదు, వారిని దూరంగా నెట్టాలని మేమనడం; యుద్ధకాలంలో ప్రజలను కరువుకాటకాలకు బలిచేసి కోట్లకొలది ధనం రాసులు పోసుకున్న దొంగవ్యాపారులూ. తిండిదొంగలూ వీరు. అందువల్లనే వీరిని ప్రజాద్రోహులుగా చూడాలంటున్నాం.

దురాశకొద్దీ వీరు సిగ్గు బిడియాలను విసర్జించారు. సాంఘిక మర్యాదలనే మంటగలిపారు. బెంగాల్. కేరళ మొదలయిన కరువుబాధిత ప్రాంతాల ప్రజలరక్తంతో వీరు తమ దుర్దాహాన్ని తీర్చుకున్నారు; మన తల్లులకు, సోదరీమణులకు కట్టబట్ట కరువుచేసిన నీచులు వీరు. భారత గృహిణుల ఉసురుపోసుకున్న కిరాతకులు వీరు. ఈ విధంగా ప్రజలను పీడించి తమ ఖజానాలను నింపుకొనకుండా ఉన్న పెట్టుబడిదారులు బహు కొద్దిమంది మాత్రమే. మిగిలినవారి కందరికీ ప్రజల శ్రేయస్సుకన్నా తమ అధిక లాభాలే ప్రధానమయినవి. సోదరదేశీయులు ఆకలిమంటలకు అలమటించి ప్రాణాలు వదులుతూంటే. యుద్ధ కాంట్రాక్టులు సంపాదించి కోట్లు గడించిన ఘనులు వీరు.

దొంగవ్యాపారులతో పొత్తు

తిండిదొంగలను ఉరితీయాలని నెహ్రూపండితుడు ఒకసారన్నారు కాని. పత్రికల్లో నిత్యమూ చూస్తూన్న దేమిటి? ఆతిండిదొంగలనే ఆయన హృదయానికి హత్తుకొంటున్నారు. వారిని అహోరాత్రులూ ఎదుర్కొంటున్న కమ్యూనిస్టులను తరిమికొడుతున్నారు.

దీనికి మీరేమంటారో మాకు తెలుసు. భారతవర్తక, పారిశ్రామిక, ప్రముఖులు కాంగ్రెసుతో కలుస్తున్నారంటే, అది కాంగ్రెసుయొక్క బలానికి ఒక నిదర్శనం అని మీరు వాదిస్తారు. తమస్వార్థంకోసం కాంగ్రెసును ఉపయోగించడం వారితరం కాదంటారు మీరు. వారినీ, వారి ఐశ్వర్యాన్ని దేశాభివృద్ధికోసం కాంగ్రెసే ఉపయోగిస్తుందంటారు. కాని. మేళానికి డబ్బు పెట్టేవాడే ఆటనుకూడా నిర్ణయిస్తాడని మీకు తెలియదా?

ఎవరు, ఎవరిని, ఎంతచక్కగా ఉపయోగించుకుంటున్నారో నిత్యజీవితంలో కనబడుతూనే ఉంది. మీ నాయకత్వాన కాంగ్రెసు ఈనాడు ఎలా నడుచుకొంటూందో తెలుపడానికి కొన్ని విషాదకర ఉదాహరణ లిస్తాము.

విడుదలయిన కొత్తలో మీలో కొందరు తిండిదొంగలను, దొంగవ్యాపారాన్ని ఖండించారు. కాని, ఈనాడు సాగుతూన్న ఎన్నికల ప్రచారంలో ఈ ఖండన ఏ కోశాన కనబడదు. దొంగవ్యాపారాన్ని అరికట్టాలనే కార్యక్రమమే మీప్రచారంలో కనబడదు. ఇక, భారతీయ పరిశ్రమలను గురించి, వ్యవసాయాన్ని గురించి తక్షణమే మీరేమి చేయదలచుకున్నారో వేరే చెప్పనక్కరలేదు. నిరుద్యోగాన్ని అరికట్టడానికీ, ప్రజలకు తిండి గ్యారంటీ చేయడానికీ, మీరు తీసుకున్న కార్యక్రమాన్ని గురించి వేరేఅడగనక్కరలేదు. కాంగ్రెసుయొక్క ఘనతను కీర్తించడం ఇతర పార్టీలపై దుమ్మెత్తిపోయడమే మీ కార్యక్రమం. మీ అడుగుజాడల ననుసరిస్తేనే స్వరాజ్యం వస్తుంది, లేకపోతే రాదంటున్నారు. మీ దృష్టిలో మీరే కాంగ్రెసు ; కాంగ్రెసే మీరయిపోయారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ చిందరవందరయి పోయింది ; ప్రజాజీవనం విచ్ఛిన్నమయి

పోయింది. ఈ దుస్థితినిగురించి పల్లెత్తు మాటవరకంలేదు మీరు. ఈ ప్రత్యక్ష నరకం గతి మీ కక్కరలేదు; మీరు ప్రసాదించబోయే స్వర్గాన్ని గురించే మీరు వూహాగానం చేస్తున్నారు.

పారిశ్రామిక ప్రదేశాలకు మీరు ప్రచారానికి వెళ్తున్నారు. అక్కడ మీరు చేస్తున్న దేమిటి? కార్మికుల ఎదుట, పురజనుల ఎదుట, కమ్యూనిస్టులను ఆడిపోస్తున్నారు. ఆ వేదికనుండి సరాసరి మిల్లుయజమానులతో విందారగించ బోతున్నారు; యజమానులనుండి కాంగ్రెసు నిధికి పెద్దపెద్ద చెక్కులందుకొంటున్నారు. ఆ మరునాటినుంచి యజమాని తొత్తులు మిల్లుల్లో ప్రచారం ప్రారంభిస్తున్నారు।

"మీ ఉద్యోగం మీకు దక్కాలంటే కాంగ్రెసుకే ఓటివ్వండి; కమ్యూనిస్టులకు ఇవ్వవద్దు. కమ్యూనిస్టుసభలకు వెళ్ళవద్దు. వెళ్తే సేట్‌జీ మనుష్యులు మిమ్మల్ని కనిపెడతారు. మీ మంచికోరకే చెబుతున్నాం. పిల్లాజల్లా కలవారు! జాగ్రత్తగావుండడి. యుద్ధం అయిపోయిందా—మళ్ళా నిరుద్యోగం వచ్చిపడుతుంది. ఇదుగో—మీకు తెలియదూ—ఫలానా, ఫలానా నాయకులు రాత్రి సేట్‌జీతో విందారగించి వెళ్ళారు!" అని ఈ తొత్తులు కార్మికులమీద దయను వొలకపోస్తారు,

స్థానిక కాంగ్రెసువాదులుకూడా కార్మికపేటలకువెళ్ళి ఇలా అనడం ప్రారంభిస్తారు.

"ఫలానా, ఫలానా నాయకులువచ్చి చెప్పిన మాటలు మీరు విన్నారుకదా? కాంగ్రెసు కమ్యూనిస్టుపార్టీకి పూర్తిగా వ్యతిరేకమని ఇప్పటికయినా నమ్ముతారా? ఇక రాబోయేది కాంగ్రెసు ప్రభుత్వం—తెలుసా? మీ కోరికలు నెరవేరాలంటే, ఎర్రజండా సంఘాలకు వెళ్ళడం మానండి; మా కాంగ్రెసు ఆఫీసుకురాండి. మీ నాయకులపని అయిపోయింది; వారు దేశానికి ద్రోహంచేశారని మీరే విన్నారుకదా? ఇక కాంగ్రెసు నాయకులు వారి మాటలు వింటారూ?"

కంపెనీ సంఘాలకు మద్దతు

మరో విషయంకూడా స్పష్టమవుతూంది. కాంగ్రెసు నాయకులీనాడు 'హిందుస్తాన్ మజ్దూర్ సేవకసంఘ' వేదికలనుండి మాట్లాడుతున్నారు. ఈ 'హిందూస్తాన్ సేవకసంఘా'ల ఏకైక ఆశయం ఇప్పుడున్న కార్మిక సంఘాలకు పోటీ సంఘాలుగ పనిచెయ్యడమే. ఆ విధంగా కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నంచేసి యజమానులకు మేలు చేకూర్చడమే వాటి ఆశయం. యజమానులే వీటికిపోషకులు. ఒక్క అహమ్మదాబాదులో తప్ప కార్మిక జనసామాన్యం వీటిని బలపరచడం ఎక్కడాలేదు।

ఇదంతా కాంగ్రెసు మహాసంస్థను మా పార్టీకి ఒక పోటీసంస్థగా తయారుచేయడమే అవుతుంది. కార్మికులవద్దకువెళ్ళి మీరు దేశభక్తిని గురిపిస్తున్నారు. కాని, నిజానికి మీరు చేతులుకలుపుతున్నది, వారిని పీల్చి పిప్పిచేసే యజమానులతో. యజమానులద్వారా కార్మికుల వోట్లను సంపాదించాలనే ఎత్తుగడతో మీరు ఆగడంలేదు. కార్మికవర్గ ఐక్యతనే మీరు విచ్ఛిన్నం చేయడానికి పూనుకుంటున్నారు; ఎర్రజెండా సంఘాలను, దేశద్రోహకర సంస్థలని దుష్ప్రచారం చేస్తున్నారు. వాటికి పోటీగా, యజమానుల మద్దతుతో బయలుదేరిన సంఘాలను కాంగ్రెసు సంఘాలని స్తుతి చేస్తున్నారు. అంటే కాంగ్రెసుకీ కార్మిక వర్గానికీ ఇదివరకుండిన సంబంధం పూర్తిగా తలక్రిందు లయిందన్నమాట. ఈనాడు మీ రవలంబిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేకపంథా యొక్క దుష్ఫలితమే ఇది.

పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా మధ్యతరగతినీ, కార్మిక వర్గాన్నీ ఐక్యపరచడానికి బదులు, కాంగ్రెసునాయకులు కార్మికుల ఎదుటవట్టి వాగాడంబరంసాగిస్తున్నారు. ఎన్నికలవిజయం కోసం పెట్టుబడిదారుల మీద ఆధారపడుతున్నారు. కమ్యూనిస్టులనుండి కార్మికులను దూరం చేయాలనే తాపత్రయంకొద్దీ కంపెనీ సంఘాలకు కాంగ్రెసు అధికార రీత్యా మద్దతు నిస్తూంది.

ఎర్రజెండా సంఘాల్లో సంఘటితమై ఉన్న కార్మికవర్గశక్తిని విచ్ఛిన్నం చేయగలిగి కార్మికవర్గంపై కమ్యూనిస్టుపార్టీ పలుకుబడిని

కొలిగించగలుగుతే దురాశాపరులయిన పెట్టుబడిదారుల నోము పండిందన్నమాటే. కార్మికవర్గశక్తి సన్నగిలి, ఈ దొంగవ్యాపారుల బలం పెరగడమంటే పారిశ్రామిక సంక్షోభం పెచ్చుపెరగడమన్నమాట. నిరుద్యోగ పిశాచి విలయనృత్యం సాగించడమన్నమాట. కాంగ్రెసు మంత్రివర్గాలు ఆ విషమపరిస్థితుల నెలా ఎదుర్కోగలవు?

పెట్టుబడిదారులు చక్కని ప్లానువేసుకున్నారు. మొదట కాంగ్రెసుకు సహాయంచేయడం. కంట్రోలును రద్దుచేయాలనికోరే హక్కు ఆవిధంగా సంపాదించడం, బ్రిటిష్‌రాజ్యంలోకన్నా కాంగ్రెసురాజ్యంలోనే ఎక్కువ లాభాలుగుంజుకునే అవకాశంసంపాదించడం;

తరువాత, స్వాతంత్ర్యం సంపాదించిన తరువాతగాని, పారిశ్రామికాభివృద్ధి సాధ్యంకాదనిచెప్పి, తక్షణ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిఘటించడం. ఈలోగాభారతీయ పరిశ్రమలు మూలబడకుండా నిలిచివుండాలంటే కొద్దోగొప్పో నిరుద్యోగం తప్పదని వాదించడం. ఇదీవారిప్లాను,

ఈనాడు దేశంలో బయలుదేరుతూన్న నిరుద్యోగవెల్లువ నరికట్టడానికీ, ఎక్కువపనులను కల్పించడానికీ, అధికలాభాపేక్షను రూపుమాపడానికీ, అధికోత్పత్తిని సాగించడానికీ తగిన తక్షణకార్యక్రమాన్ని సూచించిన పుణ్యాన ఏ కాంగ్రెసు నాయకుడూపోలేదు.

పైపెచ్చు. ఆ దురాశాపరుల వుద్దేశాలనే నెరవేర్చగల ప్రచారాన్ని ఈ నాయకులు సాగిస్తున్నారు. వుదాహరణకి ఢిల్లీలో నవంబరు 2 వ తేదీని పండిత నెహ్రూ ఇచ్చిన వుపన్యాసం చూడండి. (హిందూస్తాన్ టైమ్సు' పత్రిక) కాంగ్రెసు మంత్రివర్గాల పరిపాలనలో కమ్యూనిస్టులు సమ్మెలను రెచ్చగొట్టగలరు సుమా అని వారు హెచ్చరించారు.

దేశంలో ఈనాడున్న ఆర్థికదుస్థితిని గమనించగల తీరిక నెహ్రూ పండితునికిలేదు, ఈనాడు సాగుతూన్న సమ్మెలు కమ్యూనిస్టులు రెచ్చగొట్టినవికావని ఆయన గుర్తించలేకుంటున్నారు.

తమ మనుగడనే కాపాడుకోవడంకోసమూ, నిరుద్యోగపిశాచికి బలికాకుండా ఆత్మరక్షణచేసుకోవడం కోసమూ కార్మికులు సాగిస్తున్న పోరాటాలే ఇవని తెలుసుకోలేకుంటున్నారు.

కాంగ్రెసు ప్రభుత్వాలేర్పడిన తరువాతకూడా నెహ్రూ పండితుడు ఈ దృక్పధంతోనే ఉన్నట్లయితే ఏమిజరుగుతుంది? కమ్యూనిస్టు సమ్మె నాయకులను అరెస్టు చేయడాన్ని, సమ్మెదారులను కాల్చి చంపడాన్ని ఆయన తప్పకుండా సమర్థిస్తాడు. అందుకు సందేహం అక్కర్లేదు.

ఆ పరిస్థితుల్లో కార్మికులేమంటారు? తమకు సంబంధించినంతవరకు బ్రిటిష్ ప్రభుత్వంకన్నా కాంగ్రెసు ప్రభుత్వం ఏమాత్రమూ మెరుగు కాదని వారు నిర్ణయించుకుంటారు. యజమానులుమాత్రం తమ విషప్రచారాన్ని యథేచ్ఛగా సాగిస్తారు. యుద్ధానంతర దశలో నిరుద్యోగం తప్పదనీ, కాంగ్రెసుపై తమకక్షను సాధించడంకోవడమే కమ్యూనిస్టులీవిధంగా ఆందోళన చేస్తున్నారనీ వారు ప్రచారంచేస్తారు.

ముందుగానే మీకు ఖచ్చితంగా చెబుతున్నాం. నిర్భయంగా తుపాకిగుండ్ల నెదుర్కోవడానికి కమ్యూనిస్టులేనాడూ వెనుకాడరు. కాని, కార్మికులందరికీ వెంటనే పని కల్పించడానికి శాసన సభల్లోని మా కమ్యూనిస్టు సభ్యులు ఆచరణయోగ్యమైన సూచనలు చేస్తారు. కాంగ్రెసు మంత్రివర్గాలు వాటి నెదుర్కోవలసి ఉంటుందని ముందుగానే చెబుతున్నాం.

జమీందార్లుకూడా చేరుతున్నారు

రైతు ఉద్యమం బలంగా ఉంది. మేము ఎన్నికల్లో పోటీచేస్తున్న గ్రామసీమల్లో అచ్చంగా ఇలాంటి పరిస్థితులేర్పడుతున్నాయి. ఇంతకన్నా అధ్వాన్న పరిస్థితులనికూడా చెప్పవచ్చు. గ్రామాల్లో ఈనాడు కమ్యూనిస్టులుగా పనిచేస్తున్నవారు కొత్తవారుకాదు. కాంగ్రెసు ఉద్యమాల్లో చురుకుగా పనిచేసి, రైతు ఉద్యమానికి నాయకత్వం వహించి. తరువాత పార్టీలోచేరినవారే వీరంతా.

ఈ కమ్యూనిస్టులు కాంగ్రెసువర్కర్లగా ఉన్నరోజుల్లో కాంగ్రెసుపై కత్తిదూసిన జమీందార్లే ఈ ఈడు కాంగ్రెసులో చేరుతున్నారు, లేదా, దాని కన్నివిధాల తోడ్పడుతున్నారు. కిసాన్‌సభలు బలపడడం అంటే రైతులను దోచుకుతినడానికీ, గ్రామాలపై నిరంకుశాధికారానికి నీళ్ళు వదులుకోవలసివస్తుందని వీరు గుర్తించారు. మా పార్టీని జయప్రదంగా ఎదుర్కోవాలంటే, కాంగ్రెసుద్వారానే సాధ్యమవుతుందని వారి అంచనా. అందువల్లవారు కాంగ్రెసుబురఖా తొడుగుతున్నారు. ఆ బురఖా కింద తమ వెనుకటి దుష్కృత్యాలనన్నిటినీకప్పి పుచ్చుకోవచ్చుననీ, భూస్వామ్యవిధానాన్ని కాపాడుకోవచ్చుననీ వారి పన్నాగం.

కమ్యూనిస్టులపై దెబ్బకొట్టడానికి కమ్యూనిస్టువ్యతిరేక కాంగ్రెసువాదులకు ధనిక భూస్వాములతో పొత్తుకుదుర్చుకోవడం తప్పమరోమార్గం దొరకడం లేదు. ఎందువల్లనంటే వారి దురదృష్టవశాత్తు వెనుకటి కాంగ్రెసువర్కర్లలో ఎక్కువమంది మా పార్టీలోకి వచ్చారు. వీరు, మా వ్యతిరేకులు జైళ్ళలోఉన్న రోజుల్లో ఆహారము, బట్ట మొదలయిన జీవితావసర సమస్యలపై అపార సేవచేసి రైతుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఇక మావ్యతిరేకులకు మిగిలింది ధనికభూస్వాములే. ఏదో ఒక విధంగా కమ్యూనిస్టుల పలుకుబడిని ముందుగా రూపుమాపుదాము; ఆ తరువాత మన కాంగ్రెసును పునర్నిర్మించుకుందాం. అని మా వ్యతిరేకుల వాదన. 'ఈ ధనిక భూస్వాములు లోగడ కాంగ్రెసుకు వ్యతిరేకంగాఉంటే ఉండవచ్చు. వీరిప్పుడువచ్చి కాంగ్రెసులో చేరుతున్నారంటే కాంగ్రెసు బలంఎంత పెరిగిందో స్పష్టమవుతుందిగదా. అనివారి సమర్ధన.

ఈవిధంగా జమీందారీవర్గాలను, వారి దుష్టబలగాలను ఉపయోగించడం ఎలాంటి నీచపరిస్థితులకు, రౌడీచర్యలకు దారితీస్తుందో వర్ణించలేము. పట్టణాల్లో మేము వివరించిన విషాదకర పరిస్థితులు వీటిముందు ఎందుకూ పనికిరావు.

మీరు సాగిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్నే కాంగ్రెసు పత్రికలు ప్రప్రధాన సూత్రంగా తీసుకున్నాయి. కమ్యూనిస్టు వ్యతిరేకత

అంటే, దేశద్రోహకరశక్తులను రూపుమాపి, నూతనవికాశం పొందుతూన్న జాతీయచైతన్యమే అని ఈ పత్రికలు నిర్వచిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెసనే ఒక మహాశక్తికీ, కమ్యూనిస్టుపార్టీ అనే ఒక కీటకానికీ మధ్య సాగుతూన్న సంకులసమరంగా వర్ణిస్తున్నాయి.

ఈ వర్ణనే నిజమయినట్లయితే ఈసరికి మేము నామరూపాలు లేకుండా హతమారిపోయి ఉండవలసింది. మీరు మార్గం చూపారు. కాంగ్రెసుపత్రికలు తమ శక్తివంచనలేక పాటుబడుతున్నాయి. మా పార్టీని గురించి కాంగ్రెసు నాయకవర్గం ఏమనుకుంటుందో ఆబాలగోపాలం ఎరుగుదురు. అయినా మేము సజీవంగానే ఉన్నాము. మా ఉద్యమం సాగిస్తూనే ఉన్నాం; దినదినాభివృద్ధి పొందుతూనే ఉన్నాం.

కాంగ్రెసు చరిత్రలో నూతన ఘట్టం

ఆధునిక ప్రపంచాన్ని అర్థం చేసుకోలేకపోవడంవల్లనే కమ్యూనిస్టు వ్యతిరేకత బయలుదేరుతుంది. మా పార్టీ పలుకుబడిని తక్కువ అంచనా వేయడం జరుగుతుంది. ఇదంతా ఎప్పుడూ వున్నదే.

కమ్యూనిస్టు వ్యతిరేకత ఈనాడు కాంగ్రెసువేదికనుండి ప్రచారమవుతూంది. ఇది కాంగ్రెసు చరిత్రలో ఒక నూతన ఘట్టం. ఇంతవరకు, కాంగ్రెసుయొక్క ప్రాతిపదికను ప్రజాస్వామిక పద్ధతులపై విస్తృతం చేయడానికే కృషి సాగుతూ వచ్చింది. ఆ దశ పూర్తి అయినట్లుంది? ఇప్పుడు కొత్తదశ ప్రారంభమయింది. ఈ దశలో, కాంగ్రెసులోని పెట్టుబడిదారీ వర్గాలు మరింత బలపడుతున్నాయి. కాంగ్రెస్ నాయకవర్గంమీద వారి పలుకుబడి పెరుగుతూంది. రాజకీయ విధానాలను నిర్ణయించడంలో వీరిప్రభావం హెచ్చుతూంది.

అధికారాన్ని హస్తగతం చేసుకోబోయే దశలో. ప్రతి దేశంలోనూ జాతీయ పరిస్థితులు ఇలాంటి సందిగ్ధావస్థలోనే పడతాయి. పెట్టుబడిదారీ వర్గాలపై నాధార పడడమా; లేక, ప్రజాశక్తులనే అండగా తీసుకొని ముందుకు సాగడమా అనే సమస్య వాటి నెదుర్కొంటుంది.

మొదటి మార్గాన్ననుసరించిన సంస్థలు తమలోని ప్రజాస్వామిక శక్తుల పైనే పోరాటం సాగించవలసినస్థితికి వస్తాయి. రెండవపంథా ననుసరించినవి ప్రజా చైతన్యాన్నింకా ఉన్నతస్థాయికి తీసుకుపోయి, ప్రజా శక్తుల నింకా ఎక్కువ సంఘటిత పరచి, అంతిమ పోరాటానికి సన్నద్ధమవుతాయి.

ప్రజాస్వామ్య వ్యతిరేకతకు మరో రూపమే కమ్యూనిస్టు వ్యతిరేకత. ఈ పంథా ప్రజల మధ్యకు పోడానికి దారితీయదు. పెట్టుబడిదారుల విష కౌగిలిలోకే దారి తీస్తుంది.

కమ్యూనిస్టులు చెమటోడ్చి నిర్మించిన కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి దురాశాపరులయిన మిల్లు యజమానులతో చేతులు కలుపుతూంది కాంగ్రెస్. ఇక దేశాభ్యుదయానికి, నూతన పరిశ్రమలను నిర్మించేదెవరు? ప్రజల అవసరాలను తీర్చేందుకు అధికోత్పత్తిని సాగించేదెవరు? జాతీయోద్యమాన్ని బుట్టలో వేసుకున్నాము కదా అని దురహంకారంతో మత్తెక్కిన పెట్టుబడిదారులా' ఈ కార్యక్రమాన్ని కొనసాగించేది?

కమ్యూనిస్టులను తుడిచిపెట్టా లనుకోవడం కార్మిక, కర్షక ఉద్యమాలను తుడిచి పెట్టడానికి తెగించడమన్న మాట. మాపైని మీరెంతగా దాడి సాగిస్తారో, అంత ఎక్కువగా మేము కార్మిక, కర్షక జన సామాన్యంలోకి చొచ్చుకుపోతాము. మునుపెన్నడూ లేనంత లోతుగా చొచ్చుకుపోతాము. శ్రమజీవుల శ్రేయస్సుకోసం మే మెంతగా పాటుపడతామో, అంత అధికంగా మా రాజకీయశక్తి బలపడుతుంది. ప్రజలే ప్రాణంగాగల మేము అజేయులము; అమరులము.

మీరు మాకేమి చేస్తారో అన్న చింత మాకులేదు. కాని, మీ కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణి ఎటు దారితీస్తుందో గమనించండి. మనదేశంలోని కార్మిక, కర్షక ఉద్యమాలపై కాంగ్రెసుచేత ధ్వజమెత్తించడానికి కాంగ్రెసు నాయకుల నిదిపురిగొల్పుతూంది. దానితో స్థానిక పెట్టుబడిదారీ వర్గాలకూ, కాంగ్రెసుకూ సంబంధాలు కుదురుతున్నాయి; నీతీ, నియమాలు లేకుండా, కార్మిక నాయకులమని ఊరేగేవారి కందరికీ కాంగ్రెసుముద్ర

వేస్తున్నారు. మీ కమ్యూనిస్టు వ్యతిరేత ఇలాంటి ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తూంది.

పత్రికల్లో లేనిపోని ప్రచారాన్ని సాగించి, పట్టణ మధ్యతరగతి ప్రజల్లో కమ్యూనిస్టు వ్యతిరేక ఆవేశం రెచ్చగొట్టడం చాల సులభమైన పని. ఇదే జరిగినట్లయితే చైతన్యవంతులైన కార్మిక, కర్షకజనసామాన్యం కాంగ్రెసును గురించి ఏమనుకుంటారో ఆలోచించండి.

మీ యీ పంథా బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులపై పోరాటానికెలా దారితీయగలదు? భారత ప్రజల్లో కొన్ని వర్గాలపైకి, అందులోనూ ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన సంఘటిత కార్మిక, కర్షక వర్గాలపై పోరాటానికే ఇది దారితీస్తూంది.

మీ కమ్యూనిస్టు వ్యతిరేకత దేశభక్తులమధ్య అంతఃకలహాలను రెచ్చగొడుతూంది; ప్రజల్లో చీలికలు కలుగచేస్తూంది. కార్మిక, కర్షక వుద్యమాలను విచ్ఛిన్నంచేసి దోపిడీవర్గాలను బలపరుస్తూంది. కమ్యూనిస్టు వ్యతిరేకత జాతి శ్రేయస్సుకే వ్యతిరేకము. అభివృద్ధి నిరోధక రాజకీయ వేత్తల, దురాశాపరులపంథా అది. మీరెంతవరకు ఆ పంథా ననుసరిస్తారో దేశానికంత తలవంపులు సంభవిస్తాయేతప్ప, ఘనత ఎన్నటికీ చేకూరదు.

XVI

సంస్కృతి దృష్టితో

మన జాతీయసంస్థల్లో తలమానికము కాంగ్రెసు. దాని నాయకులుగ అందరిమన్ననల నందుతున్నవారు మీరు. మీతో భేదించడం సంతోషకరమైన విషయం ఏమీకాదు, ఎంతో ఆవేదన కలిగించేవిషయమది. మా పార్టీ విధానం దేశశ్రేయస్కరం కాబట్టే మిమ్మల్ని ఎదిరించి నిలవగలుగుతున్నాం. మేము సేవచేస్తున్న ప్రజల సానుభూతి సహకారాలే మాకున్న బలము. అంతేకాదు.

రాజకీయనాయకులైన వీరు గ్రుడ్డిద్వేషంకొద్దీ మాపార్టీని నానా దుర్భాషలాడుతున్నారు. కాని, దేశానికి నూతన సాంస్కృతిక వికాసం చేకూర్చుతూన్న మహానుభావులు మా పార్టీతో ఏకీభావాన్ని కనబరుస్తున్నారు. మా పార్టీకృషిని కొనియాడుతున్నారు. మా పార్టీని గౌరవిస్తున్నారు. భవిష్యదభివృద్ధికి మాపార్టీయే ఆధారమని గుర్తిస్తున్నారు. మీరుమాపై విషప్రచారం సాగిస్తున్నారు; వారు మంగళాశీర్వాదాలు గురిపిస్తున్నారు.

సంస్కృతీరంగంలో అగ్రశ్రేణికిచెందినవారు మమ్మల్నిగురించి చెప్పిన మాటలను కొన్నిటిని ఉదహరిస్తాము.

'విప్లవగాయకుడు' జోష్

నేటి ఉర్దూకవులలో అగ్రగణ్యుడు జోష్ మలిహాబాదీ. చిరకాలం నుండీ ఈయన కాంగ్రెసు అభిమాని. మా పార్టీలో ఉన్న ఉర్దూకవులను, రచయితలను వీరెరుగుదురు. వారికన్నివిధాలా తోడ్పడుతుంటారు.

మా వ్యతిరేకులు మాపై ఇష్టంవచ్చిన అపవాదులన్నీ వీరి చెవిలో నూరిపోశారు. వీరు వాటినన్నిటినీ మా కామ్రేడ్సుతో చెప్పి చర్చించారు. మా రాజకీయ పంథాలను గురించిగూడా చర్చించారు. వీరినందరూ "విప్లవ గాయకుడ"ని పిలుస్తారు. మొదటినుంచీ వీరు మా పార్టీపట్ల అచంచల అభిమానం కనబరుస్తూవున్నారు. మేము వసూలుచేసిన నిధుల కన్నిటికీ విరాళాలిస్తున్నారు. దేశంలో కమ్యూనిస్టు వ్యతిరేక దాడి ప్రారంభ మయినతరువాత వీరు మా అయిదు లక్షల పార్టీనిధికి రు. 150 విరాళం పంపుతూ, ఒకజాబు, ఒక గీతము రాశారు.

"మీ నిధికి ఇదిగో నా విరాళం"

"ఈనాడు మీ పార్టీపై బహుముఖంగా దాడిసాగుతూంది. కాని, మీ ఆశయాలు, ఆదర్శాలు ఎంత ఉత్కృష్టమైనవో, ఎంత ప్రశంసాపాత్రములో, మీ వ్యతిరేకుల నైతికస్థాయి అంత నికృష్టమైనది.

"అంతిమ విజయం మీదే కాగలదనడానికి నాకేలాంటి సందేహమూ లేదు ?"

"ప్రళయ భయంకరమైన తుఫానులో
పయనించే యాత్రికులారా !
ప్రతిక్షణమూ మిమ్మల్ని హింసిస్తోంది
బాధా పరంపరల దుర్భర భారంతో —
అయినా సత్యాన్ని, నిత్య సత్యాన్ని ప్రకటిస్తున్నారు,
ఈ కుటిల ప్రపంచంలో నిర్భయంగా !
దైవ కృపవల్ల ప్రభలను చిమ్ముగాక
మీ వెలిగించిన అమరజ్యోతి ;"

హిందీ మధురకవి "సుమిత్రా నందన్"

హిందీ సాహితీ రంగంలో అగ్రగణ్యుడు సుమిత్రానందన్ పంతు. హిందీలో "ఠాకూర్ శకా"న్ని స్థాపించింది వీరే. వీరు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అంగీకరించారు. పదేళ్ళనుండి మా పార్టీ అభిమానిగా ఉంటున్నారు. ఇటీవల మా పార్టీ నిధికి విరాళం పంపుతూ ఇలారాశారు ;

" ....మీనుంచే నేను తేజంపొందుతున్నాను. నేను సౌందర్యోపాసకుడిని. ప్రజలదైనందిన జీవితంలోనే నా కా సౌందర్యం కనపడుతుంది. అందువల్లనే కమ్యూనిజం నన్నాకర్షిస్తుంది. ప్రజల శ్రేయస్సే కమ్యూనిజం. కమ్యూనిజంలోని సౌందర్యం ఆర్థిక రాజకీయ బంధాలతో కట్టుబడివుంది. ఏ మహాకవో పూనుకొని ఈబంధాలనుండి, కమ్యూనిజం సౌదర్యాన్ని విముక్తిచేసి ప్రజలకందిస్తే ఎంత బాగుంటుంది. ఆనాడా సౌందర్యాన్ని ప్రజలు తమ హృదయపేటికల్లో కలకాలం పదిలపర్చుకోగలరు. మానవుని వ్యక్తిత్వంలోని సౌందర్యాన్నిచూచి నేను ముగ్ధుణ్నయిపోతాను. నీచపరిస్థితులనుండి మానవుని ఆత్మను విముక్తపరచి, దానిని జాజ్వల్యమానంగా ప్రకాశింపజేయగలశక్తి ఒక్క కమ్యూ

— — —వి నా దృఢవిశ్వాసము. సంస్కృతిరంగంలో ఒక నూతనశక్తిగా కమ్యూనిజాన్ని నే నాహ్వానిస్తున్నాను. దానికి దిన దినాభివృద్ధిచేకూరుగాక అని ప్రార్థిస్తున్నాను. "గ్రామసీమ" "యుగ వాణి" అనే నా రచనల్లో ఈ నూతనశక్తినిగురించి కొంత ప్రస్తావించాను"

మీ

సుమిత్రానందన్ పంతు.

ఈ జాబురాస్తూ వారు వందరూపాయలు విరాళంపంపారు.

మహాకవి వల్లథోల్

బెంగాలుకి టాగూరుఎంతటివారో, కేరళరాష్ట్రానికిఅక్షరాలా అంతటి వారు మహాకవి వల్లథోల్. వీరు మొదట్లోనే సోవియటు అభిమానిఅయారు. తరువాత మా పార్టీ అభిమానిఅయారు.

ఇటీవల వీరు, తన కధాకలిదళంతో బొంబాయివచ్చారు. వీరు సోవియటు మిత్రమండలి'కి ఉపాధ్యక్షులు. ఆమండలి సమావేశంలో మాట్లాడవద్దని వీరికెన్నోవిధాల బోధించారు మావ్యతిరేకులు. కాని, ఆయనవినలేదు. ఇక సభలో గల్లంతు ప్రారంభించారు. వారిపై రాళ్లురువ్వారు. ఆమహాకవి తలవంచి తన బట్టతలను చూపిస్తూ ఇలా అన్నారు:

"నా తలమీద కొద్ది తెల్లవెంట్రుకలు మాత్రమే ఉన్నాయి. దీనిని పగలకొట్టడం బహుసులభం; మీలోమీరు కొట్లాడుకొనడం ద్వారా, నన్ను చంపడంద్వారా, స్వరాజ్యం సాధిస్తామని మీరనుకుంటే—తప్పకుండా నన్ను చంపండి."

సభికులందరూ దిగ్భ్రాంతి చెందారు. కాని మా వ్యతిరేకులకు సిగ్గు రాలేదు. గల్లంతు మానలేదు. అదీ కమ్యూనిస్టు వ్యతిరేకత స్వరూపం.

మా ఉద్యమానికి తన అభివందనాల నందజేయడానికి మహాకవి మా పార్టీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. జోషీగారితో ఇలా అన్నారు.

"కమ్యూనిస్టు వ్యతిరేకులు మా రాష్ట్రంలోనూ నా వద్దకు వస్తున్నారు. ఇక్కడా వచ్చారు. నా ధోరణిలోనే నేను వారికి సమాధానం చెబుతున్నాను. కాని, వారికి బుద్ధిలేదు. కమ్యూనిస్టులను నే నెరుగుదును; వారు మంచివారు; మంచిపనులు చేస్తున్నారు; మంచి సందేశాల నిస్తున్నారు—అలాంటివారితో తగాదా పెట్టుకొని, మీకాలాన్నెందుకు పాడుచేసుకుంటారని నేను వారిని మందలిస్తున్నాను. వారేమీ జవాబు చెప్పలేరు—వెళ్ళిపోతారు."

దుబాషీ తన మాటలను తర్జుమాచేయడం పూర్తిఅయిన తరువాత కూడా మహాకవి నవ్వుతూనే ఉన్నాడు. మహాకవి హృదయం నిర్మలము. పురాతన సాంప్రదాయాల ననుసరించే జీవితం సాగిస్తున్నారు. అచ్చమైన జాతీయవాది. వారు మంచి అని అంగీకరించినది "అధునాతనుల" మని చెప్పుకునే కమ్యూనిస్టు వ్యతిరేకులకు నచ్చలేదు. తనలాంటి వయోవృద్ధుడిని కొట్టేంతవరకు. మా పార్టీపై ద్వేషంతో పిచ్చెత్తిపోయేంతవరకు మనుషులు ఎలాగ దిగజారగలరో నిర్మలహృదయుడైన మహాకవికి, పాపం అర్థంకాలేదు.

అటు కాంగ్రెసుపట్ల, ఇటు కమ్యూనిస్టులపట్ల మహాకవికి అభిమానం ఉందని కేరళరాష్ట్రంలో అందరూ ఎరుగుదురు. కాంగ్రెసుకీ కమ్యూనిస్టుపార్టీకి ఈనాడు కలిగిన స్పర్ధలకు మహాకవి ఎంతో ఆవేదనపడుతున్నాడు. వీలు దొరికినప్పుడల్లా ఆ ఆవేదనను వెల్లడిచేస్తున్నారు.

ఇక సంస్కృతీ రంగంలో రెండవశ్రేణికి చెందిన వారిని ఎందరి నయినా ఉదహరించగలము.

దీని ప్రాధాన్యతేమిటి ?

కాని వారందరిచేత సాక్ష్యం యిప్పించడానికి మేము చవకబారు లాయర్లంకాము. వారు మొదటినుంచి కాంగ్రెసుపట్ల గాఢాభిమానం కలిగే ఉన్నారు. మా పార్టీపైకూడా అంతే అభిమానం చూపుతున్నారు. ఏ జాతీయోద్యమానికయితే మీరు నాయకత్వం వహిస్తున్నారో, ఆ జాతీ

యోద్యమాన్నే మా పార్టీ కొనసాగిస్తుందని వీరందరూ గుర్తించారు. అంతేగాని ఈనాడు మీరు ఆరోపిస్తున్నట్లు, దానికి వ్యతిరేకంగా మా పార్టీ ఏమీ చేయడంలేదని వారంటున్నారు. ఈ సహృదయులు గుర్తించిన విషయాలను మీరుకూడా గుర్తించవలసిందని మీకు మా వినతి. గుడ్డి అపోహలు మిమ్మల్ని చాల సంకుచితం చేస్తున్నాయి. నిర్మాణ పూర్వకమయిన వారి బుద్ధి నిర్మలంగా ఉంది, ఎలాంటి విషమ పరిస్థితుల్లో నయినాసరే పక్షపాతానికి లోనుగాకుండా ఉంటుంది. మీ గుడ్డిద్వేషం మమ్మల్ని అప్పుడప్పుడు నిరుత్సాహ పరుస్తుంది. అలాంటప్పుడు వీరి సానుభూతి మాకు బలాన్నిస్తుంది, మీరు చేస్తున్న పనులకు రెచ్చిపోకుండా ఉండడానికే ఎల్లప్పుడూ కృషిజేస్తాము, సంస్కృతీ రంగంలో ఉత్తమోత్తము లయిన వీరందరి సానుభూతికి అర్హులుగా ఉండడానికే పాటుపడతాం.

ఆత్మ వినాశకరమయిన మీ పంధా నెదుర్కోడానికి మేము, రాజకీయ కార్యక్రమాన్ని తీవ్రతరం చేస్తాము. మా విధానాన్ని బలపరుస్తాం, మీరు మమ్మల్ని తిరిగి కాంగ్రెసులో చేర్చుకోవడమో, లేక సోదర పార్టీగా మమ్మల్ని గుర్తించి, మాతో ఐక్యత కుదుర్చుకోవడమో జరిగే వరకూ మా కృషిని విడువము. అదేవిధంగా సాంఘిక పతనాన్ని అరికట్టడానికి ప్రజా చైతన్యాన్ని వికశింప జేయడంకోసం వైజ్ఞానిక రంగంలో విధి విరామం లేకుండా పాటుబడతాం. సాంస్కృతికంగా దేశం అధోగతిపాలు కాకుండా కృషిచేస్తాం. నిర్మాణాత్మకమైన కృషి, ఉత్తేజకరమైన సారస్వతము, వాస్తవిక రచనలు. బూటకాన్ని, అవినీతిని నిర్దాక్షిణ్యంగా తూర్పారబట్టడము ఒక్క కమ్యూనిస్టు గచయితలకు లేక కమ్యూనిస్టు సానుభూతిపరులయిన రచయితలకూ, వైజ్ఞానిక దళాలకే చేతనవునని చిత్తశుద్ధిగల వారందరూ గుర్తించేలా చేస్తాము.

మనదేశంలో "అభ్యుదయ రచయితల సంఘము "ప్రజా నాట్య మండలి" అను రెండు కొత్తఉద్యమాలు బయలుదేరడానికి మా పార్టీ ఎంతో తోడ్పడింది. ఈ రెండూ నానాటికి బలపడుతున్నాయి. ఇలాంటి మా పార్టీనీ, మన సంస్కృతీ రంగంలో అగ్రగణ్యులు అభిమానంతో

చూస్తున్నారు: బలపరుస్తున్నారు: మీ కళ్ళు తెరవడానికి ఈవిషయమే చాలు. మేము 'ఎదిరిపక్షంలో' కాక సరియయిన పక్షంలోనే, మనప్రజల పక్షంలోనే ఉన్నామనీ, సాంస్కృతికంగా కూడా భారతప్రజలను అభివృద్ధి చేయడాకి ఉచితప్రాత్రను నిర్వహిస్తున్నామనీ మీకు రుజావు చేయడానికిదేచాలు.

మీకొక విషయం జ్ఞప్తికి తేవాలనుకుంటున్నాం. భారతజాతి నూతన వికాసం మొదటినుంచీ రెండు ముఖాలుగా సాగుతూ వచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్య బానిసత్వంనుండి విముక్తి పొందడానికి జరుగుతూన్న రాజకీయోద్యమము ఒకటి. సాంస్కృతికంగా పునరుజ్జీవన ఉద్యమం ఇంకొకటి. స్వేచ్ఛా, సౌఖ్యాలతో తులతూగే నూతన భారతదేశాన్ని నిర్మించడానికి సాగుతూన్న మనజాతీయోద్యమం ఈ రెండింటి కలయికే;

ఈ రెండూ ఒకదానిపై నొకటి ఆధారపడి ఉన్నవే. ఆ విధంగానే ఇవి అభివృద్ధి పొందుతూ వచ్చాయి. ఈ రెండు ఉద్యమాల్లోనూ ఈనాడు మాపార్టీ ఒక నూతనశక్తిగా అభివృద్ధి పొందుతూంది. రాజకీయరంగంలో అగ్రగణ్యులయిన మీరు గుడ్డిఆవేశాలకు పరవశులయి మాట్లాడుతున్నారు. ఉచితానుచిత దృష్టి మీలో కనబడడం లేదు. సంఘీభావాన్ని ప్రోత్సహించడానికి బదులు అంతర్యుద్ధాన్ని రెచ్చగొడుతున్నారు మీరు. పైన మేముదహరించిన సహృదయులు సంస్కృతీ రంగంలో అగ్రగణ్యులు. ప్రేమపూరితమయిన సందేశాలనే వారినుండి వింటున్నాము. సానుభూతి సహకారాలను వెదజల్లుతున్నారు. జాతీయాశయాన్ని వారుబలపరుస్తున్నారు, సత్య, ధర్మ, స్వాతంత్ర్యాలు. మన పవిత్రమాతృభూమిలో నాలుగుపాదాల నెలకొనాలనే వారు కాంక్షిస్తున్నారు, ఒక పవిత్రాశయం కోసం సాగుతూన్న మహాసమరంలో ధర్మపక్షాన నిలచి పోరాడుతున్నామనే నమ్మకం మా శక్తిని ఇనుమడింప జేస్తూంది.

XVII

మేము దేశ ద్రోహులమా ? మాది ద్రోహమా ?

మీరు మా పాలసీపట్ల మా పార్టీపట్ల అవలంబించిన వైఖరి మా పార్టీనాయకుల్ని తీవ్రంగా ఆలోచించేటట్లు చేసింది. యెంత తీవ్రంగా లోతుగా ఆలోచించగలమో అంత తీవ్రంగానూ, లోతుగానూ మేము ఆలోచించాము. ఐతే వివిధ రూపాలలో మీ కమ్యూనిస్టు వ్యతిరేకత అంత కంతకు బహిర్గత మౌతున్నకొద్దీ, మా మార్గమే సరియైనదనీ, మీరే పొర బాటు పడుతున్నారనీ, స్పష్టమౌతూ వచ్చింది.

మమ్మల్ని మీరు ద్రోహులపార్టీ అని పిలుస్తున్నారు. భారతదేశం యొక్క ప్రజాసంస్థలన్నిటిలోను పెద్దదైన కాంగ్రెసుకు మీరు నాయకులుగా వుంటూ, మా మీద ఈలాంటి ఆరోపణలు వేయడం మా కెంతైనా బాధ కలిగిస్తోంది, వివిధ రాష్ట్రాలలో మా పార్టీ యెలావుందో క్లుప్తంగా మీ కొక సారి చిత్రిస్తాము.

వివిధ దశలలో విప్లవోద్యమాలను నడిపించినవారు

మొదట పంజాబువిషయం జ్ఞప్తికివస్తుంది. గదరుపార్టీని స్థాపించిన యోధులు పంజాబులోనే జన్మించారు. వారంతా ఇప్పుడు మా పార్టీ నాయకత్వంక్రింద పనిచేస్తున్నారు. వీరుపేదలైన రైతుకుటుంబాలలో వారు పుట్టారు. భారత విప్లవోద్యమ నిర్మాతలలో వీరే మొట్టమొదటి వారు. మీరు కాంగ్రెసులోచేరి యెన్ని సంవత్సరాలైందో, అంతకంటె ఎక్కువకాలం వారు జైళ్ళలో గడిపారు.

తరువాత గదర్ అకాలీల విషయముచూదాం: వీరు ప్రదర్శించిన ధైర్యసాహసాలు. చేసిన స్వార్థత్యాగం ప్రతిసిక్కురైతుకీ ఆదర్శంగా వున్నాయి. వారుకూడ ఈ రోజున మా పార్టీలోనే వున్నారు.

ప్రస్తుతం మా పంజాబుపార్టీ నాయకులలో సర్దారు తేజసింగు స్వతంత్ర, సర్దారు సోహన్‌సింగు జోష్‌గార్లుముఖ్యులు. వీరిని అకాలీలు 1920 ప్రాంతంలో తమ యువకనాయకులుగా పరిగణించేవారు.

తరువాత అమరజీవి భగత్‌సింగు జ్ఞప్తికిరాక మానదు, బ్రతికి వున్న అతని అనుచరులలో నలుగురు ఈరోజున జైళ్ళలో యావజ్జీవద్వీపాంతరవాస శిక్షలను భవిస్తున్నారు. వారందరు మా పార్టీలో సభ్యులుగా చేరారు.

భగవత్‌సింగు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా బెంగాల్ విప్లవోద్యమ నాయకులుకూడ జ్ఞాపకం వచ్చితీరుతారు. 1930 ప్రాంతంలో బెంగాల్ అంతటా వ్యాపించిన టెరరిస్టు వుద్యమంలో వందలకొద్దీ యువకులు పాల్గొన్నారు. వారిలో అత్యధికభాగం జైళ్ళలో వుండగానే కమ్యూనిజం స్వీకరించారు. బెంగాల్లో ఈరోజున అన్నిరాజకీయపక్షాలవారు చెప్పుకొంటూన్నది ఏమంటే, "టెరరిస్టువుద్యమంలో పాల్గొన్నయువకులలో మణిపూసల వంటివారంతా కమ్యూనిస్టుపార్టీలో చేరిపోయారు. అందువల్ల ఇప్పుడు మాకు ప్రచారకు లెవరూలేరు." ఇప్పటికీ కొంతమంది బెంగాలీ కామ్రేడ్సు జైళ్ళలో నిర్బంధింపబడి వున్నారు. వారిపేర్లు వినని బెంగాలీ కుటుంబం ఒక్కటీలేదు. వారిలో 26 గురు కలిసి మొత్తం 378 సంవత్సరాల జైలుశిక్ష అనుభవించారు. ఆరోజుల్లో జరిగిన ప్రతిటెరరిస్టు కేసుతోను వీరికి కొద్దోగొప్పో సంబంధంవుంది. (వారిజాబితా అనుబంధంతో చేర్చబడివుంది.)

ఈమధ్యనే 28 గురిని విడుదలచేశారు. వీరిలో 24 గురు మొత్తం 280 సంవత్సరాల జైలుశిక్ష అనుభవించి, విడుదలైన తక్షణమే మా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్ళారు. తాము చేయవలసిన పనినిగురించి తెలుసుకొని తిరిగివెళ్ళారు.

తరవాత కేరళరాష్ట్రం విషయం : అక్కడ మా పార్టీని రైతులు ఎంతో ప్రేమతో "కయ్యూరు కుర్రవాళ్ళపార్టీ" (ఈ నలుగురిలో హిందువులు, ముస్లింలు, సవర్ణులు, అవర్ణులు వున్నారు.) అని పిలుస్తారు,

1943 లో వీరు ఉరితీయబడ్డారు. ప్రతి రైతు కుటుంబంలోను వీరిని గురించి పాటలు. పద్యాలు అనేకం పాడుతూవుంటారు. ఏ రైతు మహాసభకు వెళుతున్నా. ఏ రాజకీయ సమావేశానికి వెళుతున్నా. ఆ పాటలు పాడుకుంటూ వెడతారు.

కె. పి. ఆర్. గోపాలన్, మరి 16 గురు యువకులు రైతు సంఘ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్షలనుభవిస్తున్నారు. వారి తలిదండ్రులు, అక్కచెల్లెండ్రు, భార్యలు పార్టీసభ్యులుగా అయివున్నారు. లేదా పార్టీని తమ స్వంత సంస్థగా భావించి, సర్వవిధాలా సహాయమైనా చేస్తున్నారు.

ఇదివరలో కేరళరాష్ట్ర కాంగ్రెసు కమిటీకి కార్యదర్శులుగా పని చేసినవారు ముగ్గురు రేపు జరగనున్న ఎన్నికలలో కమ్యూనిస్టు అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

1934 లో 3000 మంది కాంగ్రెసు వాలంటీర్లకు శిక్షణ యిచ్చిన ప్రతిభాశాలి సర్దార్ చంద్రోత్ మేన్నీ రామన్ నాయర్. ఈయన నేడు మా పార్టీలో ఒక నాయకుడుగా వున్నాడు.

ఇక బొంబాయి నగరానికి వద్దాం. మిగతా ప్రాంతాలకంటె ఇక్కడే మా వ్యతిరేకులు యెక్కువగా గొంతులు చించుకుంటారు. ఇక్కడే మాపార్టీ నాలుగు సర్వవ్యాపితమైన సమ్మెలను (1928, 1929 1934, 1940 సంవత్సరాలలో) నడిపింది. మూడు రాజకీయ సమ్మెలనుకూడా నడిపింది, (1927 సైమన్ కమీషను బహిష్కరణోద్యమం, 1938 కార్మిక హక్కుల నిరోధక చట్టాన్ని వ్యతిరేకిస్తూ చేసిన సమ్మె, 1940లో యుద్ధవ్యతిరేక సమ్మె.) యిక్కడే ప్రతికార్మిక వీధికి ఒక్కొక్క వీరగాధ వుంది. పోలీసులతోగాని, యజమానులతోగాని, రౌడీలతోగాని, కార్మికులు ధైర్యంగా పోరాడినది ఇక్కడే. అనేకమంది కార్మికులు వీరోచిత పోరాటాలలో ప్రాణాలిచ్చినది కూడా యిక్కడే. ఉదాహరణకు పరశురామ్ జాధవ్, బాబుమారుతి (మహారాష్ట్ర), పాపామియాన్ (ముస్లిం), బహిరూ చావన్, వాగ్మేర్ గారలు (అస్పృశ్యులు).

ఈ విధంగా అపూర్వమైన త్యాగాలు, అసమానమైన సాహస చర్యలు, చేసినవా రెందరో మా పార్టీలో వున్నారు. "కమ్యూనిస్టుపార్టీ—జిందాబాద్" అనే నినాదంతో ఉరిస్థంభాలను గౌగలించుకున్న వీరాధివీరులు మాలో నున్నారు. వీరంతా అన్నివర్గాలకు చెందిన వుత్తమ దేశభక్తులు. అన్ని వయస్సులవారు వీరిలో వున్నారు. తెల్లగా తళతళమెరసే గడ్డాలతో పంజాబు బాబాలు లగాయతు. నల్లని శరీరాలతో నిగనిగమెరసే కేరళరాష్ట్ర యువకుల వరకు, చిటగాంగు ఆయుధగార దోపిడీని నడిపిన అంబికా చక్రవర్తిలాంటి, భద్రలోగు యువకులు లగాయతు 26 సంవత్సరాల జైలుజీవితం గడిపిన అంబికాదా వరకూ మా పార్టీలో వున్నారు. ఈ అంబికాదా వయస్సు 55 సంవత్సరాలు. "నేను యింతకాలం రాజకీయ జీవితం గడిపేక, యెల్లాంటి పార్టీకొరకు కలలుగంటు వచ్చానో, అలాంటి పార్టీ నాకు దొరికింది" అని ఈయన అన్నాడు. పిన్నవయస్సులోనే ఒక తుపాకీగుండుకు గురియై చనిపోయిన పరశురామ్ జాధవులాంటి కార్మిక యోధులు మొదలు,బాబుమారుతి తల్లివరకు యెంతోమంది నేడు కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు. బాబుమారుతి తల్లి ఒకసారి తన గ్రామంనుంచి బొంబాయివచ్చి, ఒక కార్మిక ప్రదర్శనానికి హాజరైంది. చనిపోయిన తన కుమారుని జ్ఞప్తికి తెచ్చుకొని, ఈమె ఎర్రజెండాపట్ల మరొకసారి తన గాఢాభిమానాన్ని ప్రకటించింది. పార్టీమీద కొందరు చేసే తుచ్ఛపునిందలకు చక్కని జవాబు చెప్పింది.

ఇలా ఎందరి పేర్లయినా చెప్పవచ్చు. ఎన్ని వీరగాధలయినా జ్ఞప్తికివస్తాయి. ఐనప్పటికీ. మా పార్టీ దేశద్రోహంతో నిండియున్నసంస్థ అంటూ సిగ్గుమాలిన పచ్చిఅబద్ధ ప్రచారంచేయబడుతూంది. మనదేశంలో ఇదివరకెన్నడూ ఇంతనీచమైన ఆరోపణచేయబడలేదు. భారత విప్లవకారులలో వయోవృద్ధులైనవారు, వీరయోధులుయెందరో, నేడుమాపార్టీలో సభ్యులుగావున్నారు. మనదేశంలో బయలుదేరిన విప్లవోద్యమంలో అన్నిదశలకుచెందినవారు మా పార్టీలోవున్నారు.

దేశద్రోహమా యిది ?

1920 ప్రాంతంలో మా పార్టీ స్థాపించబడినది. అప్పటినుంచి ఇప్పటి వరకూ సంపూర్ణ స్వాతంత్ర్యమే భారతజాతీయోద్యమంయొక్క ధ్యేయంగావుండాలని యెడతెగని ఆందోళచేసింది. అప్పటికి మీలో చాలా మంది కాంగ్రెసుకు నాయకత్వంవహించారు. అప్పట్లో ప్రతి కాంగ్రెసు సమావేశంలోను "స్వరాజ్యం" అనే శబ్దాన్ని నిర్వచించడంఅసాధ్యమనీ, అనవసరమనీ, ప్రతిభారతీయునిహృదయంలోను దానిఅర్థంలిఖించబడి వున్నదని—మీరు వాదిస్తూవుండేవారు.

స్వరాజ్యం సిద్ధించేవరకూ ఆ శబ్దాన్ని నిర్వచించకుండా వదలి వేయడమే - ఈశ్వరసాన్నిధ్యం ' లభించేమాదిరిగా - వుత్తమ మార్గమని భావించబడేది. కాంగ్రెసుయొక్క ఆశయమేదో స్పష్టంగా, సందేహాలకు తావులేండా. నిర్వచించడం వదలివేసి ఆధ్యాత్మికధోరణిలో శబ్దప్రయోగాలు చేయడం జరుగుతూండేది,

ఆరోజుల్లో కాంగ్రెసునాయకుల అభిప్రాయం యెలా వుండేదంటే. బ్రిటిషువాళ్ళు ఏమి ఇవ్వదలచుకున్నారో మొదట చూదాము. పెద్దపెద్ద గొంతెమ్మకోర్కెలు కోరడంవల్ల అసలు బేరమేచెడిపోవచ్చు.

అందరూ ఇంగ్లీషువాళ్లే సభ్యులుగావున్న సైమన్‌కమీషన్ని బ్రిటిషుప్రభుత్వం మన దేశానికి పంపినప్పుడు మాత్రమే అట్టిభ్రమలు తొలగిపోయాయి. అప్పుడు కాంగ్రెసునాయకులు సంపూర్ణస్వాతంత్ర్య తీర్మానాన్ని ప్యాసు చేసేందుకు అనుమతించారు. ఐనప్పటికీ నాలుగు సంవత్సరాలు (1927 మొదలు 30 వరకు) ఇటూఅటూ వూగులాడేరు.

స్వాతంత్ర్యం లభించాక కార్మిక కర్షకుల వాంఛలు యెలా ఈడేరుతాయో విశదీకరిస్తూ, ప్రాథమిక హక్కులప్రణాళిక ఒకటి ప్రకటించడం అవసరమని అప్పట్లో మేం ఆందోళనచేశాం. అందరికంటె స్వాతంత్ర్యం ఎక్కువ అవసరమైనవారు, కష్టజీవులు. అలాంటివారికి స్వాతంత్ర్య స్వరూపం ఎలావుంటుందో తమ నిత్యజీవితంలో ఎట్టి మార్పులు

వస్తాయో, ఉదహరిస్తూ, ప్రస్తుతం పరిస్థితులతో పోల్చి చూపడం అవసరమని మేం వాదించాం.

ఆరోజుల్లో మమ్మల్ని ఎగతాళిచేసేవారు. సామ్యవాదాన్ని గురించి విదేశాలలోఅచ్చువేయబడ్డ పుస్తకాలను గుడ్డిగా వల్లించి వాటిని యిక్కడ అమలులో పెట్టజూస్తున్నామంటూ మమ్మల్ని ఆడిపోసేవారు. మేం వొట్టి కుర్రకుంకల మన్నారు, మహాత్మునికంటెకూడా మాకు ఎక్కువ తెలుసుననే అహంభావంతో మేము విర్రవీగుతున్నామని చెప్పేరు. మేం ప్రచారంచేసే అభిప్రాయాలను ఆచరణలో పెట్టదలుచుకుంటే, రష్యాకు బొమ్మని గేలిసేచేసేవారు. కాంగ్రెస్‌లో ఉంటూ అలాటి ప్రచారం చేయడం నిష్ప్రయోజనం అనేవారు. ఎందువల్లఅంటే మేం చెప్పిన కార్యక్రమం అమలులోకివస్తే జమీందారులు, పెట్టుబడిదారులు బ్రిటిష్‌వాళ్ళ పంచను చేరుతారని వాదించేవారు, అప్పటికే మీలో చాలమంది కాంగ్రెసుకు నాయకులుగా ఉండేవారు. రెండు దృక్పథాలతో మీరు మమ్మల్ని వ్యతిరేకించేవారు. మొదటిది సిద్ధాతం విషయమై. మా అభిప్రాయాలును విదేశాల నుంచి ఎరువు తెచ్చుకున్నవీ, జాతీయోద్యమానికి ప్రతిబంధకాలుగా ఉండేవీ, అని మీ వాదన! రెండది ఆచరణకు సంబంధించినది. మేం ప్రచారంచేసే అభిప్రాయాలు స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెసును బలహీన పరుస్తాయనీ, బ్రిటిష్ ప్రభుత్వాన్ని బలపరుస్తాయనీ, మీ రనేవారు.

మేం జాతీయతకు వ్యతిరేకులమని యీ రోజునకూడా మీ అభిప్రాయం. అలాంటప్పుడు, ఒకసారి వెనుకటిరోజులు జ్ఞప్తికి తెచ్చుకోవడం అవసరం. అప్పట్లో ఎవరు జాతీయతకు అనుకూలురో, ఎవరు వ్యతిరేకులో తెలుసుకొనడం మంచిది,

స్వాతంత్ర్యసమరంలో ప్రజాసామాన్యం విరివిగా పాల్గొనడానికి ప్రాథమికహక్కుల ప్రణాళిక ఒకటి అవసరమని 1931 లో మీరు గ్రహించారు. కాని 1930 ఉప్పుసత్యాగ్రహం విఫలమయినతర్వాతే మీరు కళ్ళు తెరిచారు గాని, అంతకుముందు కాదు. జనసామాన్యం విరివిగా జాతీయోద్యమంలో పాల్గొనకపోతే. ప్రభుత్వం అతి సులభంగా జాతీయో

ద్యమాన్ని అణచివేయగలదనే యదార్థం గ్రహించడానికి మీకు కొంత అనుభవం అవసరమైంది. ప్రజాసామాన్యం విరివిగా పాల్గొనని జాతీయోద్యమం. నాయకుల్ని అరెస్టుచేయడంతోనే అణిగిపోతుందనే విషయం కూడా మీరు అనుభవంమీద తెలుసుకున్నారు. కనుకనే ప్రజల్ని కాంగ్రెసులో విరివిగా సమీకరించడానికి కరాచీ కాంగ్రెసులో ప్రాథమికహక్కుల తీర్మానం చేయబడింది.

ఆ రోజుల్లో మేం అవలంబించిన విధానం ఏమిటి? ఒకపార్టీగా మేం ఆర్గనైజు అయినప్పటినుంచీ మేం కార్మికులలో ప్రవేశించి పనిచేయ నారంభించాం. "విదేశాలనుంచి దిగుమతి అయిన" భావాలు మనదేశంలో కూడా ఎలానాటుకుని మొలకెత్తగలవో ప్రదర్శించాం. మనప్రజలే వాటిని మెచ్చుకొనేలా చేయగలిగాం, ఆసియా ఖండానికంతకూ ఎక్కువ బలిష్ఠమైన ట్రేడ్‌యూనియన్ సంస్థను ఇండియాలో మేం స్థాపించాం. భారత దేశ చరిత్రలో అపూర్వమైన సమ్మె పోరాటాలను (1926–30) మేం ఆర్గనైజు చేశాం. సజీవమైన భారత కార్మికోద్యమాన్ని ఎర్రజండా క్రింద మేము నిర్మించగలిగాం. దాన్ని సామ్రాజ్యవాదులు మీరట్ కుట్రకేసు ద్వారా (1929) నాశనం చేయాలని ప్రయత్నించారు కాని, వెల్లకిలబడ్డారు.

అందరికన్న ముందు మేమే!

ఈవిధంగా 1930 జాతీయోద్యమం విఫలంకావడంవల్ల, దేశంలో ఒక క్రొత్త కార్మికోద్యమం బయలుదేరడంవల్ల కాంగ్రెసువాదులు మా భావాలను, మా కార్యక్రమాన్ని, మా విధానాన్ని శ్రద్ధతో పరిశీలించ నారంభించారు.

కాంగ్రెసు సంస్థలో అతివాద భావాలు, సోషలిస్టు అభిప్రాయాలు వ్యాపించ నారంభించాయి. అందువల్లనే గాంధీజీ 1934 లో కాంగ్రెసు నుంచి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నాడు. ఐనప్పటికీ అతివాదులపక్షం నానాటికి బలపడుతూనే వచ్చింది. వారు కాంగ్రెసు సోషలిస్టుపార్టీగా ఏర్పడ్డారు. మా పార్టీపట్ల వారు సోదరభావంతో మెలిగేవారు. కాంగ్రెసు

వాదుల మనోభావాలను అర్థంచేసుకోవడానికి తమకే యెక్కువ అర్హత వుందని వారు భావించినా, ప్రజల్ని సంఘటితపర్చడంలో మాకే ఎక్కువ అనుభవం వున్నదని వారు గ్రహించారు. సిద్ధాంత పరిశీలన విషయం లోను, ప్రధాన సమస్యలపట్ల సరియైన వైఖరిని నిర్ణయించడంలోను, పరిస్థితుల్ని సరిగా అవగాహన చేసుకోడంలోను, మాదే యెక్కువ కుశాగ్రబుద్ధి అని వారంగీకరించారు.

అతివాదశక్తుల ప్రభావం తర్వాలోనే కాంగ్రెసుమీద పడకపోలేదు. పండిత జవహరలాల్ నెహ్రూ నాయకత్వంక్రింద, అనగా ఫెయిజ్‌పూరు కాంగ్రెసు నాటినుంచి, కాంగ్రెసు పాలసీలోనే మార్పులు ప్రారంభమయాయి, వయోజన వోటింగు పద్ధతి ప్రకారం యేర్పడవలసిన ప్రజాపరిషత్తు సభ భావి భారత రాజ్యాంగాన్ని తయారుచేస్తుందని నెహ్రూగారు ఘోషించారు. దేశంయొక్క ఆర్థికవ్యవస్థకూడ ప్రజాస్వామ్య సిద్ధాంతాల కనుగుణ్యంగా ఉంటుందన్నారు. సామ్రాజ్య వ్యతిరేక సంస్థలన్నిటిమధ్య సోదర సంబంధాలు ఉంటాయని, కాంగ్రెసు ఒక విశాలమైన జాతీయైక్య సంఘటనగా పనిచేస్తుందనీ, ఆయన విశదీకరించాడు. అట్టి సంస్థ సామ్రాజ్యవాదాన్ని కూలద్రోయడంలో ప్రపంచ ప్రజాస్వామ్యశక్తులతోను. చైనా, సోవియట్ యూనియన్‌లతోనూ, చేతులు కలుపుతూ ముందంజ వేస్తుందని తేటతెల్లం జేశాడు.

నెహ్రూ ప్రచారంచేసిన యీ అభిప్రాయాలకు యితర నాయకులు కూడా అంగీకరించవలసివచ్చింది. కారణం ఏమంటే. ప్రజాసామాన్యానికి యీ అభిప్రాయాలే ఎక్కువ బాగానచ్చాయి. 1936 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసుకు అఖండ విజయం లభించడానికూడా కారణం ఇదే.

కాంగ్రెసు నాయకులలో మిగిలివున్న రాజీ పోకడలను మేము అప్పట్లో తీవ్రంగా విమర్శించినమాట నిజమే. స్వరాజ్య సంపాదనకు జనసామాన్యాన్ని సంఘటితపరచడం, చైతన్యవంతుల్నిచేయడం పోయి, నాయకులు–వర్కర్లు జైళ్ళకుపోవడమే మార్గమని తలచేవారి ఆత్మవినా

శకర పాలసీని మేం యెదుర్కొన్న విషయంకూడా నిజమే. ఇదే "జాతీయ వ్యతిరేకపంథా" అనుకుంటే, యిక జాతీయపంథా యెట్టిదో తెలుసుకోవలసిందే!

నిజంచెప్పాలంటే, మా విధానంలోనే జాతీయత యెక్కువుందనాలి. మా పార్టీ స్థాపింపబడినప్పటినుంచీ, జాతీయోద్యమం అభివృద్ధి చెందడానికి కార్యక్రమం సూచించడంలోను. దాన్ని ఆచరణలో పెట్టడానికి మార్గాలాలోచించడంలోనూ, యెప్పుడూ మేమే కాంగ్రెసు నాయకులకు ఒక అడుగు ముందు వుండేవాళ్లం.

భారత స్వాతంత్ర్య సాధనకు ఏ కార్యక్రమాన్ని కాంగ్రెసు ఆమోదిస్తూ వచ్చిందో, ఆ కార్యక్రమాన్ని ముందుగానే మాపార్టీ ప్రచారం చేస్తూ వచ్చేది. ఏదిఅవసరమని క్రమంగా కాంగ్రెసువాదులు గ్రహించారో, దాన్నే మేం మొదట ప్రచారంచేసేవారం. కష్టజీవులన్నందరినీ సంఘటిత పరచాలనీ, వారితో కాంగ్రెసు దగ్గర సంబంధం పెట్టుకోవాలనీ, వాదించినది మొదట మేము. తరవాత గుర్తించినది కాంగ్రెసు.

పదిసంవత్సరాల కాలంలో కాంగ్రెసులోనే ఉద్భవించిన మహా వెల్లువకు అంకురార్పణ చేసినదీ, దాన్ని మొదట ఆచరణలో పెట్టినదీ. మేము. తరవాత క్రమంగా అదే జాతీయ సాంప్రదాయం అయింది.

"స్వరాజ్యం" అంటే సంపూర్ణ స్వాతంత్ర్యం అని నిర్వచనం చేయడం, ప్రాథమికహక్కుల ప్రణాళికను ప్రచారం చేయడం, అనవసరమనిగాని, అలాచేస్తే కాంగ్రెసు బలహీనపడుతుందని గాని, యీ రోజున కాంగ్రెసువాదులెవరూ వాదించరు. కార్మికుల్నీ, కర్షకుల్నీ వారివారి వర్గ సంస్థలలో సంఘటితపరచడం తప్పుఅని యెవరూ చెప్పరు. ఎవరైనా అలాచెబితే, పాతకాలంనాటి చారిత్రక శిథిలాలుగా వారిని భావిస్తారు. జాతీయతకది విరుద్ధం అని ఖండిస్తారు.

జయించినదెవరు ? ఓడినదెవరు ?

ఐనప్పటికీ, కాంగ్రెసు నాయకులు మమ్మల్ని గురించి మొదటినుంచీ, — మేం శైశవావస్థలో ఉన్నప్పుడూ మేం ఒక బలమైన పార్టీగా అభివృద్ధిచెందిన తరవాతకూడ సరిగా యిట్టి ఆరోపణలనే చేస్తూ వచ్చారు. గత చరిత్రఅంతా వారి స్మృతిపథంనుంచి మాయమైపోయింది. మొదటినుంచీ ఏ అభిప్రాయాల్ని కాంగ్రెసు నాయకులు వెటకారం చేసి. తరవాత క్రమంగా ఆమోదిస్తూ వచ్చారో. ఆ అభిప్రాయాలనే మేం మొదటినుంచీ ప్రచారంచేసి కార్యరూపంలో పెట్టాం. అందుకే, మేం నానాటికీ బలపడి యీనాడు ఇంత ఉచ్చస్థితిలో ఉన్నాం. ఐనా ఆ కాంగ్రెసునాయకులే యీరోజున మావైపు తిరిగి, మేమందరం విదేశీ మానసపుత్రులమనీ. జాతీయవిద్రోహులమనీ, కాంగ్రెసుకు శత్రువులమనీ. విషప్రచారం చేస్తున్నారు.

ముఖ్యంగా యుద్ధకాలంలో మేం దేశానికి "ద్రోహం" చేశామంటున్నారు. నిజమైన జాతీయతను విడిచిపెట్టి, కొరగాని అంతర్జాతీయతను చేబట్టడం ద్వారా మేం కాంగ్రెసును వెనుకనుంచి పోటు పొడిచామంటున్నారు. ఈ విధంగా మా రాజకీయపాలసీని యదార్థ పరిస్థితులనుంచి దూరంచేసి, దానికి తప్పుడుపేర్లు పెడుతూంటే, యదార్థపరిస్థితు లొక్కసారి జ్ఞాపకం చేయడం అవసరం. అప్పుడే మా రాజకీయపాలసీ ఎట్టిదో తెలుస్తుంది. అప్పుడే దేని కెలాంటి పేరు పెట్టాలో బోధపడుతుంది.

ఇంగ్లండులో వెస్టు మినిస్టర్ చర్చి, నాజీబాంబుకు గురియైనపుడు గాంధీజీ హృదయం పరితపించి, బ్రిటన్ కోసం మన స్వాతంత్ర్య సమరాన్ని వాయిదావేయ సంకల్పించిన విషయం అందరికీ తెలిసినదే. అప్పట్లో ఎవరూ గాంధీజీని పల్లెత్తుమాట అనలేదు. కాని తరువాత మన దేశంలోనే మన పట్టణాలే జపాను బాంబులకు ఆహుతి అవుతూన్నపుడు మా హృదయాలు పరితపించి, మన దేశాన్ని మనం కాపాడుకోడానికి నడుములు బిగించడం అవసరమని వాదించినపుడు పై మహానుభావులే.

మాకు హృదయం లేదన్నారు; మా సానుభూతిఅంతా సోవియట్ రష్యా వైపునే ఉందని ఆక్షేపించారు.

బ్రిటన్ ప్రమాదంలో ఉన్నపుడు మనదేశంలో సమిష్టి శాసనోల్లంఘనం పనికిరాదన్నవారే, తరువాత భారతదేశం ప్రమాదంలో ఉన్నప్పుడు సమిష్టి శాసనోల్లంఘనం కావాలన్నారు; రెండుసార్లుకూడా వారుజాతీయ పరమావధిని చేరలేకపోయారు. ఐనా, పొరబాటు ఎక్కడుందో తరవాతనయినా గ్రహించియుంటే కొంతబాగుండేది. కాని, అలా జరగలేదు. మీదు మిక్కిలి దేశభక్తిఅంతా తమ గుత్తసొమ్ముగా ప్రకటించుకున్నారు. దేశానికి మేం ద్రోహం చేశామని దిక్కులు పిక్కటిల్లేటట్లు కేకలు వేస్తున్నారు;

ప్రజలకు సరియైన నాయకత్వం వహించడంచేతగాక, వెల్లకిలబడినప్పుడు, తోడిదేశభక్తులమీద నేరం అంతామోపి, వారిని దేశద్రోహులని పిలవడం "జాతీయత" అనిపించుకోదు.

యుద్ధకాలంలో మేమనుసరించిన పాలసీకి మేం సిగ్గుపడలేదు: గర్విస్తున్నాం, మన మాతృదేశాన్ని కాపాడ్డంకోసం, జపాన్ సామ్రాజ్యవాదుల చేతుల్లో, అదిపడకుండా రక్షించడంకోసం, మేము మా శాయశక్తుల పనిచేశాం.

జపాన్‌సేనలు మనదేశం మీద పెద్దయెత్తున దాడిచేసి స్వాధీనపరచుకోలేకపోయాయంటే, అందుకు కారణాలుయివి.

1. స్టాలిన్‌గ్రాడ్‌వద్ద ఎర్రసైన్యం ధైర్యంగా నిలబడి, హిట్లర్ సేనలను ఛిన్నాభిన్నంచేసింది. దీనిఫలితంగా, యుద్ధగతి పూర్తిగా మారిపోయింది. ఫాసిస్టురాక్షసులు ప్రపంచాన్ని తెగపంచుకోవాలనే ప్లాను యీ విధంగా తలక్రిందులైంది. అన్నిటికంటే యిది ముఖ్యమైనకారణం.

స్టాలిన్‌గ్రాడ్ విజయంవల్ల మనదేశానికి అటు పశ్చిమదిశనుంచి యిటు తూర్పునుంచి ప్రమాదం లేకుండా పోయింది.

2. రెండవ కారణం మిత్రసేనబలం. ఎన్ని ఆటంకాలున్నా మిత్రసేనలు జపాన్ సేనలకంటె శక్తివంతంగాను, మొండిగాను పోరాడ

గలిగాయి. కారణం ఏమంటే ఆలస్యం అయేకొద్దీ యితర ప్రాంతాల నుంచి రిజర్వుదళాలువచ్చి సహాయం చేయడానికి వ్యవధి లభించేది. జపాను సేనలు అలాకాదు. ఒంటిగా జర్మన్‌ల సహాయంలేకుండా యుద్ధం చేయవలసి వచ్చింది. అందువల్ల ఆలస్యం అయినకొద్దీ నష్టమేగాని లాభం కలుగలేదు.

3. మూడవ కారణం. మా పార్టీ అవలంబించిన పంథా. ఆరోజుల్లో కార్మికవర్గం విధ్వంసక చర్యలలో పాల్గొనకుండా మా పార్టీ చేయగల్గింది. యుద్ధ రంగానికి ఆయుధసామాగ్రి విరివిగా లంభించేటట్లు ఉత్పత్తిని ఎక్కువ చేయించగల్గింది. రైల్వే ట్రాన్స్‌పోర్టును కాపాడగల్గింది.

1942 - 44 సంవత్సరాల మధ్య ఇండియా సరిహద్దులలో భారతీయు లెవరైనా చైతన్యంతోను, ఉత్సాహంగాను, మాతృదేశ రక్షణకు జపాన్ ఓటమికి, సహాయంచేస్తే, వారు భారతదేశ కార్మికులేనని చెప్పాలి. వారికి నాయకత్వంయిచ్చి నడిపినది మా పార్టీయే.

మేమే స్వయంగా స్వాతంత్ర్యం సంపాదిస్తామని మే మెన్నడూ చెప్పమాలేదు; అలా మేము నమ్మనూనమ్మం. అన్ని పార్టీలుకలసి ప్రయత్నించడంవల్లనే అది సాధ్యమౌతుంది. ఈ విషయాన్నే మేం అనేక పార్లు స్పష్టంచేశాం. ఐతే మాతృదేశాన్ని రక్షించుకోడానికి మా శక్తివంతా ఒడ్డి ఒంటిగానైనా పనిచేస్తామన్నాము. ఇట్టి పాలసీవల్ల మా పార్టీ నామరూపాలులేకుండా తుడిచిపెట్టుకు పోతుందని ప్రతి కమ్యూనిస్టేతర పక్షమూ జోస్యంచెప్పింది. కాని, జరిగిందేమిటి? మేం బ్రతికేవున్నాం; నానాటికీ అభివృద్ధి చెందుతున్నాముకూడా.

ఏదేశంఅయినా ప్రమాదంలో వున్నప్పుడు, దాన్ని రక్షించుకోవడం ఆ దేశీయుల ప్రాథమిక కర్తవ్యం. అదే దేశభక్తి అనిపించుకుంటుంది. మేం చేసినదికూడా అదే. మా కర్తవ్యాన్ని మేం యెంత చక్కగా నెరవేర్చగలిగామంటే, రాజకీయంగా మేము నాశనమైపోవడం తప్పదని చెప్పినవారే, జాతీయపోరాటానికి మేం ద్రోహంచేశామంటూ ప్రచారం

ప్రారంభించారు: మానవుని ఆలోచనాశక్తి ఇంతచక్కగా బోల్తాకొట్టడం ఇక చూడబోము!

ప్రతిసమస్యను ప్రశాంతంగా ఆలోచించి, కర్తవ్యనిర్వహణకు పూనుకొనేటందుకు యెడతెగకుండా కృషిసల్పిన భారత రాజకీయ పార్టీ మాదొక్కటే. యెట్టి భ్రమకు లోనుగాకుండా, యదార్థపరిస్థితుల్ని ఉన్నవి వున్నట్టు అర్థంచేసుకొని స్వాతంత్ర్య సంపాదనకు మార్గంచూపిన పార్టీ మాదొక్కటే. యెన్ని అడ్డంకులువచ్చినా, మా కర్తవ్యాన్ని మేం సరిగా శక్తికొలది, నిర్వహించగలిగినందుకు మా సంతోషానికీ, మా సంతృప్తికీ మేరలేదు.

అసలు సమస్య - స్వయంనిర్ణయసూత్రం

నిజంగా ఈనాడు మనల్ని విడదీస్తున్న సమస్య ప్రజాయుద్ధంకాదు: మేము నిరంతరం స్వయంనిర్ణయ సూత్రంకోసం కృషిచేయడం. "ఏదో అయిపోయినయుద్ధం ప్రజాయుద్ధం అంటే అన్నారు. కాని వీళ్లు ఇప్పుడు పాకిస్తాన్ని బలపరుస్తున్నారు. ఇదెలా మరచిపోతాం?" అనుకోడం మీలో పరిపాటి అయిందిగదా! "గతాన్నిగురించి వీళ్ళవిషయంలో ఓర్పు వహించినప్పటికీ వీళ్లు యిప్పుడైనా సక్రమంగా ప్రవర్తించే ఆశ లేకపోయె! ఎన్నికల్లో లీగుకు వ్యతిరేకంగా వీళ్లు కాంగ్రెసును బలపరి_ అదొకవిధంగా వుండేది. కాని కమ్యూనిసులు అసాధ్యులు, ఆవేశపరులు! వాళ్ళనేంచేస్తాం?"

ఇదీ మీ వాదన. ఇదే మీ రిపోర్టులోకూడా స్ఫురిస్తున్నది.

ఇప్పుడుకనక మేము లీగుమీద కాంగ్రెసు సాగిస్తున్న ధర్మయుద్ధములో చేతులు కలిపితే మేము వెనుకచేసిన ద్రోహాన్ని క్షమిస్తారు,

మేము విచ్ఛిన్న కార్యక్రమంలో పాల్గొనడంద్వారా బ్రిటిషువాళ్ళతో పోట్లాడుతున్నామని ఊహించి, జపానువాళ్ళకుపని చేసిపెట్టలేదు.

మాకూ స్వతంత్ర పిపాస వుంది. కాని మా స్వాతంత్ర్యపిపాసను ముస్లింల జన్మహక్కును నిరాకరించడానికి ఉపయోగించం. ముస్లింల జన్మహక్కును నిరాకరించి, ముస్లింలీగును నాశనంచేయడంద్వారానే స్వాతంత్ర్యపోరాటం బలపడుతుందని మేము అనుకోము.

మాపార్టీనుంచి మేము నేర్చుకొన్న స్వాతంత్ర్యసూత్రాలతో నడుపబడే మా స్వాతంత్ర్య పిపాస ఎప్పుడూ తప్పుత్రోవ పట్టదు. దేశకాలాలనుబట్టి అదే స్వాతంత్ర్య కార్యక్రమంగా రూపొందుతుంది.

కాంగ్రెస్ నాయకులైన మీరు ప్రజల స్వాతంత్ర్యపిపాసను ఆధారం చేసుకొని ఎత్తులు వేస్తున్నారు; అంతకంటె లోతుకు పోవడంలేదు. కాంగ్రెస్ ఆశయాన్ని విస్పష్టపరచి, కాంగ్రెస్ కార్యక్రమాన్ని విస్తృతం చేయగల నూతన భావాలను ఎప్పటికప్పుడు మీరే ప్రతిఘటిస్తూ వచ్చారు. అలాగే ఇవాళ మేము చెప్పే స్వయంనిర్ణయసూత్రాన్నికూడా ఎదుర్కొంటున్నారు.

1942 లో ప్రజల స్వాతంత్ర్య పిపాసనుబట్టి మీరు ఆలోచన లేకుండా అడుగువేశారు. రాగల ప్రమాదాన్నిగురించి మేము హెచ్చరిస్తే మాకు మతిపోయి స్వాతంత్ర్య పోరాటానికి అడ్డుపడుతున్నామనుకున్నారు. ప్రజల స్వాతంత్ర్యపిపాస మమ్మల్ని తుడిచిపెడుతుందని కూడా మీరు నమ్మారు.

మొదటనుంచీ చివరదాకా, ఈ విషయంలో మీ అంచనాలన్నీ తప్పిపోయాయనీ, మేము చెప్పిందే, నిజమైందనీ, ఈనాడు రుజువయింది.

ఇవాళ మళ్ళీ మీరు ఆనాటి మా పాలసీకీ, కార్యక్రమానికీ అపార్థం చేసి, ప్రజల స్వాతంత్ర్య పిపాసతో చెలగాటమాడుతున్నారు.

'స్వాతంత్ర్యం' 'ద్రోహం' అనే పదాలు మాకు వ్యతిరేకంగా ఉచ్చరించినంతమాత్రానే మమ్మల్ని నాశనం చెయ్యగలమనుకుంటున్నారు. మీమీద 'విప్లవం' అనే పదం ఉపయోగించే మేమింతవాళ్ళమైనామనుకుంటున్నారు. ఇవాళ ఆ ఆయుధాన్ని మామీదికి త్రిప్పితే సరిపోతుందని మీ ఉద్దేశం!

అనుకున్నపద్ధతులద్వారా స్వాతంత్ర్యం సంపాదించడమనేది అప్పటి కర్తవ్యం. విజయం తథ్యమనుకున్నారు మీరు. అపజయం

తప్పదని మేము ముందుగానే గ్రహించాం. కాని ఇవాళమీరే ఎదురు తిప్పి మమ్మల్ని సంజాయిషీ ఇవ్వమని అడుగుతున్నారు.

స్వాతంత్ర్యం, విప్లవం అనే పదాలను మాకు ఎదురుతిప్పినట్లు గానే, మీరు లీగుయొక్క 'ఇస్లాము' నూ 'మతా'న్నీ లీగుకు ఎదురు తిప్పి, లీగునుకూడా సవాలు చేస్తున్నారు.

జిన్నా ఇదివరకే పాకిస్థాన్ అంటే ప్రజాస్వామ్యమన్నాడుకనుక ఇవాళ ముస్లింముల్లా, ఇస్లాంరాజ్యం కాదని పాకిస్థానును నిందిస్తున్నారు. ఇంగ్లీషు చదువుకున్న జాతీయముస్లింలు, లీగు నాయకుల వివాహవ్యవహారాలను పరిశోధిస్తున్నారు; మధ్యయుగాలనాటి ఇస్లాంన్యాయశాస్త్రానికి భిన్నంగా, అభివృద్ధికరశాసనాలను లీగునాయకులు ఎన్నిపర్యాయాలు బలపరిచారోనని అసెంబ్లీరికార్డులు వెతుకుతున్నారు. స్థానికంగా వుండే మౌల్వీలను పోగుచేసి, లీగు నాయకుల్లో ఎంతమందికి గడ్డాలులేందీ, ఎవరెవరు ఎన్నిసార్లు మసీదుకు హాజరయిందీ లిస్టు వ్రాయిస్తున్నారు.

అందరికీ స్వాతంత్ర్యసూత్రాలను అన్వయించండి

- ఇలాంటివెప్పుడూ మనసూత్రాలుకావు, మన మార్గాలుకావు. ముందుకూడా కాబోవు. మేధావులను, వీరులను వదిలేసి బానిసలకోసం వెతుక్కునేవాళ్ళు తమ మాటవినని వారంతా ఎవరియేజంట్లో అని అంటారు. 1942 లో మేము బ్రిటిష్ ఏజంట్ల మన్నారు; 1945 లో లీగు ఏజంట్లమన్నారు.

లీగు ఏజంట్లని పేరుపెట్టి, మమ్మల్ని ఎదుర్కోగలిస్తే, ఇందుకు కాంగ్రెసుప్రజలు సంతోషించరు. హిందూ ముస్లిం ఐక్యత కావాలని ప్రజలు వాంఛిస్తున్నారు. కాంగ్రెస్ లీగులు ఏకంకావాలనేది దేశద్రోహమని చెప్పడం సులభంకాదు.

కాని, బ్రిటిష్ ఏజెంట్లనడం చాలా తేలిక. 'విప్లవం' 'విప్లవం' అని పొలికేకలు వేసే వీళ్ల నిజంగా విప్లవం వచ్చినప్పుడు చేతులు ముడుచుకు కూర్చున్నారని చెప్పడం బహుసులభం; ఈమాట ఒక్కసారి ఉచ్చ

రిస్తే చాలు—బ్రిటిష్ వ్యతిరేకతతో నిప్పులు గ్రక్కుతున్న ప్రజలు అమాంతం మమ్మల్ని దేశద్రోహులుగా పరిగణిస్తారని మీ ఉద్దేశం.

ఈస్వాతంత్ర్య ప్రియులైన కాంగ్రెస్ ప్రజల స్వాతంత్ర్య పిపాసను ఈవిధంగా రెచ్చగొట్టి, మాపార్టీకి, మాపాలిసీకి వ్యతిరేకంగా త్రిప్పాలని మీ ఊహ.

ఇవాళ మీ కాంగ్రెస్ నాయకులంతా మీ ఉపన్యాసాల్లో మమ్మల్ని తిట్టేదానికి ఇంతకంటె అర్థంలేదు. మీ ఉపన్యాసాలు మేమే స్వయంగా విన్నాం. కాంగ్రెసు పత్రికల్లో చదివాం.

మేము మాత్రం ప్రజల స్వాతంత్ర్య పిపాసను చాలా పవిత్రంగా భావిస్తాం. మా లాగానే మా విమర్శకులు, మా వ్యతిరేకులు కూడా స్వాతంత్ర్య పిపాసతోనే పనిచేస్తున్నారనీ, ఉన్నభేదమల్లా ఏపద్ధతులమీద, ఏకార్యక్రమంతో, పనిచేయాలి - అనేచోట ఉన్నదని నమ్ముతాం. ఆ విషయాలే తీవ్రంగాచర్చిస్తాం. మనప్రజలు స్వాతంత్ర్య పిపాసను స్వాతంత్ర్య కార్యక్రమంగా మార్చడానికీ, స్వాతంత్ర్యాన్ని సాధించడంలో బలవత్తరమయిన మార్గాలను అన్వేషించడానికీ మేము తీవ్ర కృషిచేస్తాం.

ఈ స్వాతంత్ర్య సూత్రాల దృష్టిలో మేము స్వయం నిర్ణయ సూత్రాన్ని బలపరుస్తున్నాం. జాతీయోద్యమంలో అంతిమపోరాటంకోసం బ్రిటిష్ ప్రభుత్వంమీద విజయంకోసం ఈ సూత్రాన్ని భారత జాతీయోద్యమంలో చేర్చుకోవాలంటున్నాం.

స్వాసంత్ర సూత్రాలదృష్టిలో స్వయంనిర్ణయ సూత్రాన్ని ఎలా కాదంటారు? బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యంకోరే దాంట్లోనేవుంది స్వయంనిర్ణయసూత్రం.

అదేసూత్రాన్ని మనలో మనం అన్వయించుకోడాన్ని ఎలా నిరాకరిస్తాం? బ్రిటిష్ ప్రజలంతా తమ పరిపాలకులకు వ్యతిరేకంగా మన స్వాతంత్ర్యవాంఛను బలపరచాలని కోరుతాం.

అలాంటప్పుడు ఆదేసూత్రాన్ని ముందుమనలోమనం అన్వయించు కుందామని కొన్నివర్గాలు చెప్పినప్పుడు దాన్ని వ్యతిరేకించడానికి ఆధారం ఏమిటి ?

బ్రిటిష్‌వాళ్ళను 'ఇండియానుంచి వైదొలగండి' అని చెప్పే సమయం వచ్చిందంటే. మనం స్వాతంత్ర్యం సంపాదించే ఆ భవిష్యద్భారత దేశ స్వరూపం నిర్వచించవలసిన సమయంకూడా వచ్చింది. బ్రిటిష్‌వాళ్ళ మీద ఇది ఒకభావన మాత్రమే. కాని, మనలోమనవిషయం వచ్చినప్పుడు ఇదివాస్తవం కావాలి. లేకపోతే అపోహలకు తగాదాలకు ఇంకా ఎన్నింటికో తప్పనిసరిగా దారితీస్తుంది. సూటిగా చెప్పాలంటే ఇదీ నేటిసమస్య.

బ్రిటిషువాళ్ళకు వ్యతిరేకంగా మనమంతా ఒకటే. అందుకనే మొదట్లో తన ఆశయం ఏమైనప్పటికీ ప్రతి పార్టీకూడా నేడు సంపూర్ణ స్వాతంత్ర్యం తన ఆశయంగా పెట్టుకోకపోతే అది ప్రజల్లో జీవించలేదు.

కాని మనలో మనకు భేదాలున్నాయి. చారిత్రకంగా, ఆర్థికంగా, వైజ్ఞానికంగా, వివిధ జాతులమధ్య ఉన్న భేదాలే అవి. అందువల్లనే దేశ భక్తితో ఉత్తేజితుడైనవాడికి కన్నుమూస్తే కనిపించేది యావత్తు భారత దేశంకాదు; తన (రాష్ట్రం) జన్మభూమిలో తన యిల్లు కన్పిస్తుంది; తన మాతృభాష జిహ్వామీద తాండవిస్తుంది !

ఈ ముఖ్యమైన భేదాలుండడంవల్లనే స్వాతంత్ర్యమనేది వివిధ ప్రజలకు వివిధ విధాలుగా వుంటుంది. అందుకనే వివిధ పార్టీలు బయలుదేరుతాయి.

బ్రిటిష్‌వాళ్ళమీద మన రాజకీయ పార్టీలన్నీ బద్ధ శత్రుత్వాన్ని వహిస్తాయి.

కాని. పరస్పరం స్నేహభావం మాత్రం లేదు !

అందరి హక్కులు నిర్వచించండి

స్వాతంత్ర్యం చేరువకు వచ్చేకొద్దీ మనలో మన కున్న భేదాలే ఎక్కువవుతాయి. "భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, మాయొక్క

మా ప్రజలయొక్క, స్వాతంత్ర్యంమాట ఏమి"టని పెద్ద పార్టీలను చిన్న పార్టీ లడగడం సహజం. కాబట్టి స్వాతంత్ర్యమంటే బ్రిటిష్ దాస్యం నుంచి విముక్తిపొందడం అనిమాత్రం చెబితే చాలదు. స్వాతంత్ర్యం యొక్క స్వరూప స్వభావాలు, అది మనలో మనకు ఎలా వర్తించేదీ స్పష్టపరచాలి. ఈపని చేయడానికి నిరాకరించడం కేవలం అక్రమం. దీనిఫలితంగా వినాశకర పరిస్థితు లేర్పడతాయి. అవే నేడు చూస్తున్నాం. ఏదోవిధంగా రెండోపార్టీని ఓడించడానికి ప్రతి పార్టీ చేతనైన పనల్లా చేస్తున్నది.

మన ప్రజా చైతన్యంలో మొట్టమొదటిదశ బ్రిటిష్ సామ్రాజ్య వాదంనుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం పొందాలనే లక్ష్యాన్ని నిర్వచించడం.

రెండవదశ - బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలం దరినీ కూడగట్టుకోడానికి బ్రిటిష్ ప్రభుత్వపు తొత్తులైన స్వార్థపరులకు ప్రజల్లో పలుకుబడిలేకుండా చేయడానికీ - జాతి మతవర్గ విచక్షణ లేకుండా మన ప్రజలందరియొక్క ప్రజాస్వామ్య హక్కులను నిర్వచించడం.

ఇక మూడోదశ నేడు వచ్చింది. ప్రజలందరూ ప్రజాస్వామ్య హక్కులను అనుభవించే స్వతంత్ర భారత దేశంలో స్వయం నిర్ణయ మాత్రాన్ని అమవర్తింపజేసుకోడం. బలవంతులనుచూసి బలహీనులు భయపడ్డట్లుగానే, హిందూమెజారిటీయొక్క ప్రాబల్యం ఏర్పడుతుందేమోనని, ముస్లింమైనారటీ భయపడుతున్నది; అందువల్లనే స్వయంనిర్ణయ మాత్రం కావాలని కోరుతున్నది.

న్యాయంగా ఈ కోర్కెను వ్యతిరేకించడానికి వీలులేదు, భారత స్వాతంత్ర్యమంటే భారత ప్రజలందరికీ నిజమైన స్వాతంత్ర్యమై వుండాలనీ, ఇందులో ఒకరిమీద మరొకరికి ఆధిపత్యం వుండకూడదనీ కోరడంలో తప్పేమిటి?

ఈ స్వయంనిర్ణయ సమస్యను సక్రమమైన సూత్రాలతో, సక్రమమైన సరిహద్దులతో, సక్రమమైన సుహృద్భావంతో మనం పరిష్కరించ

లేకపోయినట్లయితే ఈనాడు మనం భారతదేశంలో స్వాతంత్ర్య ప్రియుల నందరిని కూడగట్టలేము; స్వాతంత్ర్యాన్ని సంపాదించలేము.

బ్రిటిష్‌వాళ్ళనుంచి కాంగ్రెసు స్వాతంత్ర్యం కోరడంలో ఏ సూత్ర మైతేవుందో, అదే సూత్రాన్ని ఇంకా ముందుకుతీసుకుపోయి, భారతదేశం లోని అన్నిజాతులకు తమ తమ మాతృభూముల్లో స్వాతంత్ర్యంగా చెయ్యాలి.

బ్రిటిష్‌వాళ్ళకు వ్యతిరేకంగా భారతదేశమంతా ఒకే కుటుంబ మన్న కాంగ్రెసు నినాదంలోనేవుంది ఈ దృక్పథం. ఇంకా ఈ దృక్పథాన్ని వివరించి, స్వతంత్ర భారతదేశం స్వతంత్ర జాతుల సమిష్టి కుటుంబంగా వుండేలాగాను, ఇందులో ఒకరిమీద మరొకరు పెత్తనంచేసే అవకాశం లేకుండాను, అన్వయింపజేయాలి.

1920—30 ల లోనే హిందూ - ముస్లిం ఐక్యతకోసం బ్రహ్మాండమైన కృషిచేసిన కాంగ్రెసు సాంప్రదాయంలోనే ఈ సమస్య అంకురించివుంది.

ఇంక ఈ సమస్యను త్రోసివెయ్యడానికి వీలులేదు. అలా త్రోసిరాజంటే, మనందరికీ, వినాశం తప్పదు.

ఐక్యత ప్రధానావసరం

మనదేశంలోని వివిధపార్టీలు స్వాతంత్ర్య సూత్రాన్ని తమలోతాము బుద్ధిపూర్వకంగా అన్వయించుకోకపోతే, మనదేశానికి స్వాతంత్ర్యంరాదు. బ్రిటిష్‌వాళ్ళు తమ చిత్తంవచ్చిన విధానాన్ని మన నెత్తిన రుద్దుతారు. స్వాతంత్ర్య సూత్రం బ్రిటిష్‌వాళ్ళతో పోరాడటానికి మాత్రమేకాదు. మన స్వాతంత్ర్యోద్యోమాన్ని నిర్మించుకొని, స్వాతంత్ర్యాన్ని సాధించడానికి మన దేశంలోని ప్రస్తుత సమస్యలకుకూడా ఆ స్వాతంత్ర్యసూత్రం వర్తింపజేయాలి.

ఇవాళ మన ప్రధానరాజకీయపార్టీలు, కాంగ్రెస్ లీగులు సాధారణ సూత్రాలనుగురించీ స్వతంత్రభారత రాజ్యాంగాన్ని గురించీఒక అభి

ప్రాయానికివచ్చి, ఏకంగా బ్రిటిష్‌ప్రభుత్వాన్ని ఎదుర్కొంటారా ? లేక, ఎవరికివాళ్ళు బ్రిటిష్‌వాళ్ళ దగ్గరికిపోయి ఎదుటివాడిమాట త్రోసేసి నామాట వినమంటే నామాటవినమని ప్రాధేయపడి చీలికలతోకూడిన బానిసభారత రాజ్యాంగాన్ని తెచ్చిపెట్టుకుంటారా ?

స్వతంత్రభారతరాజ్యాంగానికి ప్రాతిపదికగా, స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించాలనీ, జరుగనున్న రాజ్యాంగ నిర్ణయసభలో కాంగ్రెస్ లీగులు కలిసి ఒకే భారతరాజ్యాంగాన్ని ప్రవేశపెట్టడానికిగాను ముందుగా కాంగ్రెస్ లీగులు ఈ సూత్రాన్ని యెలావర్తింపజేయాలో పరస్పరంచర్చించుకోవాలనీ మేము చెబుతున్నాం. మీరు స్వాతంత్ర్య సూత్రాల ప్రకారం చూసినాసరే, ప్రత్యక్ష అవసరాలనుబట్టి చూసినాసరే, మేము చెప్పిందికాదనలేరు.

మొదటినుంచీ మన జాతీయోద్యమంలోకి ప్రతి కొత్తఅభిప్రాయాన్ని మేమే తీసుకొచ్చాం. అలాగే, ఇవాళ, కాంగ్రెసులోని అన్నిమతాలకంటె, పార్టీలకంటె, ముందుగా మేమే స్వయంనిర్ణయసూత్రాన్ని కాంగ్రెసు, లీగు ఐక్యతా స్వరూపాన్ని చూడగలుగుతున్నాం.

మామూలు కాంగ్రెసువాది నేడు హిందూ - ముస్లిం ఐక్యత అవసరమని గుర్తించడు;

1920 నుంచి కాంగ్రెస్ నాయకత్వం క్రమక్రమంగా కాంగ్రెస్ లోని ముస్లింలను దూరం చేసుకుంటున్నది. కాని ప్రతి కమ్యూనిస్టు హిందూముస్లిం ఐక్యతావసరాని గుర్తిస్తాడు. 1920 లో హిందూ ముస్లిం ప్రజా ఉద్యమ మయిన తర్వాత, మళ్ళీ అలాంటి ఉద్యమాలు ఎక్కడన్నా పుట్టినవన్నా, పెరిగినవన్నా అవి కార్మికసంఘాలు; రైతుసంఘాలు. సమ్మెలలోను సమిష్టి పోరాటాలలోను ముస్లింలు చూపిన ఉత్తమ త్యాగ సాహసాలను ఎగిరినవారు కనుకనే కమ్యూనిస్టులు ముస్లిం ప్రజలను ప్రేమించగలుగుతారు. గౌరవించ గలుగుతారు. మానాయకత్వం క్రింద నిర్మాణయుతంగా నడిచేప్రజలు తమ నిత్య అవసరాలతోను, నిత్యపోరాటాలతోను ఐక్యమైపోతారు. మేము హిందూముస్లిము ఐక్యతను గురించి

ఊకదంపుడు ఉపన్యాసాలు చెయ్యం. ఆ ఐక్యతను మేము మా నిత్యజీవితంలోనేఅమలుపరుస్తాం; ప్రజాసేవకై కృషిచేస్తాం.

మాపార్టీ అణగదొక్కబడ్డవారి పార్టీగనుక న్యాయాన్నిచూస్తుంది. అందుచేతనే. లీగుయొక్క కోర్కెలను చెవియొగ్గి, అందరి యొక్క సక్రమమైన హక్కులు న్యాయంగా పరిష్కరించే విధానానికి పూనుకున్నది.

స్వాతంత్ర్య పోరాటమే. తన ప్రధానకర్తవ్యంగా మా పార్టీ భావిస్తుంది. కమ్యూనిస్టు మొట్టమొదట నేర్చుకోవలసింది. ఒక కార్యక్రమములో కలసి మెలసి పనిచెయ్యడం; రెండవది - అతని హృదయం ఎప్పుడూ న్యాయంవైపు మొగ్గేలాగు చెయ్యడం; మూడవది భారత స్వాతంత్ర్యం కోసం ప్రస్తుత సమస్యలు ఏవైనప్పటికీ వాటిని పరిష్కరించడం. ఇందువల్లనే, స్వభావసిద్ధంగా మన జాతీయోద్యమంలో స్వయం నిర్ణయసూత్రాన్ని అందరికంటే ముందుగా మేమే బలపరుస్తున్నాం.

కుల మత భేదాలు లేనివాళ్ళం మేమే

కాంగ్రెస్ నాయకత్వంగాని, లీగు నాయకత్వంగాని, తమలో తాము ఆరోపించుకొన్నట్లుగా, మా నాయకత్వంమీద కులమత తత్త్వాలను ఆరోపించలేకపోతున్నారంటే, ఆ గొప్పతనం మార్క్సిజం యొక్క శాస్త్రీయ దృక్పథానికే చెందుతుంది. వాళ్ళ అన్యోన్య యుద్ధాల్లో మేము చేతులు కలపడంలేదని, కాంగ్రెస్, లీగులు రెండూ మమ్మల్ని చూసి విచారపడతాయి. మేమేదో స్వార్థానికి చూస్తున్నట్లుకూడా అనుమానిస్తాయి; తమ అలవాట్లనుబట్టీ మమ్మల్నిగురించికూడా ఆలోచిస్తాయి. 1942 లో కాంగ్రెస్ యువకులను పోగొట్టుకున్నందుకు బదులుగా ఇవాళ ముస్లిం యువకులను చేరబట్టుకోడానికి చూస్తున్నామని లీగు అనుకొంటుంది; 1942 లో కాంగ్రెస్ ప్రజల్లో పలుకుబడి పోగొట్టుకున్నాం కనుక, ఇవాళ ముస్లిం ప్రజల్లో పలుకుబడి సంపాదించడానికి ప్రయత్నిస్తున్నామని కాంగ్రెస్ అనుకొంటుంది. కొత్త అభిప్రాయాలను కనిపెట్టి కొత్త సిద్ధాంతాలుచేసి ప్రజల్లోకి చొచ్చుకుపోయే తెలివితేటలు మాకున్నాయని ఇద్దరూ అనుకుంటారు. మన యువకులయందూ, ప్రజలయందూ—రాజకీయాలే వృత్తిగాపెట్టుకొన్న మధ్యతరగతి రాజకీయవేత్తయొక్క దృక్పథం ఈ ఇద్దరికీ ఉండడంలో ఆశ్చర్యం లేదు.

వేలకొలది కాంగ్రెస్‌వాదులు స్వాతంత్ర్య ప్రియులనీ న్యాయబుద్ధి కలవారనీ మాకు తెలుసు; వారిని మేము గౌరవిస్తాం. ఈ కాంగ్రెస్ యొక్క అరవై యేండ్ల మహత్తరమైన సాంప్రదాయంలో పెరిగినకాంగ్రెసువాదుల దేశభక్తిమీద, న్యాయబుద్ధిమీద, మాకు విశ్వాసం వుంది. ఇవాళటి కాంగ్రెస్ నాయకత్వపు, లీగు కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరి యొక్క దుష్ఫలితాలను చూడగానే వాళ్ళు సక్రమమైన మార్గాన ముందుకు వస్తారనే నమ్మకం మాకుంది.

లీగుకుగానీ, మా పార్టీకి గానీ ప్రజల్లో ఉన్న పలుకుబడి ఇంత మాత్రంతో పోదు. ఎందుకంటే ఈ రెండు పార్టీలూ ఒక వాస్తవమైన ప్రధానమైన, స్పష్టమైన వాంఛను ప్రతిబింబిస్తున్నాయి. ఆవాంఛకు ఎన్నటికీ చావులేదు, అన్నిసమస్యలను కాంగ్రెసు పాలసీని, ఏదోవిధంగా పునరుద్ఘాటించినంత మాత్రాన అవన్నీ పరిష్కారమయినాయనుకోడం భ్రమ. అన్నీ మళ్ళీ మొదటికేవస్తాయి; మేము చెబుతున్న పద్ధతులమీద ఈలోపుగా కాంగ్రెసు లీగులు ఒక నిర్ణయానికిరాకపోతే, రేపుజరుగనున్న రాజ్యాంగనిర్ణయసభ, సిమ్లాసమావేశంకంటె అధ్వాన్నమవుతుంది. ఇంతకంటె గత్యంతరంలేదు.

మనదేశంలోకల్లా గొప్ప రాజకీయసంస్థ కాంగ్రెసు. ఆ కాంగ్రెసు సభ్యులంగా వున్నందుకు మేము గర్విస్తున్నాం. కాంగ్రెసు నాయకత్వంలో వృద్ధాతివృద్ధులుమీరు, అందువల్ల మీకు సహజంగా విశాల హృదయం సహనభావంవుండాలి. కాని నేటి భారతదేశ పరిస్థితులు ఎలా వుండాలో, అలా లేవు. మీరు మా పార్టీని దేశద్రోహులపార్టీ అన్నారు. మాతో రాజకీయంగా ఎంత భేదించినా ఏ సోదర దేశీయుడూ మమ్మల్ని ఈమాట అవలేదు. మేము దేశాన్ని బ్రిటిష్‌వాళ్ళకు అప్ప జెప్పామని మీరు ప్రజలకు

చెబుతున్నారు. మీరు జపానుకు దేశాన్ని అమ్మజూపారని, మేమూ అదే విధంగా అనగలం. కాని అది అసత్యం కనుక మేమనం. 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' అనేది అదివిమనిషితత్వం. కాని. కమ్యూనిస్టు విధానం అదికాదు.

దేశాన్ని స్వాతంత్ర్యలక్ష్యానికి చేర్చలేక, మీకుఇష్టం లేకపోయినా దినదినాభివృద్ధి చెందుతున్న ఇతర పార్టీలనుచూసి ఓర్చలేక, మీరు ఏకీభవించని పార్టీలమీద అపనిందలు వేసేదాకా దిగజారి పోయారు.

ఒక బానిసదేశంలో స్వాతంత్ర్యమనేది అందరియొక్క ఏకైక లక్ష్యమైవుండాలి. కాని మన ప్రధానస్వాతంత్ర్యసంస్థయొక్క నాయకులైన మీరు ఇతరపార్టీల మీద నిందలు వెయ్యడంలో నిమగ్నులై వున్నారు. వారి దృక్పథాలను అర్థం చేసుకోడానికి ప్రయత్నించడంలేదు. మన దేశంలోని రెండవప్రధాన రాజకీయసంస్థ, ముస్లింలకు ప్రాతినిధ్యం వహించేది అయిన లీగును, మన దేశంలో ఎక్కడకార్మికోద్యమం వుందన్నా, రైతు ఉద్యమం ఉందన్నా, వాటిని నిర్మించి నడుపుతున్న మా పార్టీని, కలుపుకుందామనికూడా మీరు ఆలోచించడంలేదు.

స్వాతంత్ర్యం అనేది మీనోట ఒక మంత్రం కిందికిదిగి పోయింది. స్వాతంత్ర్యానికి మీరు వేస్తున్న ఎత్తులు అంతఃకలహానికి, వర్గకలహానికి దారితీస్తున్నాయి.

మీరు మా పార్టీని ఎంతనీచంగా నిందించినప్పటికీ, మేము మాత్రం మావివేకం కోల్పోము. మనదేశంలోని ప్రధానజాతీయ నాయకులైన మీరు రాజకీయసిద్ధాంతాలను వదిలేసి నిందాప్రచారానికి దిగినప్పుడు, మీ కార్యక్రమం అంతర్యుద్ధ మైనప్పుడు, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల మీది పోరాటానికి ఒకప్లానుకోసం మీరు ఆలోచించనైనా ఆలోచించనప్పుడు, దేశంయొక్క భవిష్యత్తు ఎంత విషాదకరం కానున్నదో మాకు తెలుసు?

స్వాతంత్ర్యానికి ఒక్కటే బాట

ఎన్నికల అనంతరం ముస్లింలంతా లీగువెనుక వుండడం చూసిన తర్వాతనయినా లీగు వ్యతిరేక ప్రచారాన్ని ఆపుచేసి, లీగుతో ఐక్యం కావలసిన అవసరాన్ని కనుక గుర్తించకపోతే మీరు ముస్లిం వ్యతిరేక భావాలనే చెప్పవలసివస్తుంది; ముస్లింలంతా అభివృద్ధినిరోధకులనీ, వాళ్ళకు స్వాతంత్ర్యం అంటే యిష్టంలేదనీ, వాళ్లు బ్రిటిషువాళ్ళమీద పోరాటానికి రారనీ, ఇంకా యిలాంటి మాటలు చెప్పే ధోరణికి దిగజారవలసివస్తుంది.

ఎన్నికల అనంతరం మీరు పూర్తిగా వ్యతిరేకించినప్పటికీ కార్మిక నియోజక వర్గాల్లో కమ్యూనిస్టులు విజయంపొందడం చూసినతర్వాతనైనా మీ కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని కట్టిపెట్టకపోతే, మీరు సమ్మెలను చెడగొట్టి, కార్మికులను కాల్చి, కార్మిక నాయకులను జైళ్ళలోపెట్టే స్థితికి వస్తారు. కమ్యూనిస్టులు సమ్మెలు రెచ్చగొడుతున్నారనీ, ఊరూ పేరూ లేని వీళ్లు కార్మికుల్లో ఏదో స్థానం సంపాదించా లనుకుంటున్నారనీ, బ్రిటిష్ప్రభుత్వం చెప్పి చెప్పి, మీరట్ విచారణ పిదప, దేశవ్యాపితమైన సమ్మెల పిమ్మట - ఆ మాటలే అనడానికి సాహసించలేక ఊరుకున్న నిందల్నే మీరుమళ్ళీ మామీద వేసేస్థితికి వస్తారు.

కార్మికులను గౌరవించాలని మేము పెట్టుబడి దారులకు బోధించవలసి వుండేది; మన ప్రజా నాయకుల్లో పెద్ద పెద్దలకుకూడా మేము ఆదేపాఠం చెప్పవలసి వస్తుందా?

కాంగ్రెసు లీగులు ఇలాగే పోరాడుకుంటూ, ఆ పోరాటాన్ని మేము అరికట్టకపోతే — బ్రిటిష్వాళ్ళు తయారుచేసిన రాజ్యాంగచట్టం మన నెత్తిన పడక తప్పదని మాకు తెలుసు.

మీరు మా పార్టీని ఎంతగా నిందిస్తారో, మేము కాంగ్రెసు నంతగా పూజిస్తాం, మనదేశంయొక్క గొప్ప జాతీయ సంస్థను కారుకూతలుకూసే చేతగాని నాయకత్వాన్ని మేము ఒకవిధంగానే చూడం. నిజానికి మేము

మిమ్మల్ని విమర్శించేది - భారత స్వాతంత్ర్య దృక్పధంలోనే: స్వాతంత్ర్య సూత్రాలమీదనే, సత్వర స్వాతంత్ర్య ప్రాప్తికే!

మీ శాయశక్తులా మీరు మామీద పోరాడవచ్చు. కాని మాపార్టీ అప్పటికీ సజీవంగా ఉండడమేకాక, ప్రజల్లో అంతకంతకూ చొచ్చుకు పోవడం మీరే చూస్తారు.

మా పార్టీమీద నిందలువెయ్యడం తేలికే. కాని; ఎప్పుడూ మా మీద నిందలు వేసినవాళ్ళే నష్టపడ్డారు.

మన దేశంలోని కమ్యూనిష్టుపార్టీని తుడిచి పెట్టాలని చెప్పడం తేలికే. కాని, కమ్యూనిష్టుపార్టీని నాశనం చేస్తామని చెప్పినవాళ్ళే ప్రతి దేశంలోనూ నాశనమైనారు.

భారత కమ్యూనిష్టులమైన మాకు స్వాతంత్ర్య పోరాటం కంటె వేరే పోరాటం ఏమీలేదు. కాంగ్రెస్ లీగులు భారత స్వాతంత్ర్యాన్ని గూర్చి ఒకప్లాను వేసుకొని బ్రిటిష్‌వాళ్లు మన నెత్తిన రుద్దనున్న బానిస రాజ్యాంగ చట్టంనుంచి తప్పించుకోడానికిగాను కాంగ్రెసు లీగుల ఐక్యత కోసం చేసేపోరాటం అదే!

దేశభక్తియొక్క ప్రధాన సూత్రాలే తక్షణ నినాదాలుగా గలపార్టీని నిందలేం చేస్తాయి? మా నినాదాలు ఇవి.

— భారతీయుల్లో భారతీయులు పోరాడరాదు.

— భారత స్వాతంత్ర మంటే

భారతీయులందరి మాతృభూముల స్వాతంత్ర్యం.

— అన్ని స్వతంత్ర జాతులయొక్క సమిష్టి కుటుంబంగా వుండే భారత సమాఖ్య దురాక్రమణదారులకు ప్రక్కలబల్లెంగాను, పునరుజ్జీవనానికి జీవగర్రగాను ఉండాలి. అందరూకలిసి దేశ స్వాతంత్రాన్ని కాపాడుకోడానికీ, ప్రతిజాతియొక్క భవిష్యత్తును నిర్మించుకోడానికీ సమాన హోదా గల అన్నిజాతులయొక్క సమిష్టికుటుంబంగా స్వతంత్రభారత సమాఖ్య వుండాలి.

"అందరికీ వ్యతిరేకంగా ఒకరు, అనేది ఆటవికసూత్రం. నిజంగా ఇవాళ కాంగ్రెస్ - లీగు, కాంగ్రెస్ - కమ్యూనిస్టు తగాదా ఇలాంటిదే. కాని, "అందరికోసం తాను, తనకోసం అందరూ" అనేది భారత స్వాతంత్ర్యానికీ, భారతాభ్యుదయానికీ, భారతౌన్నత్యానికీ భారతీయుల పంథా కావాలి!

ఇవే దేశభక్తియొక్క ఉత్తమమైన నవీనమైన సూత్రాలు. ఇవే కాంగ్రెస్ లీగులు ఒకరినొకరు కోరుతున్న అక్రమమైన హక్కులను త్రోసేసి, సక్రమమైన హక్కులను అంగీకరిస్తాయి. మన ప్రజల సమిష్టి స్వాతంత్ర్య పోరాటం నడపడానికి కాంగ్రెస్ లీగు కమ్యూనిస్టు ఐక్యత కావాలని కృషిచేస్తూ, కమ్యూనిస్టుపార్టీ ఇవాళ ఈ ఆశయాలనే ప్రబోధిస్తుంది!

మా పార్టీని నిందించేవాళ్ళు, వాళ్ళ నోరే చెడగొట్టుకుంటారు: అన్నదమ్ముల మధ్య కలహంపెట్టి, మన మహత్తరమైన జాతిని ఇంకా బానిస సంకెళ్ళల్లో బంధించే బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిసరాజ్యాంగానికి త్రోవచేసిపెట్టి, భారత స్వాతంత్ర్య ముహూర్తాన్ని దూరం చేసినవారవుతారు.

"జపానుకు వ్యతిరేక యుద్ధంలో వలసరాజ్య ప్రజలు ఎటు
వంటి విధానాన్ని అవలంభించాలి" ఇండోనేషియానాయకుడుహట్టా

బ్రిటిష్ డచ్చి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇండొనేషియా రిపబ్లిక్ ఉపాధ్యక్షుడయిన హమ్మదుహట్టా ప్రకటనను ఈ క్రింద యిస్తున్నాం. పెరల్ హార్బరుపై జపానుదాడి అనంతరం ఈ ప్రకటన చేయబడింది. బ్రిటిష్, డచ్చి సామ్రాజ్యవాదుల క్రింద బానిసలుగా వున్న వలసరాజ్యప్రజలు జపానుదాడిపట్ల ఎటువంటి దృక్పథం అవలంభించాలో స్పష్టీకరించాడు. బుద్ధివున్న వాడెవడూ హట్టా సామ్రాజ్యవాదులతో కలశాడనిఅనడు. ఆతడు చెప్పింది ఒకటే. 'మీ శక్తిమీద మీరు ఆధారపడండి. ఆరోజుల్లో మేము చెప్పిందికూడా ఇదే.

సైన్యంలో వున్న ఏ కొద్దిమందికో తప్ప మిగిలిన ప్రజలకు ఆయుధాలు లేవు. తమ భవిష్యత్తును తాము నిర్మించుకోడానికి అవకాశాలులేవు. కాని అంతమాత్రంచేత ఈయుద్ధంతో మనకు సంబంధంలేదని అనుకోరాదు. మనకు ఏయజమానయినా ఫర్వాలేదనే దృక్పథం చాలా ప్రమాదకరం. ఈ దృక్పథం తప్పు. ఈ దృక్పథం ఇండోనీషియాకు చాలా నష్టం కల్గించుతున్నది. జపాను ఒక వందరోజులు పరిపాలించిన తర్వాత మనకు స్వతంత్రం వస్తుందని అనుకునే వారున్నారు. చైతన్యమైన ప్రజానీకం ఈ ప్రమాదమైన అభిప్రాయాలను పోగొట్టాలి. అట్లా అనుకునే ఛాందసులందరికి. ఆ దృక్పథం ఇండొనీషియాకు ఎంత నష్టం కల్గించుతుందో స్పష్టపరచాలి.

మనలో కొంతమంది బయట దేశస్థులను అనుకరించేవారున్నారు కాబట్టి నేను యీ బహిరంగ ప్రకటన చేస్తున్నాను. బ్రిటిషువారినుండి స్వాతంత్ర్యం సంపాదించడంకోసం రషీద్ అలీ జర్మన్ సాయాన్ని తీసుకున్నాడని మనకు తెలుసు. రషీద్ అలీ తన దేశాన్ని ప్రేమించే ఒక అరబ్ జాతీయవాదని కూడా మనకు తెలుసు. కాని మనం ఒక విషయం మాత్రం మరచిపోకూడదు. తన దేశానికి స్వతంత్రం రాలేదు కదా యింకా కష్టాలు అనేకరెట్లు పెరిగిపోయాయి. జర్మన్లు ఇరాక్‌కు రావడంద్వారా ఇరాక్ స్వాతంత్ర్యం పొందలేదు సరిగదా వారి ఇనుప పాదాలక్రింద నలిగిపోవలసివస్తుంది. ఇతర దేశస్థులకు కనీస హక్కులను గుర్తించటం అంటేనే నాజీలకు మంట. పార్లమెంటు అనేది వారంగీకరించరు. నాజీలు ఒకే ఒక విషయం చెప్తారు, "ప్రభుత్వానికి లొంగివుండు, లేకపోతే నీ గుండెల్లో తుపాకిగుండు పేలుస్తాం. నిన్ను కాన్‌సెంట్రేషన్ క్యాంపులో పెడతాం."

కాబట్టి రషీద్ అలీ ఒక అరబ్ జాతీయవాదేగాని అతనికొక నిశ్చితమైన రాజకీయపంథా లేదు. ఈ విషయాన్ని మీరు గుర్తుపెట్టుకోవాలి. యూరప్, ఇండోనేషియాలలో నున్నటువంటి ప్రజా వుద్యమాలు ఇరాక్‌లో ఎప్పుడూలేవు. ఎవరికైతే డబ్బువుంటుందో వారే నాయకులయ్యేవారు. వారికొక రాజకీయపంథా లేదు. వారి ఆదర్శం ఒకటే. అది స్వాతంత్ర్యం.

కాని ప్రతి నాయకుడు ఒక నియంత కావాలనుకునేవాడు. ఈ విషయాన్ని నేనేదో పుస్తకములు చదివి చెప్పేదికాదు. 'దేశస్వాతంత్ర్యం కోసం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట సంస్థ' లోనున్న ఈజిప్టు, సిరియా నాయకులు నాతో స్వయంగా ఈ విషయాలను చెప్పారు. అరబ్ నాయకులకు తమ శత్రువులయొక్క శత్రువులనుండి సహాయం పొందడం అలవాటైపోయింది. రషీద్ అలీ 1915 లో టర్కీవాళ్ళను తనదేశాన్నుంచి బయటకు గొట్టడానికి బ్రిటిష్‌వాళ్ళసాయం తీసుకున్నాడు. ఇప్పుడు బ్రిటిషు వాళ్ళను బయటకు గొట్టడానికి జర్మన్ సాయంతీసుకున్నాడు. క్రిందటి ప్రపంచ యుద్ధంలో జర్మనులు, ఇటాలియన్లు, పాలిస్తయిన్‌లో ఏమిచేశారో రషీద్ అలీ మరిచిపోయాడు. చాలమంది పాలస్టయిన్ నాయకులు జర్మనీ తుపాకీ గుండ్లకు గురిఅయ్యారని మరచిపోయాడు. ఈనగ్న సత్యాలను ఎందుకు మరచిపోయాడు? తమ ప్రజల శక్తిమీదగాక ఇతరదేశాల సహాయంతో 'స్వాతంత్రం' సంపాదించుదామనే వారందరు ఇలాగే మరచిపోతారు.

ఇలాంటి పంథానే తీసుకున్న మరొక రాజకీయ నాయకుడున్నాడు. ఆయనే సుభాస్‌చంద్రబోసు. సుభాస్‌చంద్రబోస్ జర్మనీ ఇటలీల సాయంతో బ్రిటిష్‌వాళ్ళను బయటకు కొట్టాలనుకున్నాడు. భారత జాతీయకాంగ్రెసుకు బోసు ఒకప్పుడు అధ్యక్షుడు. అందువలన ఆయనకు ప్రజలలోమంచి పలుకుబడి వుంది. ఇంతగొప్పవాడు చేసినపని మనంకూడా అనుకరించకూడదా అని కొందరనుకోవచ్చు. బోస్ తీసుకున్న పంథానుచూచి మనం ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. ఆయనకు మొదటనుంచీకూడా ఫాసిస్టుభావాలుండేవి. యువకులు, ఆవేశపరులు, ఫాసిస్టుప్రచారానికి హడావుడి ప్రదర్శనాలకు ఆకర్షింపబడుతూ వుంటారు. చిన్నవాళ్ళు సాధారణంగా అతివాగుడును, నాయకపూజను ఇష్టపడతారు, ఫాసిజం చిన్నవాళ్ళ హృదయాలను ఆకర్షించడానికి కావలసిన వాటిన్నంటినీ సృష్టించుతుంది. యువకులకు

ఏదో ఒకపని చేయాలని వుంటుంది. ఫాసిజం దీనిని సప్లయిచేస్తుంది. బోసుకూడా ఈవిధంగానే ఆకర్షింపబడ్డవాడు.

మీరు భారతదేశంలో ఎవరినిగురించైనా తెలుసుకోవాలంటే నెహ్రూను తీసుకోండి. కాని బోసునుకాదు. నెహ్రూ ఎప్పుడుకూడా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించుతాడు, కాని బ్రిటిష్ ప్రజలను గౌరవించుతాడు. ఫాసిస్టులనుండి, నాజీలనుండి ఆయన సాయంకోరడు. ఆయన వ్రాతల్లో, చేతల్లో జపానుకు వ్యతిరేకంగా చైనాప్రజల వీరోచిత పోరాటాన్ని బలపర్చాడు. ఆయన, ఆసియా లీగునుకూడా స్థాపించాలంటున్నాడు. కాని దురాక్రమణదారులైన జపాను సామ్రాజ్యవాదులకు అందు స్థానం లేదంటున్నాడు. నెహ్రూ ఈ యుద్ధంలో జపాను సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించుతున్నాడంటే మనమేమి ఆశ్చర్యపడనవుసరం లేదు.

సుభాష్‌బోసు మరణం

సుభాష్‌బోసు మరణించాడు. ఇది రూఢియైనవార్త కాదని కొందరి అభిప్రాయం.

అక్షరాజ్యాల సహాయం తీసుకొనేటందుకు బోసు ఇండియా విడిచి యితర దేశాలకు వెళ్ళాడు. భారత జాతీయోద్యమం అక్షరాజ్యాలకు వ్యతిరేకంగా నిలిచింది. ఫాసిస్టుల సహాయంతో మన దేశానికి స్వాతంత్ర్యం సంపాదించగలమనే భ్రమ బహు కొద్దిమందికి మాత్రమే ఉంది. బోసు చూపిన మార్గ మవలంబిస్తే, భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతుల్లోనుంచి జపాన్ సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్ళకమానదని అత్యధిక సంఖ్యాకులు విశ్వసించారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశంలో అవలంబించిన విధానం ఫలితంగానే, బోసువంటివారు బయలుదేరారు. దీనికితోడు ఆగస్టు (1942) ఘటనల సందర్భంలో దేశమంతటా చెలరేగిన నిర్బంధవిధానం ప్రతి భారతీయుణ్ణి ఆగ్రహావేశునిగా చేసింది. ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు అధికార మీయకుండా బిర్రబిగుసుకొని కూర్చొంది. ఈ విధానంయొక్క ఫలితంగా బోసు ఒక దేశభక్తుడని, స్వాతంత్ర్యం కోసం ఆత్మార్పణచేసిన వీరయోధుడనీ, చాలమంది రాజకీయ నాయకులు, పత్రికాధిపతులు అభిప్రాయపడుతున్నారు. అతను అవలంబించిన మార్గం వక్రమార్గమేనని కొందరు ప్రకటిస్తున్నప్పటికీ, బోసు దేశభక్తుడేనని చాలమంది అభిప్రాయం.

అయితే, మనం బోసు ఉద్దేశాలకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చి, అతడవలంబించిన పాలసీ జపాను అనుకూలపాలసీ అనే విషయాన్ని గుర్తించకపోతే, ఇతరదేశాల్లో మన స్వాతంత్ర్యోద్యమంపట్ల అభిమానం చూపే ప్రజాస్వామ్యశక్తుల సానుభూతిని, వారు మనకిచ్చే గౌరవాన్ని పోగొట్టుకొంటాము. ఇటు మనయువకులు, బ్రిటిషుప్రభుత్వంతో పోటీగా వచ్చే మరొక సామ్రాజ్యవాద ప్రభుత్వంతో చేతులు కలపనిదే మనకు స్వరాజ్యం రాదనుకునేటట్లు చేస్తాం.

సుభాష్‌బోసుతోను, ఫార్వర్డుబ్లాకుతోను, మాకు వచ్చిన విభేదాలు రాజకీయ విభేదాలు. మొదటినుంచీ మేము వారితో రాజకీయసాధనాలతోనే పోరాడుతూ వచ్చాం. మామీద వారు ఎంత నీచమైన ప్రచారం చేస్తున్నా, బెంగాలులో కత్తులుకూడా ప్రయోగించి మావాళ్ళను ఐదుగురిని పొడిచి చంపినా, మేము రాజకీయంగానే వారి చర్యల్ని ఎదురుకొన్నాం.

ఇప్పుడు బోసు అనుచరులందరినీ విడుదల చేయాలని దేశంలో జరుగుతూన్న ఆందోళనకు మేముకూడా చేయూత నిస్తాం. వారు తమ పాలసీని ప్రజలయెదుట పెట్టి, ప్రజాభిప్రాయాన్ని తీసుకోవలసిందని కోరుతున్నాం. దేశంలో నేడేర్పడ్డ కొత్తపరిస్థితుల్లో వారెలాంటి కొత్త కార్యక్రమ మిస్తారో పరీక్షించి, మేము మావైఖరిని నిర్ణయించుకుంటాం. గతించిన వాటిని మరచిపోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఎందువల్లనంటే, దేశంమీద పెత్తనం చేస్తున్నది బ్రిటిష్ సామ్రాజ్యవాదులని స్పష్టంగా మేము గుర్తిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి, పీడిత ప్రజలకు లాభం కలిగించే కార్యక్రమాన్ని వారు చేబట్టినట్లయితే వారిని మేమాహ్వానించుతాము. అలాకాకుండా, మరో సామ్రాజ్యవాదప్రభుత్వం

వైపు సహాయంకోరకు దృష్టులునిగిడ్చే పాలసీని యికముందుకూడా వారవలంబించినా, లేక దేశభక్తుల్లో దేశభక్తులు కలహించుకునే పంథాను చేబట్టినా, దొంగవ్యాపారస్తుల్ని బలపరచినా, వారిని మేం గట్టిగా ఎదుర్కొంటాం. —(పి. సి. జోషి)

భారత జాతీయ సైన్యం

జపాను సేనలు మలయాను, బర్మాలను స్వాధీనం చేసుకొని ఇండియా సరిహద్దుల్లో జొరబడ్డానికి సిద్ధంగా ఉన్నప్పుడు, సుభాష్‌చంద్ర బోసు నాయకత్వంక్రింద భారత జాతీయ సైన్యం ఏర్పడింది. మిత్రసేనలతో ఈసైన్యం అనేక పోరాటాలు చేసింది. చివరకు బర్మా మలయాలు తిరిగి మిత్రరాజ్యాలకు వశమయాక ఈ సైనికులూ వారిసైన్యాధికారులూ అరెస్టు చేయబడ్డారు.

ఇండియా ప్రభుత్వం వీరి నాయకుల్ని యుద్ధనేరస్థులుగా పరిగణించి, విచారణ చేయబోతూంది. సైనికులందరినే కాకుండా అధికారుల్ని మాత్రమే విచారణ చేయబోతున్నామనీ, యితరుల్ని విడచిపెడుతున్నామనీ, ఎంతో దయతో ప్రవర్తిస్తున్నట్లు ఒక ప్రకటన చేసింది.

వీరు గొప్ప త్యాగాలుచేసిన భారతస్వాతంత్ర్య వీరులంటూ కాంగ్రెసునాయకులు బ్రహ్మరథం పడుతున్నారు జాతీయ పత్రికలు స్తోత్రపాఠాలు కురిపిస్తున్నాయి.

సామ్రాజ్యవాదులొక వైపున, న్యాయశాస్త్రం సాకుతో తమ నిరంకుశ విధానాన్ని కప్పిపుచ్చుకొంటూంటే, మరోవైపున జాతీయపత్రికలు సంకుచితమైన ధోరణిలో, కేవలం, బ్రిటిష్ వ్యతిరేకతకు మాత్రమే ప్రాధాన్యత నిస్తున్నాయి. నిజమైన ప్రజాఅభిప్రాయాన్ని అవి చిత్రించడములేదు.

భారత జాతీయ సైన్యం విషయంలో సరియైన నిర్ణయానికి రావాలంటే, మనమొక ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలి. ఈ సైన్యం నిజంగా స్వాతంత్ర్య సైన్యమేనా ? ఫాసిస్టు జపానుతో చేతులు కలపడవల్ల మన దేశానికి స్వరాజ్యం వచ్చియుండేదా ? దీన్నినిర్మించి పోషించినది జపాను

సామ్రాజ్యవాదులే అయినప్పుడు, ఇది జయించి యున్నట్లయితే మన నెత్తిమీద ఈరోజున వారేగదా అధికారం చలాయిస్తూఉండేవారు !

జాతీయ సాంప్రదాయాలకు విరుద్ధం

బ్రిటిష్ ప్రభుత్వంపైన మనకెంతయినా క్రోధం ఉండవచ్చు గాని, మన జాతీయోద్యమంయొక్క సాంప్రదాయాలకు విరుద్ధంగా మరొక సామ్రాజ్యవాద దేశానికి ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని, సహాయం చేయడం కూడనిపని. అట్టివిధానం మన మవలంబించడంవల్ల స్వరాజ్యం లభిస్తుందనుకోవడం వెర్రితనం. బ్రిటిష్‌నిరంకుశాధికారుల నిర్బంధ విధానానికి గురియైన మన సోదర దేశీయుల్ని రక్షించడం మన కర్తవ్యం. కాని మన జాతీయోద్యమంయొక్క ప్రజా స్వామ్య సాంప్రదాయాలలో ఎట్టి సామ్యంలేని ఫాసిస్టుల అనుకూలశక్తుల్ని స్వాతంత్ర్య వీరులంటూ స్తుతించడం సరికాదు. మన తరువాత వచ్చే తరాలవారు, మనంచేసిన పొరబాటును నిందించి, తీరుతారు.

ఈ భారత జాతీయసైన్యంలో అనేక తరహాలవారున్నారు. బ్రిటిష్ సైన్యాధికారులు బర్మానుంచి వెనక్కువచ్చినప్పుడు వీరిలో చాలామంది భారతీయసైనికులు బర్మాలోనే వుండి జాతీయసైన్యంలో సామాన్య సైనికులుగా పోయారు. వీరిలో మలయా సయాం మొదలైన దేశాల్లో బ్రిటిష్ ప్రభుత్వం క్రింద ఉద్యోగాలుచేసే సివిలియన్ ఉద్యోగస్థులుకూడా ఇందులో చేరారు. అధికారుల విషయం యిది. మరికొందరు ఇదివరకు బ్రిటిష్ పాలకవర్గం క్రింద మిలిటరిలో ఆఫీసర్లుగాను నాన్‌కమీషన్డ్ ఉద్యోగస్థులుగాను పనిచేసినవారుకూడా యీకొత్తసైన్యంలో పెద్దపదవుల్లోకి వచ్చారు. మరొక భాగం మధ్యతరగతినుంచి వచ్చిన భారతీయవిద్యాధికులు. వీరు అంతకుముందే జీవనాధారం కొరకు యితర దేశాలకువెళ్ళి అక్కడే నివాసాలేర్పరచుకున్నారు. వీరు సుభాష్‌బోసు యేర్పరచిన తాత్కాలిక ప్రభుత్వంతో కలిసి పనిచేశారు. మన దేశములో, భారతసైనికులెలా నివసిస్తున్నారో ఎలా పనిచేస్తున్నారో, ఎలా ఆలోచిస్తున్నారో యీ

జాతీయసైన్యములో చేరినవారిలో ఎక్కువ మంది. అలాగే జీవించేవారు, అలాగే పనిచేసేవారు, అలాగే ఆలోచించేవారు. పొట్టకూటికోసం బ్రిటిష్ అధికారులక్రింద సైనికులుగాచేరినట్లే, జపానుఅధికారులక్రింద వీరుచేరారు. త్వరలో తమ దేశానికివెళ్ళిపెళ్లాం బిడ్డల్ని చేరుకోవడానికి యిదితప్ప మరో మార్గం వారికికనబడలేదు. అందువల్ల మలయన్ ప్రజలలోగాని, బర్మాప్రజల్లో గాని వీరు విశ్వాసపాత్రులుకాలేకపోయారు. తూర్పుబెంగాల్‌లోను, అస్సాంలోను, ప్రజలు నీగ్రోసైనికులపట్ల ఎలాంటి అభిప్రాయాన్ని కలిగియుండేవారో, బర్మా మలయాలలోను ఇతరఆగ్నేయ ఆసియాదేశాలల్లోను, ప్రజలు యీ భారత జాతీయ సైన్యాన్ని గురించి సరిగా అలాంటి అభిప్రాయాన్నే కలిగి యుండేవారు. అందుకు కారణాలు కూడా ఒకటే. యుద్ధకాలమంతా బర్మాలో నివసిస్తూ పనిచేసిన ఆంధ్రకార్మికులు, తమిళకార్మికులు, ఒరియా కార్మికులు, చిట్టగాంగ్‌కార్మికులు మాకిచ్చిన భోగట్టానుబట్టి తెలుసుకో కల్గింది యేమంటే, మన దేశంలో ఉన్న భారత సైనికుల్ని మన సైనికులుగా ఎంత పరిగణిస్తున్నామో, వీరుకూడా భారతజాతీయసైన్యాన్ని అంతగానే తమ సైన్యంగా పరిగణించారు.

ఇదీ గత చరిత్ర.

జపాను ఓడిపోయాక

మలయా, బర్మాలలో జపానుసేనలు ఓడిపోయాక భారత జాతీయ సైనికులలో ఎక్కువమంది బ్రిటిషువారిచేతుల్లోపడ్డారు. బ్రిటిషు అధికార్లు వీరిపట్ల అతిక్రూరంగా, కసితీర్చుకుంటున్నట్లు ప్రవర్తించారు. మొదట వీరిని జైళ్ళలో నిర్బంధించడం. తరువాత భోగట్టాకోసం చిత్రవధలు చేయడం జరిగింది. ఈ విధంగా సి. ఐ. డీ. లు "పరీక్ష" చేసిన తరువాత కొందరిని విడుదల చేసేవారు. కాని, వెంటనే వారివారి గ్రామాలకు పంపివేసి, అక్కడనుంచి కదలకూడదని ఇంటర్న్‌మెంటులో వుంచారు. ఆయా గ్రామాలలో గ్రామమునసబులు, కరణాలు వీరిజీవితాన్ని దుర్భరం చేస్తున్నారు. పంజాబులో అనేక గ్రామాలనుంచి ఇట్టి రిపోర్టులు మాకు

చాలా వస్తున్నాయి. కొన్నివేలమంది యింకా జైళ్ళలోనే మ్రగ్గుతున్నారు వారినిగురించి ప్రభుత్వం ఎట్టి వివరాలను ఇవ్వడంలేదు ఎంతమంది ఉన్నారో, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయో మొదలయిన భోగట్టానహితం మనకు రావడంలేదు.

వీరిని విచారణచేసే నైతికాధికారం విదేశప్రభుత్వానికి లేదు. భారతీయులకు అధికారం హస్తగతం చేయకుండా నిరంకుశంగా పరిపాలించడం వల్లనే భారత జాతీయసైన్యంలో అనేకులు చేరారు. బ్రిటిష్ పరిపాలనక్రింద భారతీయుల స్వాతంత్ర్యాశయం భగ్నమవుతూండడం వల్లనే అసంతృప్తితో వీరు మరొక సామ్రాజ్య సైన్యంలో చేరారు.

త్రోవతప్పిన దేశభక్తులు

యుద్ధకాలంలో మనం జాతీయప్రభుత్వాన్ని సాధించుకొన గలిగి యుంటే, వేలకొలదియున్న మన తోడి దేశీయులు యిప్పటి మాదిరిగా జైళ్ళలో మ్రుగ్గవలసినగతి పట్టేదికాదు, వారిని త్రోవతప్పిన దేశభక్తులుగా పరిగణించి, ఆప్రభుత్వం సరియైన రాజకీయ పరిజ్ఞానము ఇచ్చియుండేది. ఆర్థికంగా ధనసహాయం, ఇతర సహాయముచేసి, ఉత్తమ పౌరులనుగా తయారుచేసి యుండేది. పునర్నిర్మాణ కార్యక్రమంలో వారి సహకారాన్ని తీసికొని యుండేది.

ఏయే జైళ్ళలో భారత జాతీయసైనికులు నిర్బంధింపబడి ఉన్నారో అక్కడికివెళ్ళి యింటర్వ్యూచేయడానికి ప్రభుత్వం పత్రికా విలేఖరులకు ప్రజా నాయకులకు అవకాశం కల్పించవలసిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తూంది.

ఈ సైన్యంలో పనిచేసిన వారందరినీ, వారి నాయకులతో సహా వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలి.

వారిని ఇప్పుడు శిక్షించడం అంటే, కసితో క్రూరంగా ప్రవర్తించడమన్నమాట. అలాచేస్తే, అన్ని పార్టీలకు చెందిన ప్రజలు బ్రిటన్ పట్ల మరింత క్రోధావేశులౌతారు. మన బానిసత్వాన్ని జ్ఞాపకంచేసే పనులు

బ్రిటిష్ ప్రభుత్వం చేసినకొద్దీ భారతీయ హృదయంలో వ్యధ ఎక్కువౌతుంది. ఇందువల్ల బ్రిటన్ - భారత దేశాల మధ్య ద్వేషం మరింత హెచ్చుతుంది.

వీరిలో అధిక సంఖ్యాకులు రైతు యువకులు. వీరి నైతిక ఆశయాలు, సంఘ చైతన్యం, మొదట బ్రిటిష్‌పాలకవర్గందెబ్బ తిన్నాయి; తరువాత జపాన్ "శిక్షణ" క్రింద నాశన మయాయి. వీరి అధికారులలో కొందరికి అభివృద్ధి నిరోధకమైన ఫాసిస్టు భావాలు నాటుకున్నాయి. మిగిలినవారు బ్రిటిష్ సామ్రాజ్యవాదంయెడలగల ద్వేషంకొద్దీ అనేక క్రూర కృత్యాలుచేసినా, యుద్ధంవల్ల ఏర్పడిన అసాధారణ పరిస్థితుల్లో అవి తప్పనిసరి అని భావించారు. వీరంతా దేశభక్తిగల మధ్యతరగతి యువకులు. వీరిలో ఫాసిస్టు భావాలు జీర్ణించాయని చెప్పటానికి వీలులేదు. తప్పుమార్గం పట్టిన దేశభక్తులనే వీరిని పిలుస్తాం.

ఇన్ని తరహాలవారున్నారు భారతీయ సైన్యంలో. వీరంతా భారత స్వాతంత్ర్య యోధులంటూ స్తోత్ర పాఠాలు కురిపించడంమాని,, వారందరి విడుదలకు మనమంతా తీవ్రంగా పనిచేదాం. వారివారి గ్రామాలకు తిరిగి వెళ్ళి వివిధ వృత్తులలో పని చేసుకునేటా వసతులు కల్పిద్దాం. ఏ ప్రజల నుంచి వారు వచ్చారో, ఆ ప్రజలమధ్యకు వారిని తిరిగి తీసుకువెళ్దాం.

వారిని భారత స్వాతంత్ర్య సైనికులుగా చేయడానికి ఇదే సరియైన పద్ధతి.

అ ను బ ం ధ ం

ఇంకా బెంగాలు జైళ్ళలో మ్రగ్గుతున్న 26 గురు కమ్యూనిస్టులు— ఇదివరకు టెరరిస్టులుగా ఉండి శిక్షింపబడి, తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరారు. మొత్తం వారందరూ 378 సంవత్సరాలు జైలుజీవితం అనుభవించారు.

పేరు.	కేసు		రెమిషన్లుపోను అనుభవించిన జైలు వాసం.
1. అంబికా చక్రవర్తి	చిటగాంగ్ ఆయుధాగారం పై దాడి సందర్భంలో	ద్వీపాంతరవాసం	15½సం॥
2. అనంతసింగ్	..	..	16½
3. గనేష్ ఘోష్	..	..	..
4. సుఖేందు దస్తీదారు	..	..	..
5. సాహిరాందాస్	..	..	..
6. సుబోధ్ చౌదరీ	..	..	..
7. లాల్‌మోహన్‌సేన్	..	..	..
8. కాలి చక్రవర్తి	చాంద్‌పూర్ పోలీసు ఇనస్పెక్టరుపై హత్య సందర్భంలో	..	18
9. హరిపాద భట్టాచారి	అసనుల్లాపై హత్య	..	17
10. సునీల్ చటర్జీ	వాట్సనుమీద హత్యాప్రయత్నం	..	15
11. నలినీదాస్	కారన్‌వాలీస్ బజారులో కాల్పులసందర్భంలో	..	14½
12. జగదానందముఖర్జీ	..	..	..

13. వినాయిరాయ్	గ్రాస్‌బీమీద దాడి. ప్రయత్న సందర్భంలో	ద్వీపాంతరవాసం 15సం॥
14. కమలాక్ష్య ఘోష్	బర్జీహత్య	.. 13
15. సుకుమారసేన గుప్త	"	.. ..
16. ప్రవాతచక్రవర్తి	అంతర్రాష్ట్రీయ కుట్రకేసు (కలకత్తా)	.. 12
17. హృషికేశభట్టాచార్జీ	హలీమెయిల్ దోపిడీ కేసు	.. 13
18. జీరాజెదేవ్	కొమిల్లా హత్య కేసు	.. 15
19. అమూల్యరాయి	ఢాకా సి. ఐ. డీ మర్దరుకేసు	.. 14
20. అతు భరద్వాజ్	ఫరీద్‌పూరు సి.ఐ.డీ.మర్దరుకేసు	.. 11
21. నరేన్‌ఘోష్	దనాజ్‌పూర్ కుట్రకేసు	15సం. 14 సం॥
22. హేమబక్షి	రంగపూరు కుట్రకేసు	ద్వీపాంతరం 15
23. మోక్షదాచక్రవర్తి	బాయాదోపిడీకేసు	.. 13½
24. ప్రియదాచక్రవర్తి	..	.. 13½
25. అమూల్యఆచార్‌జీ	చిటగాంగ్ సి.ఐ.డి.హత్య	.. 10-9½
(పూర్తిశిక్ష ననుభవించింతర్వాత విడుదలచేయబడిన సెక్యూరిటీ ఖైదీ.)		
26. మాధుబెనర్జీ	గవర్నర్నుహత్యాప్రయత్నం	10 సం॥కాలం (మళ్ళీఅరెస్టుచేసి 3 సం॥లుంచారు)

గత మూడునెల్లలో 29 మంది విడుదలచేయబడ్డారు. అందులో 24 గురు జైలులో ఉండగనే పార్టీలోచేరారు. వీరు 24 గురు సుమారు 290 సం॥లు జైలుజీవితం అనుభవించారు.

వర్కింగు కమిటీ తీర్మానం - పి. సి. జోషి ప్రకటన

డిశెంబరు 11, 12 వ తేదీలలో కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశమై కమ్యూనిస్టులను విచారించేందుకు నియమింపబడ్డ సబ్ కమిటీ

(సర్దార్‌పటేల్, నెహ్రూ, పంత్ సభ్యులు)వారి రిపోర్టును చర్చించినమీదట కాంగ్రెసు కార్యవర్గస్థానాల్లో కమ్యూనిస్టులుండరాదని తీర్మానించబడింది.

వర్కింగుకమిటీ తీర్మానపాఠం

సబ్‌కమిటీ రిపోర్టును విచారించి. వారి రికమెండేషన్లను ఆమోదించడమైనది.

యస్. జి. సర్దేశాయి; వి, జి. భగ్వత్; వి.డి. ఛితేల్; కే.యం. అష్రాఫ్; జహీర్; సోహన్‌సింగ్‌జోష్; కార్యానందశర్మ, ఆర్. డి. భరద్వాజ్ - గార్లపై డిసిప్లినరీచర్య తీసుకొంటూ, వారు ప్రస్తుతం ఏవైనా కాంగ్రెసులో కార్యవర్గస్థానాల్లో ఉన్నట్టయితే వాటినుంచి, తొలగించబడతారు.

రాష్ట్రకాంగ్రెసు సంఘాలుగూడా ఆయారాష్ట్రాల్లో కాంగ్రెసు కార్యవర్గ పదవుల్లో ఉన్న కమూనిస్టులను వాటినుంచి తొలగించుతాయి.

సబ్‌కమిటీ రిపోర్టు

పూనాలో జరిగిన కాంగ్రెసువర్కింగ్ కమిటీ సమావేశములో స్పెషల్‌కమిటీ కమ్యూనిస్టులనుగురించి ఈ విధంగా నివేదించింది.

కమ్యూనిస్టుపార్టీవారి కార్యకలాపాలను గురించి, కమ్యూనిస్టు వ్యక్తులనుగురించీ, క్రింది కాంగ్రెసు సంఘాలనుంచి, ప్రముఖ కాంగ్రెసువాదులనుంచీ చాల ఆరోపణలు వచ్చాయి. వర్కింగు కమిటీ ఈ సబ్‌కమిటీని నియమించి, ఆ వచ్చిన నేరారోపణలను విచారించి, అవసరమైన చర్య తీసుకోమని కోరింది. మేము (సబ్‌కమిటి) ఆ విధంగానే జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా సాక్ష్యమును విచారించి కొన్ని ఆరోపణలు చేశాం.

మా ఛార్జిషీటు సెప్టెంబరు 21 న కమ్యూనిస్టు ఏ. ఐ. సి. సి. సభ్యుల కందచేయబడింది. రెండువారాల్లోగా దానికి వ్రాతమూలకంగా జబాబివ్వమని ఆ సభ్యులను కోరడమైనది. ఇంకా వారు కోరేపక్షంలో

సబ్‌కమిటీ సభ్యులతో ముఖాముఖి చర్చించవచ్చుననికూడ తెలియజేశాం. వారి కోరికపై ఈ ఛార్జిషీటు తయారుచేయడానికి మేము ఆధారపడిన రిపోర్టు కాపీనికూడ సెప్టెంబరు 24 న ఇచ్చాం. తర్వాత ప్రత్యుత్తరానికి ఇంకొక వారంరోజుల వ్యవధి. కావలయునని సర్దేశాయిగారు అందరి తరపున సెప్టెంబరు 28వ వ్రాసినజాబు చేరింది, ఈకోరిక నంగీకరించాం.

ఈ వ్యవధి ముగిసేలోపలగూడా జవాబు తయారు చేయడానికి సాధ్యపడలేదని మళ్ళీ సర్దేశాయిగారు వ్రాశారు. తప్పకుండా, అక్టోబరు నెలాఖరులోగా జవాబు పంపుతానని సర్దేశాయిగారు చెప్పారు. కాని అలా చేయలేకపోయినారు. ఒక నెల దాటినతర్వాత నవంబరు 27 న వారి ప్రత్యుత్తరం బొంబాయినుండి వచ్చింది.

అది కేవలం ప్రచారం నిమిత్తం వ్రాసిన ఓ పెద్దగ్రంథం. నేరారోపణలలో దేనినిగూడ వ్రేలెత్తి చూపి ఇది తప్పు అనడంగాని, చేసిన తప్పుకు పశ్చాత్తాప పడడంగాని లేదు. మేము ఏ సాక్ష్యంమీద ఆధారపడి వారిమీద రిపోర్టు చేశామో, దాన్ని తిరస్కరించనూ లేదు; మేము ఉదహరించిన డాక్యుమెంటుల నిజాయితీని ప్రశ్నించలేదు. మొదటనుంచి చివరవరకు తాము చేసింది ఏవిధంగా సరియైనదో సమర్థించుకొంటూ కాంగ్రెసుయొక్క మూల సూత్రాలను తీవ్రంగా విమర్శించారు.

మొత్తంమీద చూచుకుంటే వారివాదన అంతా కాంగ్రెసుమీద దాడి చేయడమే. అంతటా అహంకారమే గోచరించుతూ ఉంటుంది.

మేం చేసిన నేరారోపణలన్నీ సక్రమమైనవే నని స్పష్టం చేస్తుంది వారి ప్రతివాదన. అందులో చాల కాలంనుంచి వారు కాంగ్రెసు పాలసీని ఆచరణలో పూర్తిగా వ్యతిరేకిస్తూ, దాన్ని నిరోధించడానికి కృషిచేస్తూ వచ్చారనేది విశదమౌతోంది ఈనాటికీకూడా అంతే. కాంగ్రెసుసంస్థ గౌరవ ప్రతిష్ఠలను కుంటుపరచడమే వారిపని.

ఇంతకూ తేలినవిషయం: వారికేమాత్రం కాంగ్రెసులో విశ్వాసం లేదు. అలాంటప్పుడు కాంగ్రెసు సంస్థలో బాధ్యతాయుతమైన ఏ స్థానంలో ఉండటానికి అర్హులవుతారు? కాంగ్రెసులో తమ స్థానాన్ని వారుకూడా

గుర్తించకపోలేదు. ఈ పై విషయాన్ని గమనించే ముందుగానే కాంగ్రెసు స్థానాల్లోంచి వైదొలగారు. కాంగ్రెసు ప్రాదమిక సభ్యత్వానికికూడా రాజీనామా ఇచ్చారు.

మేం ఏ. ఐ. సి. సి. లోని ఎనిమిదిమంది సభ్యులనూ తొలగించవలసిందిగా కోరుతూ, రాష్ట్రసంఘాలన్నీ కమ్యూనిస్టులు ఏ కార్యవర్గములోనున్నప్పటికి తీసివేయవలసిందిగా ఆదేశిస్తున్నాం.

(బొంబాయి క్రానికల్, 13-12-45.)

కమ్యూనిస్టుపార్టీమీద కాంగ్రెసు వర్కింగుకమిటీ చేసిన ఆరోపణలకు మేము జవాబిచ్చాం. దానిమీద కాంగ్రెస్ వర్కింగుకమిటీ చేసిన తీర్మానం చూస్తే. వారు మా జవాబును చదవనేలేదని అర్థమవుతూంది. మామీద ఆరోపించబడ్డ ప్రతి నేరం నిరాధారమయిందని రుజువుచేస్తూ డాక్యుమెంట్లతోసహా మే మిచ్చిన జవాబును చూడకుండా కళ్ళు మూసుకున్నారు; వినకుండా చెవులుమూసుకున్నారు.

వర్కింగుకమిటీ తీర్మానంలో తామువేసిన నిందల కనుకూలంగా. సందర్భశుద్ధి లేకుండా, మా జవాబులోనుంచి ఉల్లేఖించుకున్నారు; దుర్వినియోగ పరచుకొన్నారు. నిజం తెలుసుకొనడానికి వారు ప్రయత్నించనే లేదు. మాకు వ్యతిరేకంగా వారికి వచ్చిన సాక్ష్యాన్నిమాకు తెలుపవలసిందని మేము కోరితే, వారు నిరాకరించారు; కాని ఆ సాక్ష్యంమీద ఆధారపడే మా మీద తీర్పు చెప్పారు. వారి న్యాయం అలావుంది. ఫిర్యాదు ఏమిటో తెలుపకుండానే ముద్దాయికి శిక్షవేసేరకం న్యాయమూర్తులు వారు.

వారుపయోగించిన భాషనుగూర్చి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. కుట్ర కేసుల్లోను, రాజద్రోహ నేరాల్లోను మా 'డిఫెన్సు'ను గూర్చి సామ్రాజ్యవాదులు ఇదంతా ప్రచారంకోసమే చేస్తున్నారనడం పరిపాటి. కాంగ్రెసు నాయకులు అదే భాషను మా మీద ఉపయోగించారు.

మన మహత్తరమైన జాతీయ సంస్థయొక్క నాయకులకు తగినంత గౌరవం మేమిచ్చాం. మా అంతరాత్మకూ, భారత స్వాతంత్ర్య సాధనకూ

బద్ధులమై, రాజా రామమోహన్‌రాయ్, టాగోర్, సర్ సయ్యద్ ఇక్బాల్ మహాశయుల వారసులకు తగిన విధంగా మేము నిజానికి నిలబడ్డాం. మేముకాదు, దురహంకారంతో అవస్థపడుతున్నది. కాంగ్రెసు నాయకులే గుడ్డి అహంకారాన్ని, గర్వాన్నీ, ప్రదర్శిస్తున్నారు. మేముచేసిన నేరమూ లేదు; చింతింపవలసిన అవసరమూలేదు; మాకు ఎవరి దయా దాక్షిణ్యాలతోను పనిలేదు; కనుకనే మా జవాబు స్పష్టమైన, నిశ్చితమైన మాటల్లో చెప్పాం.

కాంగ్రెసు నాయకులు అవలంభిస్తున్న విచ్ఛిన్నకర విధానం మాకు చాలా విచారకరంగా ఉంది. ఎందుకంటే - అది మమ్మల్ని ఏమో చేస్తుందని కాదు; మావిషయం మేం చూచుకోగలం; మా పార్టీనిగాని, కార్మిక సంఘాలను గానీ, రైతు ఉద్యమాన్నిగాని వారి దయా దాక్షిణ్యాలమీద ఆధారపడికాదు మేము నిర్మించింది. మా రక్తాన్నీ, చెమటనూ ఓడ్చి సర్వ త్యాగాలుచేసి నిర్మించుకున్నాం.

కాని కాంగ్రెస్ నాయకులపంథా మాకు బాధ కలిగిస్తున్నది. ఎందుకంటే - అది భారత స్వాతంత్ర్యాశయానికే దెబ్బకొడుతుంది. దానివల్ల బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా అందరం కలసి చిట్టచివరి పోరాటం చేయవలసినరోజు దూరమవుతుంది.

కాంగ్రెస్‌యొక్క ప్రధాన సూత్రానికి వ్యతిరేకంగా నడిచింది మేము కాదనీ, కాంగ్రెస్ నాయకత్వమే కాంగ్రెస్ పాలసీకి విరుద్ధంగా నడిచిందనీ - మా జవాబుతో మేము స్పష్టపరిచాం.

బ్రిటిష్ పాలకులతో రాజీ రాయబారాలూ, ప్రజలముందు ఏదో పొడిచేసినట్టు ఆర్భాటాలూ - ఇది రెండు నాలికల ధోరణి. దీని అర్థం ఏమిటి? అటు ఢిల్లీ దొరలవైపు మొగ్గడం, ఇటు ప్రజలముందు పోరాటాలంటూ అట్టహాసాలు చెయ్యడం!

సిమ్లా నగుబాటు తర్వాత, బెంగాల్ కాల్పులమీద అహింసా ధర్మోపదేశాలు తర్వాత, వారి పోరాట ఆర్భాటం వేవెలుతో సంప్రదింపుల్లోకి

[illegible] వరత కిదే నిదర్శనం! చేసేదొకటి, చెప్పే దింకొకటి — ఇదికాదు స్వాతంత్ర్యోద్యమానికి మార్గం. కాంగ్రెస్ ఒకానొక సంస్థ అనేకాకుండా, నాయకులు కాంగ్రెస్ అంటే భారతదేశంలోని 40 కోట్ల ప్రజానీకం అని అనుకుంటున్నారు. ఈ వీరభూమిలోని దేశభక్తి [illegible] తే అనుకుంటున్నారు. ఇది జాతీయ [illegible].

[illegible] మెంతవరకు ఏకీభవిస్తామో, ఎక్కడ [illegible] మా జవాబులో స్పష్టపరిచాం. బ్రిటిష్‌సామ్రాజ్య [illegible] జమీందార్లకూ వ్యతిరేకంగా సాంప్రదాయ [illegible] కాంగ్రెస్ పోరాటాన్ని ఎవరు ఆటంక పరిచేదీ భవిష్యత్తే నిర్ణయిస్తుంది. ఆ కాంగ్రెస్ శత్రువులకే ఈనాడు కాంగ్రెస్‌లోకి స్వాగతమిస్తున్నారు; వారినే కౌగిలించుకొంటున్నారు. కాని, భారతదేశంలో ఎక్కడన్నా చైతన్యంపొందిన కార్మికవర్గం ఉన్నదన్నా, రైతుఉద్యమం ఉన్నదన్నా, వాటిని నిర్మించిన మమ్మల్నిమాత్రం, కమ్యూనిస్టుల్ని మాత్రం కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్‌నుండి తరిమికొడుతున్నారు.

విషయాలు తెలుసుకోకుండానే మా పార్టీ దేశద్రోహ కరమైందన్నారు. స్వతంత్రంగా మా పంథాను స్పష్టపరచుకొనేదానికోసం, నిజాన్ని నిలబెట్టుకొనేదానికోసం, కాంగ్రెసు—కమ్యూనిస్టు ఐక్యతకొరకు కృషి చేసేదానికోసం—మేము కాంగ్రెసునుంచి తొలగవలసి వచ్చింది. అహంకారంతోను, అపోహలతోను, కూడిన వారి ప్రస్తుతపంథా విఫలం కాక తప్పదు. మా పంథా సౌభ్రాతృత్వంతోను సౌహార్దత్వంతోనూ కూడింది కనుక, మా శాయశక్తులా మేం పనిచేస్తాం. నిజమైన దేశభక్తియుత పంథాకోసం, ప్రాంతీయ ఆర్థిక, వైజ్ఞానికశాఖలతో సమగ్రమైన జాతీయోద్యమంకోసం, బ్రిటిష్ సామ్రాజ్యవాదంమీద [illegible]త్యపోరాటం సాగించడంకోసం మేం నడుంబిగించి కృషిచేస్తాం.

*

ప్రజాశక్తి ప్రెస్, మొగల్‌రాజపురం, బెజవాడ.
పర్మిట్ నెం. కె. 13/సి.—10,000 — 18–2–46.

END OF
TITLE